
చరిత్ర

# భారతదేశీయ సంఘ సంస్కర్తలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


“ మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి “

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భారత దేశీయ
# సంఘ సంస్కర్తలు

రచయిత :

**పేరి సూర్యనారాయణ**, బి. ఏ., ఎల్. టి.,

రిటైర్డ్ హెడ్మాస్టర్

గాంధినగర్ - అనకాపల్లి

విశాఖపట్నం జిల్లా (ఆంధ్రప్రదేశ్)

[మూల్యము ఒక రూపాయి 75 న.పై.

# ఉపోద్ఘాతము

ఇండియా అనబడు మన భారతదేశమున, నైసర్గిక, శీతోష్ణ, వర్షపాత, సహజసంపదలందును, ప్రజల జాతి, మత, కుల, భాషా విషయాది సాంఘిక విషయములందును, పెక్కు భేదములున్నవి. అట్లయినను ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులందు చాలవఱకు ఏకత్వము సాధించుట భారతీయుల ప్రథమ కర్తవ్యము. భిన్నత్వమున ఏకత్వము ఏర్పరచి ప్రజల జాతీయ ఐక్యభావమును, సామరస్య, సహకార సహజీవముల సహాయ్యమున సాధించుటయే మన స్వతంత్ర భారత ప్రభుత్వముయొక్క ముఖ్యాశయము. ప్రాచీనమునుండి నేటివఱకు భారతదేశ సాంఘిక - మత సంస్కర్తల కృషిని వారి జీవితాంశములను తెలియజేయుచు, ఐక్య జాతీయ లక్ష్యమును స్థాపింప వారి ప్రయత్నములను చెల్పుటయే ఈ గ్రంథము యొక్క ముఖ్యోద్దేశము.

రచయిత

# విషయ సూచిక


| పాఠ్య సంఖ్య | పాఠ్య విషయము | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | మన మాతృభూమి—సంఘ నిర్మాణము | 1 |
| 2. | భారతదేశము—వివిధ జాతుల ప్రజలు—వారి వారి సంస్కృతుల సమ్మేళనము | 10 |
| 3. | విదేశీయుల దండయాత్రలు—మతసాంఘిక పరిస్థితులపై వాని ఫలితము | 23 |
| 4. | సాంఘిక ప్రతిష్టంభన—సాంఘిక దుస్థితి | 33 |
| 5. | నూతన భావోదయము—సంఘ సంస్కరణ ప్రారంభము | 42 |
| 6. | సంఘ సంస్కర్తలకు సాంఘికాది పరిస్థితుల తోడ్పాటు | 47 |
| 7. | కొందరు ముఖ్యులగు సాంఘిక సంస్కర్తల జీవితాంశములు, వారి బోధనల వలన కలిగిన సాంఘిక ఫలితములు | 59 |
| 8. | మధ్య యుగము, ఆధునిక యుగ తొలిభాగము క్రీ॥ శ॥ 1000-1500; 1500-1850 | 67 |
| 9. | మధ్యయుగ, ఆధునిక ప్రథమ భాగములు | 74 |
| 10. | పందొమ్మిదవ, ఇరువదవ శతాబ్దముల భారతదేశము సాంఘిక సంస్కర్తలు—జ్ఞానులు | 86 |

# భారతదేశ సంఘ సంస్కర్తలు

## మన మాతృభూమి - సంఘ నిర్మాణము

మన మాతృదేశమగు భారతదేశము ప్రపంచమున ఇండియా అని పిలువబడుచున్నది. నైసర్గికము, వాతావరణము, సహజమగు చెట్లుచేమలందు దేశమునగల వివిధభాగములలో భేదములుగలవు. ప్రజలలో జాతిభేదములు, సాంఘిక, మతభేదములు ఉన్నవి. అందుచే మనదేశమున చాలావిషయములలో భిన్నత్వము ఈభాగములందు కనపడును.

కాని దేశ లక్షణములందు, అందు నివసించు ప్రజలవిషయము నను భిన్నత్వమున్నను. సూక్ష్మపరిశీలనవలన ఈభిన్నత్వముల నడుమ ఏకత్వలక్షణములున్నవని బోధపడును. అందుచే మనదేశ భౌగోళిక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక విషయములందుగల ఏకత్వలక్షణము లను పరిశీలింపవలెను. భారతదేశము వైశాల్యమున మిక్కిలి పెద్దదై ఉపఖండమువలె నున్నది. ఎత్తు పల్లములందు, శీతోష్ణవర్షపాతము లందు, సహజసంపద విషయమున, ఖండములో ఏయే భేదములుం డునో, మనదేశమునకూడ అట్టి భేదములున్నవి. దేశమునకు అన్ని వైపుల సహజములగు ఎల్లలు గలవు. ఉత్తర, పశ్చిమోత్తరము లందు, ఈశాన్యమునందు పర్వతపంక్తులు హద్దులు. అందు ఉత్తర మునగల హిమాలయములు మహోన్నతములు. తూర్పుదక్షిణ పశ్చిమములందు మనదేశమునకు సముద్రములు ఎల్లలు. అందుచే విస్తీర్ణమున ఉపఖండముగానున్నను, దేశమునకు వలయు సహజము లగు ఎల్లలు భారతదేశమునకు ఉన్నవి.

భారతదేశమున గల ప్రజలలో మిక్కిలి ఎక్కువమంది హిందువులు. వారి మతము హిందూమతము. అది వేదశాస్త్రముల మీదను, పురాణములమీదను ఆధారపడినది. జనసంఖ్యలో నూటికి ఎనుబది పాళ్లు హిందువులు. తక్కిన అల్పసంఖ్యాకులగు జాతుల వారిలో మహమ్మదీయులు, సిక్కులు, క్రైస్తవులును, వారికి తరు వాత దిగువగా పార్శీలను, జైనులను, బౌద్ధులను, యూదులను లెక్కింపవచ్చును. జైన, బౌద్ధ, సిక్కుమతములు హిందూమతము నుండియే పుట్టినవి కావున వానిని అవలంబించిన భారతీయులను హిందువులుగానే పరిగణింపవచ్చును. వేదాంతమతముమీద స్థాపిత మైన హిందూమతమున, ఈమతములలోని ముఖ్యాంశములు కొన్ని గలవు. సహజస్వభావమున హిందువులు శాంతిప్రియులు; రక్తపాతము నకు దారితీయు మతకలహములకు చోటీయరు.

జాతి విషయముననేగాక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక లక్షణములందు, ప్రజలలో జాతీయ భావము పుట్టి పెరుగుటకు అవ కాశములున్నవి. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక లక్షణములు కొన్ని భారతజాతీయతకు ఎక్కువగా తోడ్పడినవి. బహుప్రాచీనకాలము నుండి నేటి ఇరువదవ శతాబ్దారంభము వఱకు భారతదేశమున పెక్కు సామ్రాజ్యములు పుట్టి, పెరిగి, నశించినవి. ధైర్యపరాక్రమబల ములుగల రాజులు, రాజ్యములుజయించి, సామ్రాజ్యములు ఏర్పరచి, తమ పాలనలోగల ప్రజలందు జాతీయభావము పెంపొందునట్లు చేసిరి. కాని వీరి సామ్రాజ్యములు బలవంతులగు పాలకులున్నంతకాలమే నిలుచుటచేత జాతీయభావముస్థిరపడుటకు అవకాశములు లేకుండెను. క్రీ॥ శ॥ 1757లో ప్రారంభమయిన, బ్రిటిష్ ఇండియా సామ్రాజ్యము క్రీ॥శ॥ 1947 వఱకు నిలిచి దేశమంతయును ఆక్రమించినది. అంతకు ముందుక్రమముగా ఏర్పడిన, మౌర్య, గుప్తహర్ష, ఆఫ్ఘన్, మొఘల్, మహారాష్ట్రసామ్రాజ్యములు దేశమున కొంత కొంత

భాగములు మాత్రమే వ్యాపించినవి. దేశమంతటను బ్రిటిష్ ఇండియా సామ్రాజ్యమురీతి ఆక్రమింపలేదు. అయినను ఆసామ్రాజ్యములు జాతీయ భావమునకు తోడ్పడినవే.

ఆర్థికవిషయమున భారతీయులలో పెక్కు భేదములున్నవి. కోటీశ్వరులనుండి క్రిందికి అనాధలవఱకు తరగతులుగలవు. ప్రాచీనమునుండి నేటివఱకు ఇట్టి భేదములు ప్రజలందు గలవు. ఇట్లుండుట మన ఒక్క దేశముననేకాదు, చాల దేశములందు ఇట్టి పరిస్థితులే యుండును. కాని యిప్పుడిప్పుడు ప్రజలలో ఇట్టి గొప్ప, బీదతరగతి భేదములు తొలగించి, ఆర్థిక సమానత్వము స్థాపించు యత్నములు జరుగుచున్నవి.

ఇప్పుడు కాలగతిని అనుసరించి చారిత్రికముగా, ప్రాచీనమునుండి నేటివఱకు మనదేశమున ప్రజలలో సాంఘిక భేదములు ఎట్లు పుట్టి పెరిగినవో పరిశీలింపవలెను. బహుప్రాచీనకాలమున ప్రపంచమున, నాగరకతకు పేరుపొందిన నాలుగు ప్రపంచభాగములలో భారతదేశభాగమగు హిందూస్థాన మొకటి. ఇప్పటికి ఆరువేల సంవత్సరములక్రింద నైలునదియే ఉత్తరమైదానభాగమగు ఈజిప్టు దేశము. జంటనదులగు యూఫ్రటీస్ టైగ్రెసు నదులు ప్రవహించు మెసపొటేమియాభాగము, తూర్పు చీనాదేశమున హొయాంగ్ హోయాంగ్ సికి యాంగు నదులుపారు మైదానము, తక్కిన మూడు నాగరికత భాగములుగా నుండెను.

క్రీ॥ పూ॥ పదివేల సంవత్సరముల క్రింద, ప్రపంచమున గల అన్ని దేశములందువలెనే మన భారతదేశమున, నివాసయోగ్యములగుచోట్లలో అనాగరిక ప్రజలుండిరి. వారే ప్రాతరాతి యుగము వారు, వారి సంతతివారు క్రొత్తరాతి యుగమువారు. ప్రాతరాతి యుగపు అనాగరికులు దిగంబరులు, గుహాలందు, పొదరిళ్లలోను నివసించిరి. జంతువులను వేటాడి వాని పచ్చిమాంసము తినుచుండిరి,

వారు చదునుగాని రాతిపనిముట్లు ఉపయోగించుచుండిరి. క్రొత్త రాతి యుగమువారు వారికంటె చాలానయము. వారికి ఇళ్లుకట్టుట, బట్టలునేయుట, నిప్పుచేసి ఆహారమువండుట తెలియును. వారి పని ముట్లుకూడ రాతివే, కాని చదునైనవి. తరువాత కొంతకాలమునకు వారికి లోహముల ఉపయోగము తెలిసెను. లోహములతోచేసిన పనిముట్లు వాడసాగిరి.

ఉత్తర హిందూస్థానమున తొలుత రాగి వాడబడెను. దక్షిణ భారతదేశమున ప్రజలు తొలుత ఇనుము వాడిరి. రాతియుగముల అనాగరికులకు చెందిన వస్తువులు మొదలయినవి ఇప్పుడు ప్రభుత్వము వారు సాగించిన త్రవ్వకములవలన లభించినవి. అట్టి రాతియుగపు వస్తువులు దక్షిణ ఇండియాలో ముఖ్యముగా మద్రాసు మైసూరు రాష్ట్రముల మెట్ట భూములందు బయల్పడినవి. కాని అట్టి వస్తువులు ఉత్తర భారతదేశమున ఎచ్చటను కానరాలేదు.

భారతదేశపు ఆదినివాసులు ఉత్తర ఇండియాలో కొలేరియన్ జాతికిని, దక్షిణ ఇండియాలో ముండారీ తెగలవారికిని చెందినవారు దక్షిణభారతమున తోడాలు, ఖాండులు, సవరలు, గదబలు కోయలు ముండారీ తెగలవారు. మధ్యఇండియా ఏజన్సీకొండ భూము లలోగల సంథాలులు, భిల్లులు గలరు. కొలదికాలము క్రిందటివఱకు, అనాగరికుల తరువాత భారతదేశమున నివసించిన నాగరికులు ద్రావిడులని తలపబడుచుండెను. కాని నలుబది సంవత్సరముల క్రిందట ప్రభుత్వమువారు సింధునదీమైదానమున సాగించిన త్రవ్వక ముల ఫలితముగా, పంజాబునందు నదీతీరమున హారప్పానగర శిధిల ములు, సింధురాష్ట్రమున నదీతీరమున మొహంజదారోనగర శిధిల ములు బయలుపడినవి. ఇవి ప్రాచీనసింధులోయ నాగరికతకు చెందెను. ఈ స్థలములు ఇప్పుడు పశ్చిమ పాకిస్థాను రాజ్యమునందున్నవి.

హరప్పా, మొహంజదారో నగరముల శిధిలములు నవీనముగా త్రవ్వి కనుగొనబడిన బహుప్రాచీన పట్టణ నాగరికతయగు సింధులోయ నాగరికతకు చెందినవి. ఈనాగరికత నైఋతి ఆసియాలో మెసపొటేమియా అనబడు యూఫ్రటీస్ టైగ్రెసు ప్రాంతములకు చెందిన ప్రాచీన సుమేరియను నాగరికతకు సంబంధించినదని చరిత్రకారుల అభిప్రాయము. సింధులోయలో బయల్పడిన పట్టణశిధిలములలో కాల్చిన యిటుకలచే కట్టబడిన భవనశిథిలములు, ప్రజలువాడిన వస్తువులు గలవు. ఈ సింధులోయ నాగరకత ఉత్తరహిందూదేశమున ద్రవిడ నాగరకతకు పూర్వము నాటిది.

సింధులోయ నాగరకత పట్టణ నాగరకత. మొహంజదారో హరప్పానగర శిధిలములు, సుమేరియా నాగరికతకుచెందిన పట్టణ శిధిలములను, ప్రాచీన ఈజప్టులోగల థేబ్సు, మెంఫిస్‌నగర శిధిలములను పోలినవి. హరప్పానగర శిధిలములలో నడుమ కోటశిధిలములు వానికి నలువైపుల వెడల్పగు రాజబాటలు, వాని ప్రక్కలందుగల విశాలభవనముల శిధిలములుగలవు. ఈభవనములు ఇటుకలచే కట్టబడినవి. ప్రస్తుతమున రాజ్యముల రాజధానీనగరములందుగల ప్రజాసౌకర్యములగు నాటకశాలలు, స్నానమందిరములు, రాతికాలువలు, మొదలగునవి ఈహరప్పా శిధిలములందు గలవు.

తమకు ముందుగల సింధులోయ నాగరికులవలెనే, ద్రావిడులును మంచి నాగరకత కలవారే. కాని వారి నడుమ ఒక ముఖ్యమగు భేదమున్నది. సింధులోయ నాగరికత పట్టణవాసుల నాగరకత. ద్రావిడుల నాగరకత గ్రామీణ నాగరకత; అనగా పల్లెవాసుల, లేక గ్రామవాసుల నాగరకత. ద్రావిడులు ప్రకృతి గంభీరములగు పర్వతములను నదులను, మహావృక్షములను, నాగులను ఆరాధించుచుండిరి. దయ్యములను భూతములనుకూడ పూజించేవారు. సింధులోయ నాగరికులు, ప్రకృతి దేవతయగు దుర్గ లేక కాళిని ఆరాధించే

వారు. ఆ దేవత భర్తయగు శంకరుని అతని విగ్రహముగు శివలింగ మును, అతని వాహనమగు నందీశ్వరుని పూజించేవారు. ఈసింధు నాగరికుల మతారాధనకు, ద్రావిడుల మతారాధనకు కొన్ని సామ్యములున్నవి. అందుచే ఈ సింధులోయ నాగరికత, ద్రావిడుల నాగరకత, ఒకే నాగరకతయొక్క రెండు భేదములు, అవి పట్టణ గ్రామీణ విధానములు తెల్పునేమో యని అనుకొనుటకు ఆధార మున్నది. ఇది ఇప్పటి కొందరి చరిత్రకారుల అభిప్రాయము.

ఆధునిక చరిత్రకారులలో కొందఱు, ద్రావిడులు భారతదేశపు తొలి నివాసులే అనియు, వారే క్రమముగా పడమరగా వలస వెడలి, మెసపొటేమియా భాగములకు వెడలి యుండవచ్చుననియు అభి ప్రాయపడిరి. వారే కొలేరియను జాతివారి సంతతివారేమో! కాని తగిన నిదర్శనములు కనపడువఱకు ఎట్టి నిశ్చయముచేయవీలులేదు. పెక్కు విషయములలో సింధులోయ నాగరకత, సుమేరియా నాగర కతను పోలినది. ఈ రెంటింటి యందును వ్రాతలిపులు ఒకరీతిగా కనబడుచున్నవి. అందుచే పెక్కుమంది, సుమేరియా నాగరికులే తూర్పుగా వలసవెడలి, సింధునదీ మైదానభాగములను ఆక్రమించి యుండవచ్చునని తలచుచున్నారు.

ద్రావిడులు తొలినుండియు భారతదేశమున హిందూస్థాన మైదానమును; దక్షిణమున మహానదీ, గోదావరీ, కావేరీ మైదాన భాగములను ఆక్రమించినట్లు కన్పట్టును. వారు అనాగరికులగు ఆది నివాసులను అడవులకు కొండనేలలకు తరిమి వారి పల్లపు నివాస భూములు ఆక్రమించియుందురు. ద్రావిడుల గ్రామీణ నాగరకతకు, పూర్తియగు స్థానిక స్వతంత్రప్రభుత్వముగలిగి భోగభాగ్యనిలయము లగు గ్రామములే కేంద్రములు. అట్లని ద్రావిడులకు పట్టణములు లేవని తలపరాదు.

సుమారు ఎనిమిది శతాబ్దములున్న తరువాత సింధులోయ నాగరకత హఠాత్తుగా అంతరించినట్లు కన్పడుచున్నది. క్రీ॥ పూ॥ 2800 సంవత్సరమునకు అది అంతరించినది. ఇట్లది నశించుటకు ఒక గొప్ప అనర్థము, లేక ఉపద్రవము కారణమయ్యేనేమో! సింధువరదల వలనగాని, లేక గొప్ప అంటుజాడ్యము లేక ప్రచండయుద్ధము కారణముగా అగి అంతరించియుండవచ్చును. సింధు మైదానమున నివసించిన సింధులోయ నాగరికులు, గంగానదీ మైదానముల నాక్రమించిన ద్రావిడులు ఇరుగు పొరుగులవారై వారి వారి పట్టణ గ్రామీణ నాగరికతలను అభివృద్ధి చేసికొనియుందురు. ఇట్లనుకొనుటకు ఆధారములున్నవి. ఆ నాగరికతల సరిపోలికలందు ఆ యాధారములు కన్పట్టును. ద్రావిడులు తల్లి దేవతదుర్గను, ఆమెభర్త శంకరుని, శంకరునిరూపమగు లింగమును, వాహనమగు నందేశ్వరుని ఆరాధించుట, ద్రావిడులు సింధులోయ నాగరికుల నుండి నేర్చియుండవచ్చును. సింధులోయ మైదానమున పట్టణనాగరకత అంత మొందిన తరువాత ద్రావిడులు ఆభాగమును ఆక్రమించి వారి గ్రామీణ నాగరకతను అచ్చట స్థాపించియుందురు. ఈద్రావిడులనాగరకత క్రీ॥పూ॥ 2800 నుండి క్రీ॥ పూ॥ 2000 వఱకు వ్యాపించినది. క్రీ॥ పూ॥ 2000 నాటికి ఆర్యులు ఉత్తర హిందూస్థానములోనికి వచ్చినప్పటికి ద్రావిడులు సింధుమైదానము లందుండిరి.

ఆర్యులు ఇండియా పశ్చిమోత్తరమునగల పర్వతకనుమ మార్గముల వెంబడి దేశములోనికి ప్రవేశించి కాబూలు నదికి తూర్పున సరస్వతీనదికి నడుమగల "సప్తసింధు" అను ఏడునదులు ప్రవహించు దేశమును ఆక్రమించిరి. అచ్చటగల ద్రావిడులను, యుద్ధముల ఫలితముగా వెడలగొట్టిరి. అప్పటికి ద్రావిడులు కొలేరియనుల సంతతివారగు గ్రామీణ నాగరికులుగా నుండిరి. ఈద్రావిడులు ఉత్తర ఇండియానదీ భాగములందే గాక దక్షిణ ఇండియాలో

గల నదీ భాగములను కూడ ఆక్రమించి యుండిరని కొందరి యూహ. దక్షిణ ఇండియాలో ద్రావిడుల నివాస భూములగు నదీ డెల్టాలు తీరములు గాక తక్కిన దక్కను పీఠభూమి భాగ మంతయు దండకారణ్యమను దట్టమగు అడవిచే నిండి యుండెను.

ఇండియాలోనికి వచ్చిన తొలి ఆర్యులు సప్తసింధు ప్రదేశ మును ఆక్రమించిరి. ఆప్రదేశమునకు వారు "బ్రహ్మావర్తము" అను పేరిడిరి. అచ్చట గల ద్రావిడులను ఓడించి వారిని గంగా మైదాన ములోనికి తరిమిరి. జనసంఖ్య రొక్కటము వలన తూర్పుగా జరిగిన ద్రావిడులు తుదకు బెంగాలు (వంగదేశము)లో గల ద్రావిడులకు రొక్కటము కల్పించిరి. అందుచే అచ్చట గల ద్రావిడులు కొందరు నావలపై బంగాళాఖాతము మీదుగా ఇండియా దక్షిణభాగములకు వలసపోయి, దేశ దక్షిణమునగల కావేరి నదీమైదానమునందు తొలి ద్రవిడ రాజ్యములగు పాండ్య, చోళ, కేరళ రాజ్యములను స్థాపించిరి. అప్పటికి దక్కను భాగము దండకారణ్యముచే నిండియుండెను.

రెండవసారి వలసవచ్చిన ఆర్యులు పంజాబులో ప్రవేశించి అచ్చటి ప్రజలను తూర్పునకు తరుమగా మరల గంగానదీ మైదాన మునగల మరికొందఱు ద్రావిడులకు రొక్కటము కలిగెను. అప్పుడు కొందఱు ద్రావిడులు గంగా మైదానము వదలి, మధ్య ఇండియా ఏజన్సీ నేలలు దాటి దక్కనులో గల దండకారణ్యములో ప్రవేశిం చిరి. కొందఱు వింధ్యపర్వతములు దాటి, సౌరాష్ట్రమునందు, కొంకణ తీరమునందు వలసలు స్థాపించుకొనిరి. మరికొందఱు పశ్చిమతీరము వెంబడి దక్షిణముగా పోయి మలబారు ప్రదేశమును ఆక్రమించిరి. మధ్య ఇండియా కొండనేలలు దాటినవారు దక్షిణముగా వెడలి మహానదీ తీరములందు, గోదావరీ కృష్ణానదుల మైదానభాగములందు రాజ్యములు స్థాపించుకొనిరి.

క్రమముగా క్రీ॥ పూ॥ 2000-1000 సంవత్సరముల నడుమ ఉత్తర ఇండియా భాగమంతయు ఆర్యులచే ఆక్రమింపబడెను. సింధు, గంగానదులు వాని యుపనదులు పారు నేలలందు క్రమముగా పదహారు ఆర్యరాజ్యములు స్థాపితము లయినవి. అవియే గాంధార, కురు, పాంచాల, కోసల, విదేహ, అంగ, వంగ మొదలగు ఉత్తర ఇండియా రాష్ట్రములు. సౌరాష్ట్రమున యాదవ రాజ్యములు, కొంకణ భాగమున రాష్ట్రకూట రాజ్యములు వెలసినవి. దక్కను తూర్పు భాగములందు మహానదీ మైదానమున కళింగ రాజ్యము, గోదావరీ కృష్ణాతీర భూములందు ఆంధ్రరాజ్యము స్థాపింపబడినవి.

భారతదేశ చరిత్ర క్రీ॥ పూ॥ 600 సంవత్సరము నుండియు చారిత్రకముగా, ప్రమాణ సహితముగా ప్రారంభమగును. ఇది పెక్కు చరిత్రకారుల అభిప్రాయము. ప్రాచీనమునుండియు నేటివఱకు దేశమున జరిగిన సంఘసంస్కరణలు, వానికి కారకులగువారి పనుల ఫలితములు పూర్తిగా అర్థము చేసికొనుటకు ప్రాచీన కాలమునుండి నేటివఱకుగల భారతదేశ చరిత్రలోగల రాజకీయ, సాంఘిక, మత సాంస్కృతిక పరిస్థితులయొక్కయు వాని పరిణామములయొక్కయు చారిత్రకాంశములు తెలిసికొనుట ముఖ్యము. పూర్వమునుండియు నేటివఱకు గల సాంఘిక పరిస్థితులకు, సంఘ సంస్కరణ కారణ ఫలితములకు అవినాభావ సంబంధము కలదు. కావున వాని రెండింటిని కలిపియే పరిశీలింపవలెనుగాని, ఒకదానిని విడిచి యొకదానినిగూర్చి మాత్రమే తెలిసికొన యత్నించుట సమంజసముకాదు.

---

# 2. భారత దేశము - వివిధజాతుల ప్రజలు- వారి వారి సంస్కృతుల సమ్మేళనము

నేడు ఇండియా అనబడు స్వతంత్ర భారత దేశమునగల జన సంఖ్యలో ఎక్కువమంది హిందువులు, తక్కినవారిలో మహమ్మదీయులు, క్రైస్తవులు, తదితర మతములవారు కలరు. ప్రాచీన కాలపు ప్రపంచ ప్రజలకు సింధునది తెలిసినదే. 'సింధు' అను పదము నుండియే "ఇండస్" పదము "ఇండో" లేక "హిందూ" పదములు లభించినవి. ఇండియాలో తొలి అనాగరిక ప్రజలు ముండారీ తెగల వారు. అందుగల కొలేరియన్ జాతివారు మాత్రము నాగరికులు. వారి సంతతివారే, వారికంటె మంచి నాగరికతగల ద్రావిడులు.

ద్రావిడులకు ముఖ్యవృత్తి వ్యవసాయము. అదిగాక వారికి వ్యాపారము పరిశ్రమలుకూడ జీవనోపాధులు. వారు ప్రకృతిశక్తులను ఆరాధించుచుండిరి. వారి సంఘములో వర్ణభేధములు లేవు. వారి ఆచార వ్యవహారములందుకూడ భేదములు లేవు. వారి కుటుంబ జీవనమునకు "తల్లి"యే పెద్ద. తల్లినిబట్టియే కుటుంబ పారంపర్య హక్కులుండెను. వారి ముఖ్య దేవత "దుర్గ" అను ఆదిశక్తి. వారి ప్రధాన దేవుడు శివుడు. దుర్గాపూజ, శివలింగారాధన, శివుని వాహనమగు నందేశ్వరుడు, అలంకారములగు సర్పములు వారిచే ఆరాధింపబడుచుండెను.

ద్రావిడ నాగరికతకు గ్రామము పునాది. ద్రావిడ సాంస్కృతికి అది పట్టుకొమ్మ. ద్రావిడుల ఐశ్వర్యప్రాభవములు గ్రామముల అభివృద్ధి ఐశ్వర్యములమీాదనే ఆధారపడి యుండెను. ద్రావిడుల గ్రామములు నిండు స్థానిక స్వాతంత్ర్య ప్రభుత్వములు గలిగిన గ్రామ

పంచాయతీలు. గ్రామ పంచాయతీ ప్రభుత్వము గ్రామీణుల సర్వ సౌఖ్యములకు పాటుపడుటయే కాక, వారి రాజకీయ, ఆర్థిక, న్యాయ, సాంస్కృతిక విషయము లన్నిటియందు పరిపాలనాధికారము కలిగి యుండిరి. ప్రతి ద్రవిడ రాష్ట్రమందును స్వతంత్ర స్థానిక పరిపాలనము గల గ్రామ పంచాయతీ లుండెను. ఆ రాష్ట్రప్రభుత్వమువారు ప్రతి స్వతంత్ర గ్రామము అజమాయిషీ దేశరక్షణలకుగాను ప్రతిగ్రామము నుండి కేంద్రప్రభుత్వమునకు చెల్లించవలసిన పన్నులు మాత్రమే వసూలు చేయుచుండిరి. తక్కిన అన్ని విషయములందును గ్రామ పంచాయతీకి సంపూర్ణ స్థానికాధికార ముండెను. అందుచే అట్టి స్వతంత్ర పాలనగల గ్రామములు ఆ పరిపాలన వలన పొందగలుగు హక్కులు, సౌఖ్యములు పూర్తిగా పొందుచు హాయిగా నుండిరి. కావేరి వైఘతీరములగల ప్రాచీన తమిళ రాష్ట్రములకు పాండ్య చోళ, కేరళ రాష్ట్రముల ప్రాచీన చరిత్రగాధలందు ఈ గ్రామ పంచాయతీల గురించిన విషయములు గలవు.

ద్రావిడుల వెనుక ఆర్యులు పశ్చిమోత్తర కనుమమార్గముల ద్వారా భారత దేశములో ప్రవేశించిరి. వారి వెనుక క్రమముగా, ఆమార్గముల వెంబడినే పారశీకులు, యవనులు (గ్రీకులు) కుషానులు, ఇండోబాక్ట్రియనులు, ఇండోపార్థియనులు, శకులు, హూణులు, అప్పుడప్పుడు ఒకరివెనుక నొకరు క్రమముగా క్రీ. పూ. 600 నుండి క్రీ. వె. 600 నడుమగల కాలమున భారత దేశములో ప్రవేశించిరి. వారు దేశములో నివాసము లేర్పరచుకొని, స్థిరనివాసులై, భారతీయులుగానే పరిగణించుకొనిరి. భారత దేశమునే మాతృభూమిగా దలచిరి. హిందువుల మతమును, సాంఘిక మర్యాదలను, సంస్కృతిని, తమ జన్మస్థానపు వానికంటె ఉత్కృష్టమైన వానిగా పరిగణించి, వానిని శాశ్వతముగా అవలంభించిరి. వారి ప్రత్యేక జాతీయతను

మరచి, హిందూస్త్రీలను వివాహమాడి క్రీ. శ. 600 నాటికి హిందువు లయిరి.

హిందువులమతము హిందూమతము. అది తొలుత ఋగ్వేద మతముగా ప్రారంభమయ్యెను. తొలుత ఏకేశ్వరారాధనను బోధించెను. ఋగ్వేద ఆర్యులు ప్రకృతిశక్తుల అధిష్టాన దేవతలగు, ఇంద్ర, వరుణ, సూర్య, అగ్ని, మరుత్తులను పూజించేవారు ఈవిషయమున వారు వారి జాతివారగు ఐరేనియను ఆర్యజాతివారిని పోలిరి. ఈ ఐరేనియను ఆర్యజాతివారి సంతతివారే మన భారతదేశమున మహారాష్ట్ర, సౌరాష్ట్రములందు నివసించు పార్సీలు. ఐరాను (పర్షియా)లో హిందూదేశ ఆర్యులగు ఇండో ఆర్యులు, ఐరేనియనులు ఒకేజాతికి చెందినవారు. ఆర్యులు రెండు సారులు ఇండియాలో ప్రవేశించిరి. ఆ రెండుసారులు వచ్చిన వారలు క్రీ. పూ. 1500 నాటికి సింధు - గంగామైదాన భాగమగు ఆర్యావర్తమునంతను ఆక్రమించిరి.

తొలుత ఋగ్వేద ఆర్యులు, ఓడిన ద్రావిడులను తమ సంఘములో చేర్చుకొనుటకు నిరాకరించిరి. అప్పటి ఆర్యసంఘములో, మూడువిధముల జీవితవిధానములను చూచుకొనుచు సంఘసంక్షేమము మొత్తముపై వృద్ధిచేసికొనుచుండిరి. కొందఱు మతము, కొందఱు దేశరక్షణ, మిగిలినవారు వ్యవసాయ పరిశ్రమలు చూచెడువారు. వీరే "ద్విజులు" అనబడిరి. ఈ భేదముల ఏర్పాటు తాత్కాలిక పనిపాటుల నిర్వహణము కొఱకు జరిగిన సాంఘికపు ఒడంబడికగాని మతమునుబట్టి స్థిరముగాఏర్పరచిన వర్ణవ్యవస్థ (Caste) కాదు. ఇది పని చక్కగా జరుగు విధానముకాని, పుట్టుక, మతముపై నిర్ణయింపబడిన విభాగము కాదు. ఆర్యసంఘములో తెలివైన వారు కొందఱు మతమును, బలపరాక్రమములుగల కొందఱు రాజ్యసంపాదన పాలనలను, మిగిలినవారు వ్యవసాయ వ్యాపార పరిశ్రమలను చూచుటకు

వారివారి శక్తి సామర్థ్యములబట్టి నిర్ణయింపబడిరి. ఇవి వృత్తి భేద ముల వంటివి మాత్రమే. ఈ ఋగ్వేద కాలవృత్తి విభజనయే క్రమ ముగా పురాణయుగమునాటికి బలపడిన బ్రాహ్మణ, క్షత్రియ, వయస్య వర్ణములుగా మారి వర్ణవ్యవస్థగా మారెను. వీరిపూర్వపు వృత్తులే వీరికి జన్మమతములపై ఆధారపడిన కులములుగా మారినవి.

క్రీ॥ పూ॥ 1500-1000 నడుమకాలమున, ఉనంతర వేదములగు యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదములు రచింపబడినవి. ఋగ్వేదకాలములో ఆర్య సంఘములో ప్రవేశములేని జయింపబడిన అనార్యులగు ద్రావిడులు.అనంతర వేదయుగములోఆర్యసంఘమునందు, "శూద్రులు" అనుపేర నాల్గవ వర్ణము (కులము) వారుగా ప్రవేశము పొందిరి. వారికి ఆర్యులహక్కులులభింపలేదు. వారి వర్ణవ్యవస్థ, రక్షణ మాత్రము లభించెను. వారివృత్తి ద్విజులకు సేవజేయుచు వారి అభి మానము సంపాదించుటయే. వారు క్రమముగా ద్విజుల యాజ మాన్యమున యుద్ధసైనికులుగాను, వ్యవసాయ పరిశ్రమలందు, వ్యాపారమందు కూలివాండ్రుగాను పనిచేయుచుండిరి.

కాలక్రమమున హైందవ సంఘమున నాలుగు జాతులలో, బ్రాహ్మణులు తక్కినవారిపై అధికారము సంపాదించి, వర్ణవ్యవస్థ కట్టుబాట్లు బిగించి అవి మార్పు చెందరాదని శాసించిరి. ద్రావిడులను సంతోషపెట్టుటకు ద్రావిడ దేవతల ఆరాధన, బలులు, నాగపూజ మొదలగునవి హైందవ మతమున ప్రవేశపెట్టిరి. అనంతర వేదములు, ఇతిహాసములు, స్మృతులు, పురాణములు రచింపబడిన కాలములందు బ్రాహ్మణాధికారము, మత సంబంధమగు కర్మకాండ బలపడెను.

క్రీ॥ పూ॥ 2000-1500 నడుమకాలము ఋగ్వేదకాలము. ఋగ్వేదకాల దేవతలగు ఇంద్రాదులగూర్చి రచింపబడిన ప్రార్థనలు

"ఋక్కులు" అనబడెను. ఋగ్వేదమున 1028 ఋక్కులు (ప్రార్థనలు) గలవు. అనంతర వేదయుగమున వేదాంగములు రచింపబడెను. అవియే ధనుర్వేదము, ఆయుర్వేదము, గాంధర్వవేదము. శిల్పశాస్త్రము, భవననిర్మాణ శాస్త్రము, చిత్రలేఖనము, నాట్యశాస్త్రములు కూడ రచింపబడెను. ఇతిహాసములగు రామాయణ మహాభారతములుకూడ రచింపబడినవి. వ్యాకరణము, చందస్సు మొదలగు షట్ శాస్త్రములుకూడ వ్రాయబడినవి. ప్రజల దైనిక జీవితమునకు సంబంధించిన మత, సాంఘిక, ధర్మవిధానములు సూత్రముల రూపమున వ్రాయబడెను. ఇవియే స్మృతులు. వీనిని మహర్షులు రచించిరి. ఈ సూత్రములలో పరాశర వేదాంత సూత్రములు, గౌతమ గృహ్య సూత్రములు, ఆపస్థంభ, బోధాయన సూత్రములు, మనుధర్మ శాస్త్రములుకూడ రచింపబడినవి. వాని గ్రంథకర్తల నామములు ఆ గ్రంథముల నామములందే గలవు.

ఋగ్వేదమున, నిరాకార నిర్వికల్పుడు, సర్వాంతర్యామియగు సర్వేశ్వరుని ఆరాధనమే విధింపబడినది. కాని యీ ఏకేశ్వరారాధన అనంతర వేద, ఇతిహాస సూత్రయుగములందు బలపడిన బ్రాహ్మణ మతాధికారమున బ్రహ్మ, విష్ణు, శివుల ఆరాధనగా మారినది. బ్రాహ్మణ తత్వవేత్తలు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అను త్రిమూర్తులు క్రమముగా సర్వేశ్వరుండగు పరాత్పరునియొక్క సృష్టి, స్థితి, లయములయొక్క అవతార రూపులేయని నిరూపించిరి. అజ్ఞానులగు సాధారణ ప్రజలు బ్రాహ్మణ మతబోధలను వేదవాక్కుగా పరిగణించి బ్రాహ్మణులకు దాసోహమ్మనిరి. బ్రాహ్మణ మతాధికారమును, వారి నిరంకుశత్వమునకు తలయొగ్గిరి. వారు విధించిన మత సూచకములగు యజ్ఞయాగాదులను, పూజావిధానములను, నియమ నిష్టలను వేదోక్తముగా, యథావిధిగా నిర్వర్తించిరి. కాని

ఈ విధానములయొక్క అర్థముగాని, వాని యుపయోగములు గాని అజ్ఞానులగు ప్రజలకు అవగాహన కాకుండెను.

యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము, పూర్తిగా రచింపబడినది. ఋగ్వేదము ప్రార్థనల సంపుటము మాత్రమే. కాని ఆ ప్రార్థనలను సల్పుటలో విధింపబడిన కర్మకాండ విధానమును దెల్పు వచన సూత్రముల సముదాయము యజుర్వేదము. ఇది మత విధానములను వివరించి, వాని అనుభవపూర్వక అచరణ విధులు నిర్ణయించు గ్రంథము. యజ్ఞయాగములనుగూర్చి యజుర్వేదము దెల్పును. క్రతువుల సమయమున గానము చేయబడు ప్రార్థనలే సామములు. ఈ సామముల సముదాయము సామవేదము. యాగ నిర్వహణము నిర్విఘ్నముగా చేయుటకు, చెడుగులను వారించుటకు. విధింపబడిన మంత్రముల సముదాయము అధర్వణవేదముగా అవత రించెను. ఇది తుదిని రచింపబడినది. హిందూ సంఘమున వర్ణభేద వ్యవస్థ బలపడి, వర్ణముల శాఖోపశాఖలచే దురవగాహమై, మార్పులు జొరనీక స్థంభించినది. బ్రహ్మార్షులు వ్రాసిన మత వ్యాఖ్యానములు, క్రతువుల కర్మకాండ, అవి యన్నియు రచింపబడిన కఠినమగు సంస్కృతభాష, ఒక్క బ్రాహ్మణ పండితులకు తప్ప తక్కినవారికి అర్థముగాక అందరాని పండ్లయ్యెను.

మరియు మతవిధానములందు, ద్విజులగు బ్రాహ్మణ, క్షత్రియ వయిశ్యులలో ఒక్క బ్రాహ్మణులే. యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన ప్రతిగ్రహణము లనబడు యజనాది షట్కర్మలకు అర్హులని విధింపబడెను. తక్కిన ద్విజులకు అనగా రాజులకు కోమట్లకు వానిలో యజన, అధ్యయన, దానహక్కులు మాత్రమే అర్హాము లనియు, యాజన, అధ్యాపక, ప్రతిగ్రహణ విధులు అర్హములు గావని విధింపబడెను. ఆర్యసంఘములో శూద్రులు నాల్గవ వర్ణముగా

చేరినను, వారికి ఈ ఆర్యజాతి ద్విజులగువారికి గల హక్కులేవియు లేవని ఖండితముగా విధింపబడెను.

ఇట్టి బ్రాహ్మణాధికార, నిరంకుశత్వములు, మత సాంఘిక విషయములందు విధింపబడగా శూద్రులేగాక, రాజులు, కోమట్లు కూడ బ్రాహ్మణాధికారమునకు మిక్కిలి అసంతృప్తి కనపరచిరి. బ్రాహ్మణాధికారము, మతవిషయమగు అర్థముకాని కర్మకాండ, బోధపడని సంస్కృతభాషవలన కలిగిన బాధలనుండి ఎప్పుడు విముక్తి కలుగునాయని సాధారణ ప్రజలు తలపసాగిరి. క్రింది వర్ణములవారు, కర్మాడంబరముగాక, బోధపడి ఆచరణయోగ్యమగు క్రొత్తమత మేదైన పొడసూపునాయని ఎదురుచూడసాగిరి. ముక్తిసాధనకై వర్ణభేదములేక ప్రజలందరు సమానులే అని ప్రకటించి, కర్మకాండలను రద్దుచేయు అట్టి మతమునకు వేచియుండిరి. అట్టి సమయముననే క్రొత్త మతములగు జైన బౌద్ధమతములు పొడసూపినవి.

వైశాలీ రాజకుమారుడగు వర్ధమాన మహావీరుడు జైనమతమును బోధించెను. తరువాత కొలదికాలముననే శాక్యవంశ రాజును, కపిలవస్తుపాలకుడు అగు శుద్ధోధనుని కుమారుడు గౌతమ బుద్ధుడు బౌద్ధమతమును స్థాపించెను. ఈ నూతన మతములను బోధించిన వారిద్దఱును ధైర్యపరాక్రమములు గల రాజకుమారులే. ఆర్య సంఘమున బ్రాహ్మణుల తరువాత అధికార పౌరుషములుగల రాజులే బ్రాహ్మణాధికార నిరంకుశత్వమును ఎదుర్కొన సమర్థులుగానుండిరి.

జైన, బౌద్ధమతములు రెండును, వేదముల ప్రమాణమును అంగీకరింపవు. బ్రాహ్మణమత కర్మకాండ, యజ్ఞయాగ విధానములు అంగీకరింపవు. పరమేశ్వరుడు కలడా లేడా అను చింత అనవసరమని బోధించును. ఈ కారణములచే జైన బౌద్ధమతములు బ్రాహ్మణులకు కంటకములు. జైన, బౌద్ధ మతములు, సత్యము, అహింస,



ఆర్యుల సూర్యోపాసన

The Aryan Worship of the Sun



God Sri Krishna

శ్రీకృష్ణ పరమాత్మ



The Buddha

బుద్ధుడు

పెద్దలయెడ భక్తి ధర్మమార్గము అను ప్రధాన మతసూత్రములు బోధించినవి. అవియె ముక్తి లేక నిర్వాణసాధకములని చెప్పబడినవి. అవి వర్ణవ్యవస్థ, కుల మత భేదములను తీవ్రముగా ఖండించినవి. ప్రజలందఱును దేవునికిసమానులే అనిఘోషించినవి. పరమేశ్వరుడు సర్వ మానవులకు కరుణగల తండ్రివంటివాడు. అందఱు అతని దయ పొందుటకు అర్హులు. చర్వితచరణములగు పుట్టుక, చావులనుండి ముక్తిపొందుటకు, ఈ ప్రధాన సూత్రములుగల మంచి ధర్మవర్తనమే సాధనము, అని ఈ నూతన మతములు ఉద్ఘాటించినవి.

హిందూ, జైన, బౌద్ధమతముల నడుమ కొన్ని పోలికలు, కొన్ని భేదములు కలవు. క్రీస్తు శకారంభమునకు ప్రస్ఫుటము లయినవి. హిందూమతమున గల, కర్మసిద్ధాంతమును, పునర్జన్మ సిద్ధాంతమును, బౌద్ధమతము అంగీకరించినది. కాని జైనమతము వానిని అంగీకరింపదు. జ్ఞానమార్గమున పరమేశ్వరునిగూర్చి తెల్పు బ్రహ్మజ్ఞానము సాధ్యమగునని బ్రాహ్మణ మతసిద్ధాంతము. వైదిక కర్మలను క్రతువులను చేయుటవలన అట్టి జ్ఞానము కలుగునని దాని వాదము. బౌద్ధులు ఈ మార్గములను అంగీకరింపక, నిర్వాణములేక ముక్తి పొందుటకు, సత్యవ్రతము, అహింస, పెద్దలయెడల భక్తి, ధర్మమార్గమును నీతివర్తనమున సాధించుట అన నవియే ముఖ్యమని తెల్పుచున్నది. కోరికలను చంపుట, ఉపవాసములు కఠిన తపస్సులచే దేహమును శుష్కింపచేసి జీవముగల శరీరమునుండి పరమాత్మ స్వరూపమగు చిత్తమును విముక్తి కావించుట ముక్తిసాధనములని జైనుల మతము. ఉపవాసములు చేసి శుష్కించి ప్రాణములను విడుచుట పరమార్థమని వారు తలంతురు. ఇట్టి ఈ నూతన మతములు, వేదములను, దైవజిజ్ఞాసను, కర్మకాండలను, వర్ణాశ్రమ ధర్మములు

ఖండించుటచేతనే బ్రాహ్మణ మతస్థులగు హిందువులు బౌద్ధులను జైనులకు నాస్తికులుగాను, వారి మతములను నాస్తికమతములు గాను ఖండించిరి.

సులభముగా ఆచరించుటకు అనుకూలములగు సత్యము, భూతదయ, పెద్దలయెడ గౌరవము, ధర్మవర్తనము బోధించుటచేతనే నూతనమతములు ఎక్కువమంది క్రింది వర్గముల ప్రజలను ఆకర్షింప గలిగినది.

"అహింస" అను ధర్మమును ఆచరించుటలో జైన బౌద్ధ మతములలో కొంత భేదము గలదు. అహింస ఈ నూతన మతములు రెండింటికి ప్రధానమైనదే. జైనమతమున 'భూతదయ' కఠిన నిబంధనలు గలది. కాని బౌద్ధమతమున అట్లుగాక ఆచరణకు వీలగునంత వఱకు భూతదయ పాటింపవలెనను నియమము గలదు. జైనులు, గాలి పీల్చునప్పుడు ముక్కు నోరు ద్వారా కంటికగపడని సూక్ష్మ జీవులు నశించుటకు అవకాశము కలదని, గాలిపీల్చునపుడు మానవులు ముఖములపై పలుచని బట్టనుంచి గాలి పీల్చవలెను, దారిని నడుచునప్పుడు అజ్ఞానవశమున కాలిక్రిందపడి సూక్ష్మజీవులు నశింపకుండా మానవులు నడుచునప్పుడు ఆకుల చీపుళ్ళచే దారిని మెల్లగా తుడుచుకొనుచు పోవలెను, అను నిర్ణయములు విధించిరి. ఇవి ఆచరించుటకు కష్టమైనవి. అందుచే ప్రజలను జైనమతము ఆకర్షింపలేదు. ఉపవాసములచే దేహములను శుష్కింపచేసి, తిండిలేక ప్రాణములు విడిచి నిర్వాణము పొందవలెనను నియమము ప్రజలకు కంటకమయ్యెను.

పరమేశ్వరునిదయ, ముక్తి లభించుటకు, జాతిమత వివక్షత లేక ప్రజలందఱకు సమానమగు హక్కు గలదని బౌద్ధమతము బోధింపగా హిందూ సంఘములో క్రింది వర్ణములలోని పెక్కుమంది బౌద్ధమతమును చేరిరి, మఱియు బౌద్ధమతము వ్యాపించుటకు శిశునాగ

వంశరాజులు తరువాత మౌర్యచక్రవర్తి అశోకుడు, శిమ్మాట ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు సహాయపడిరి.

అంత అచిరకాలములో బ్రాహ్మణులు, మతసాంఘిక విష యములందు తాము చేసిన తప్పిదములను గ్రహింపగలిగిరి. వారు తమ మతాధికార గర్వము, సాంఘిక నిరంకుశత్వము సామాన్య ప్రజలకు కంటకము లయ్యెనని తెలిసికొనిరి. నోరెరుగని జంతువులను నిష్కారణముగా, యాగముల నెపమున బలియిచ్చుట ప్రాజ్ఞులు హర్షింపలేదని దయాళులు నిరసించిరని తెలిసికొనిరి వారు తమ అధికారమును పెంచుకొనుటకు స్వార్థపరులై చేసిన మత, సాంఘిక నేరములకు పశ్చాత్తాపబడి, తిరిగి తమ మతము ప్రజల నాకర్షించుటకై మార్పులు చేయదలచిరి. వారు జైన బౌద్ధములలోని, సత్యము, అహింస, ధర్మము అను ప్రధాన సూత్రములను హిందూమతమున ఎక్కువ ప్రాముఖ్యము గలవానిగా దానియందు పొందు పరచిరి. ఈ ధర్మములు దెల్పు కథలుగల పురాణములు రచించి, బ్రాహ్మణ హిందూమతమును, సర్వజనులను ఆకర్షింపగల పౌరాణిక హిందూ మతముగా మార్చిరి. ఈ పౌరాణిక హిందూమతమునకే నవీనహిందూ మత మనునది మఱియొక పేరు.

ఐతిహాసిక, సూత్రయుగములందు బ్రాహ్మణ హిందూమతము అత్యున్నత స్థితిని పొందినది. సూత్రములు లేక స్మృతులందు మను స్మృతి చాల ముఖ్యమయినది. మనుస్మృతి, మానవుని జీవితవిధానము లను, మత, సాంఘిక, నైతిక, ధర్మవిషయములందు నిర్దేశించినది. ఈ స్మృతి వర్ణాశ్రమ ధర్మముల గురించి ఎక్కువగా తెలియజేయును. ప్రధానములగు నాలుగు జాతులకేగాక వాని భాగములు, అంతర్భాగ ములకుకూడ ధర్మనిర్ణయము గావించినది. హిందువుని దైనందిన చర్యను విధించినది. అట్టి మానవసంఘ జీవనమునేగాక, మనుస్మృతి

రాజులుపాలకులు అవలంబింపదగు పరిపాలనా విధానములు, న్యాయ విచారణ సూత్రములు, సివిలు, క్రిమినలు నేరముల లక్షణములు, వానికి విధింపదగు శిక్షలు మొదలగువానినికూడ నిర్ణయించినది. ''మనుధర్మశాస్త్రము''న ప్రభుత్వ విధాన లక్షణములు, పాలకుల లేక రాజులరాజనీతి విధానములు, పన్నుల విధించు నియమములు, పరిపాలన ధర్మములుకూడ విశదీకరించినది.

ఎక్కువమంది, నిరంకుశమైన బ్రాహ్మణ మతబాధలు విడిచి బౌద్ధమతమును చేరగా బ్రాహ్మణులు పశ్చాత్తాపబుద్ధితో తమ మత విధానమున లోపములు తొలగించు కొన్ని మార్పులు చేసిరి. బౌద్ధ మత ధర్మములగు సత్యము, అహింస, బ్రాహ్మణ మతప్రధానధర్మ ములుగా చేసిరి. జంతుబలులను పూర్తిగా నిషేధించిరి. ప్రపంచమున అధర్మమును అడచి ధర్మము స్థాపించుటకు దేవుడు అవతారములను ధరించి, అవతారములు తెలుపు పురాణములు వ్రాసిరి. విష్ణువు ధరించు అవతారములు పది గలవనియు అందు బుద్ధుని అవతారము గలదనియు నిరూపించిరి. బౌద్ధమత ప్రధాన ధర్మములగు సత్యము, అహింస ముఖ్యమని కొందరు మహర్షుల కథలు వ్రాసిరి. తన భక్తి, ధర్మప్రవర్తనలచే, అంటరాని కులమువాడగు వాల్మీకి మహర్షి అయ్యెనని, అంటరానివాడైనను, ధర్మవ్యాధుడు, ధర్మవర్తనముచే మహాజ్ఞాని యయ్యెననియు నిరూపించిరి. బౌద్ధమత ప్రధానసూత్ర ములు బోధించు హిందూమతమును విడిచి ప్రజలేల బౌద్ధమతము చేరబోరిరో యని ప్రశ్నించిరి. మూఢనమ్మకములుగల ప్రజలకు బుద్ధుడు విష్ణువుయొక్క అవతారమే అని ప్రకటించిరి.

బ్రాహ్మణులు బోధించిన నవీన పౌరాణిక హైందవమతబోధ లనువిని, వానిని నమ్మి సామాన్యప్రజలు, బౌద్ధమతమును విడిచి తిరిగి హిందూమతమున కలిసిరి. వ్యాసమహర్షిచే రచింపబడిన పురాణ

ములు సహాయమున బ్రాహ్మణులు బౌద్ధమతములో కలిసిన ప్రజలను తిరిగి హిందూమతమున చేర్చగలిగిరి. అప్పటికి బౌద్ధమతమునుకూడ హీనయనా, మహాయానా శాఖలను రెండు శాఖలుగా చీలి మతైక్యత పోగొట్టినవి, బౌద్ధమతక్షీణత దీనికి తోడ్పడెనది. హీనయాన మతమున బుద్ధుడు మతబోధకుడుగా మాత్రమే గణింపబడెను. దేవుడుగా భావింపబడలేదు. కాని మహాయాన బౌద్ధులు బుద్ధుని దేవునిగా నెంచి బుద్ధవిగ్రహములను నిలిపి వానికి ఉత్సవములు ఊరేగింపులు జరిపిరి హిందువులు అతనిని విష్ణావతారుడుగా ప్రకటించిరి. బౌద్ధమత భిక్షుకుల. భిక్షుణిల నైతికజీవితములుకూడ చెడినవి. తుదకు, కుమారిలభట్టు, శ్రీ శంకరాచార్యుల మతబోధలు క్షీణించు బౌద్ధమతమునకు తుదిదెబ్బ తగులచేసినవి. బౌద్ధమతము క్రుంగి తిరిగి లేవలేకుండపోయినది. మహాయాన బౌద్ధువులు హిందువుల ననుకరించి బుద్ధదేవునికి ఉత్సవములు జరుపసాగిరి.

ఉత్తర హిందూదేశమున గుప్తచక్రవర్తులు, రాజపుత్రులు పౌరాణిక హిందూమతమును అవలంబించి, దానిని రాజమతముగా ప్రకటించి దాని అభివృద్ధికి అనేకవిధముల తోడ్పడిరి. దక్షిణ ఇండియాలో చాళుక్య, చోళరాజులు దాని యభివృద్ధికి చేయూతనిచ్చిరి. జైనమతము బౌద్ధమతము అను ప్రవాహములు తల్లి ప్రవాహమైన హిందూమతము నుండి విడివడి దానికి ప్రక్కగా వేరుగా కొంతకాలము ప్రవహించి, తిరిగి తల్లి ప్రవాహములో కలిసి లీనమయినవి. ఆకాలము సుమారు వేయి సంవత్సరములు క్రీ॥ పూ॥ 300 క్రీ॥ శ॥ 700 నడుమ నుండెను. శ్రీశంకర కుమారిలభట్టు బోధించిన అద్వైత మతముకూడ వెనుకపడి క్షీణింప, భక్తిరస బోధకములగు శైవ వైష్ణవమతములు తలయెత్తి వాని అన్యోన్య కలహముల ఫలితముగా పౌరాణిక మతముయొక్క ఐక్యభావమునకు భంగము గలిగించినవి.

శ్రీ శంకర రామానుజ మధ్వాచార్యుల బోధనలవలన బలపడిన పౌరాణికమతము ఈవీరవైష్ణవ వీరశైవమత విజృంభణలవలన బలహీనమయినది. త్రిమతాచార్యులు క్రీ॥ శ॥ 750-1300 నడుమవారి బోధలుచేసిరి. శైవ, వైష్ణవ మతావేశములు పదునాల్గవ శతాబ్దమున విజృంభించెను.

స్వభావసిద్ధముగా హిందువులు భిన్న మతధర్మములను పాటించువారైనను శాంతస్వభావులు. ఓర్పుగలిగి దైవభీతిగలవారు. వారి వారి విరుద్ధ మతభావములను శాంతములగు చర్చలవలనను శాస్త్రసమ్మతములగు వాదోపవాద సత్యనిరూపణములవలనను సరిపెట్టుకొనువారు. అంతియేగాని రక్తపాతమునకు దారితీయుయుద్ధముల నొల్లరు. ఇవియే హిందువుల స్వభావములోగల ప్రత్యేకవిశిష్ట లక్షణములు. ఇప్పటికిని అవి నిలిచి హిందూమతము ఘనతను నిలిపినవి. నవీన పౌరాణిక హిందూమతమున ఇస్లామ్ మతలక్షణములగు జ్ఞాన కర్మ మార్గముల పోకడలు గలవు. మఱియు బౌద్ధమత క్రైస్తవమత లక్షణములగు భక్తి, నీతిమార్గములుకూడ హిందూమతమున ప్రతిబింబితములైనవి. ఈకారణములచే హిందూమతము భారతదేశమున గల ఇతర మతములతో వైరభావము లేక శాంతియుతముగా సహకార సఖ్యములు గలిగియున్నది.

క్రీ॥ శ॥ 1000 - 1500 సంవత్సరముల నడుమ, హిందూ మతమునకు ఇస్లామ్ మతముతో సంఘర్షణలు సంప్రాప్తములయినవి. రెండును బలము, స్వాతంత్ర్యముగల ప్రధానమతములే. జైన బౌద్ధ మతములు హిందూమతము నుండి పుట్టినవి కనుక, కాలక్రమమున కష్టము లేక తిరిగి హిందూమతమున లీనము కాగలిగినవి. ఆమతముల ఐక్యత క్షీరోదక న్యాయమును అనుసరించెను. కాని హిందూ ఇస్లామ్‌మతముల ఐక్యత సఖ్యము అట్టిది కాదు ఎన్ని సంవత్సరములు

కలిసి మెలిగినను, అవి ఐక్యత కాలేదు. వానికలయిక త్రైలోదక న్యాయమును గుర్తించెను. ప్రపంచములో బౌద్ధ క్రైస్తవ మతముల తరువాత మూడవ ప్రధానమతముగా నున్నది. ఇస్లామ్ వెనుక హిందూమతము ప్రపంచమతములలో నాల్గవది. తక్కిన మతములలో ప్రధానసూత్రములు భావముగల హిందూమతము ప్రపంచములో గత నలుబది శతాబ్దములనుండి భారతదేశమున చెక్కు చెదరక దాని ఘనతను ప్రపంచమున చాటగలిగిన వేదాంత సూత్రములపై ఆదారపడి బలపడినది.

---

# 3. విదేశీయుల దండయాత్రలు - మత సాంఘిక పరిస్థితులపై వాని ఫలితము

ఇండియా ఆదినివాసులు రాతియుగములవారు. లోహయుగములవారు వారి సంతతివారు. ప్రస్తుతము వీరి సంతతులవారు దేశమున గల పర్వతారణ్య భూములందు నివసించుచున్నారు. దక్షిణ ఇండియాలోని తోడాలు, ఖాండులు, దక్కనులోని కోయలు, సవరలు, గదబలు తూర్పు రాజస్థానము మధ్య ఇండియాలో ఏజన్సీ నేలలలోని భిల్లులు, సంథాలులు అనువారు వీరి సంతతులవారు. ఈ అనాగరికుల పిమ్మట దేశమునగల ప్రజలు ద్రావిడులు.

పిమ్మట ఆర్యులు దేశముయొక్క పశ్చిమోత్తర కనుమ మార్గముల వెంబడి పంజాబులోనికి వచ్చి క్రమముగా ఉత్తర ఇండియా ఆక్రమించిరి. ఆర్యఋషులు ఋగ్వేదముల మతమైన వేదాంత మతము బోధించిరి. తరువాత ఆర్యులు తక్కిన మూడు వేదములను

రచించి, వేదములు, ఇతిహాసములు, సూత్రములు, పురాణములపై ఆధారపడిన బ్రాహ్మణ హిందూమతమును స్థాపించిరి. ఋగ్వేద కాలమునాడు ఆర్యసంఘములో లేని వర్ణవిభాగము బ్రాహ్మణహిందూ మతకాలమున పూర్తిగా యేర్పడి బలిష్టమై క్రీ॥ పూ॥ 1500 నుండి క్రీ॥ వె॥ 1000 వత్సరములవఱకు తన ప్రభ వెలిగించినది. ఆర్య సంఘములోగల నాలుగు జాతులలో ద్విజులగు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్ణములవారికే అన్నిహక్కులు ఉండెను. నాల్గవ వర్ణము వారగు శూద్రుల కెట్టి హక్కులు లేకుండెను.

నాలుగు వర్ణముల వారిలోను కలిగిన వర్ణాంతర వివాహములు, సంకరజాతి సంతానములు, వర్ణవ్యవస్థను శాఖోపశాఖలతో వ్యాప్తిచేసినది. బ్రాహ్మణజాతి స్త్రీలవలన శూద్రజాతి పురుషులకు గలిగిన సంతానములవారు ఛండాలురు లేక అంటరాని వారుగా పరిగణింపబడిరి. శూద్రుల సాంఘిక బాధలే దుర్భరములైనప్పుడు ఈ ఛండాలుల బాధలు ఇంకను ఎంత హేయములు బాధాకరములుగా నుండెనో చెప్పనక్కరలేదు. ప్రస్తుతము అరణ్య పర్వత సీమలందు పూర్వపు అనాగరికుల సంతతివారు గిరిజను లనబడుచున్నారు. హిందూ సంఘములో గల అంటరానివారు హరిజనులనబడుచున్నారు.

హరిజనులు తక్కువ గౌరవముతోను నీచముగాను చూడబడు జీవిత వృత్తులు అవలంబించినారు. అందు తుడుపులు, పాకీపనులు, మృగములను చంపి వాని మాంసము ఆహారముగా విక్రయించుట చర్మములను తీసి బాగుచేసి పాదరక్షలు మొదలగునవి తయారు చేయుట ఆదిగాగల పనులు చేయుచున్నారు. పూర్వము ఈ అంటరానివారు గ్రామములందుగాని, పట్టణములందుగాని నివసింప వీలు లేదనియు వారు గ్రామములు, పట్నముల వెలుపల నిర్ణీతములగు స్థలములందు మాత్రమే నివసింపవలెననియు కఠిన నిబంధనలను

ఆర్యులగు ద్విజులు శాసించిరి. వారు సవర్ణుల నూతులనుండి మంచినీటినైన గ్రహింపరాదనియు, సవర్ణుల దేవాలయములలోనికి వెళ్ళి ప్రార్థనలు చేయరాదనికూడ విధింపబడెను. ఈ రీతిగా ఆదినుండి క్రీ॥ శ॥ 19వ శతాబ్దాంతము వఱకుకూడ హరిజనుల బాధలు దుర్భరములుగా నుండెను. మహాత్మాగాంధి, భారతపిత, స్థాపించిన హరిజనోద్ధరణము క్రీ॥ శ॥ 1920 నుండియే ప్రారంభమయినది.

అనాగరికుల సంతతివారగు గిరిజనులకు, వారివారి చిత్రములైన ప్రత్యేక సాంఘికాచార వ్యవహారములున్నవి. వారి తెగలలో వర్ణభేదములు లేవు. అనాగరికుల తరువాత దేశమునగల ద్రావిడులలో కూడ వర్ణభేదములు లేకుండెను. సంఘములో గొప్ప బీద భేదములు, ఆహారము, దుస్తులు, ఆచార వ్యవహార భేదములుకూడ లేవు. ఆర్యులు ద్రావిడులను జయించి ఉత్తరహిందూస్థానమును ఆక్రమింపగా ద్రావిడులు క్రమముగా ఆర్యుల మత, వర్ణభేదములను, ఆచార వ్యవహారములను అవలంబించి ఆర్యసంఘములో లీనమయిరి. దక్కనులో గల ద్రావిడులుకూడ ఆర్యమత సాంఘిక వ్యవస్థ లవలంభించిరి. ఈ రీతిగా ఆర్యసంస్కృతి ప్రవేశముతో దేశమున, జాతి భేదములు, కుల భేదములు, గొప్ప, కొద్ది వర్ణములవారు, హరిజనులు, గిరిజనులు అను సాంఘిక భేదములు, వానివాని శాఖోపశాఖలు పెరిగి, బలపడి, ఆర్య సాంఘిక పరిస్థితులు క్లిష్టము లయినవి. భారత జాతీయమత ఐక్యత సాంఘిక ఐక్యత లేకుండ చేసినవి.

తరువాత నూతన మతములగు జైన బౌద్ధమతములు లేచి, కొంతకాలము బలముగా నుండి హిందూ బ్రాహ్మణ మతములోగల లోపములను కొన్నిటిని అంతరింప చేసినవి. తరువాత ఆ మతములు అవి జన్మించిన మాతృదేశమగు భారతదేశముననే పేరుప్రతిష్ఠలు

లేక, హిందూమత సంఘమున లీనములయినవి. ఇప్పుడామతములను అవలంబించినవారు రాజస్థాన్ సౌరాష్ట్ర భాగములందు మాత్రమే కొలదిగా నున్నారు. దక్షిణ ఇండియాలోవారు మైసూరు, కేరళ రాష్ట్రములందు గలరు. ఉత్తర హిందూస్థానమునందు బౌద్ధుల ప్రాపకమున జైనుల ప్రాపకమున రాజస్థానీ, గుజరాతీ భాషలు సారస్వతములు దక్షిణమున జైనుల అభిమానమున కన్నడ మళయాళీ భాషలు సారస్వతములు వృద్ధిపొందినవి.

పేరునకు మాత్రమే జైన బౌద్ధ మతములలో కులభేదములు నిషేధింపబడెను. కాని కాలక్రమమున జైనులలో శ్వేతాంబరులు, దిగంబరులు అను భేదములు, బౌద్ధులలో హీనయాన, మహాయాన బౌద్ధ శాఖీయులు అను భేదములు అంకురించి ప్రబలినవి. శ్వేతాంబర జైనులు ఇరువది రెండవ తీర్థంకరుడగు పార్శ్వనాథ జైనుని మతబోధనలను అవలంబించినవారు, ఇరువది మూడవ తీర్థంకరుడగు వర్థమాన మహావీరుని బోధనలు అవలంబించినవారు దిగంబర జైనులు. హీనయాన బౌద్ధమతము బుద్ధభగవానునిచే బోధింపబడి, అశోకునిచే మిక్కిలి అభివృద్ధి చేయబడినది. మహాయాన బౌద్ధమతమును నాగార్జునుడను ఆంధ్ర బౌద్ధసన్యాసి బోధింపగా, దాని అభివృద్ధికి కనిష్కచక్రవర్తి ఆంధ్రశాతవాహన చక్రవర్తులు మిక్కిలి యెక్కువగా తోడ్పడిరి. శ్రీహర్షుడుకూడ ఈ మహాయానమతము నవలంబించి బలపరచెను.

క్రీ॥ శ॥ 1000 నుండి క్రీ॥ శ॥ 1500 నడుమ, క్రొత్తగా భారతదేశమున ప్రవేశించిన ఇస్లామ్ మతము, వరుసగా జరిగిన మహమ్మదీయ దండయాత్రల ఫలితముగా దేశమున స్థిరపడినది. సాధారణ ప్రజల దృష్టిలో, ఏకేశ్వరారాధన బోధించు ఇస్లామ్, ఎక్కువ దేవతలను వారి విగ్రహములను పూజించు పౌరాణిక

హిందూమతము అన్యోన్య వ్యతిరిక్తమతములుగా ఎన్నబడినవి. నిర్వికారుడు సర్వాంతర్యామి యగు సర్వేశ్వరుని మానముగా ప్రార్థించు ఇస్లామ్ మతవిధానము, హిందువుల బహుదేవతారాధన ఆడంబరముగా జరుగు దేవతా విగ్రహముల పూజలు వ్యతిరిక్తములు. అందుచే ఎక్కువ దేవతలను ఆరాధించి, వారి విగ్రహములకు ఆడంబరములగు దేవాలయములు నిర్మించి, ఉత్సవములలో ఊరేగించు హిందూ మతవిధానములు, వానిని గర్హించు మహమ్మదీయులకు కంటకము లయ్యెను. అందుచే ముస్లిములు, హిందూ దేవాలయములు హిందూ విగ్రహములు పగులగొట్టి తమ మతావేశములు ప్రదర్శించుట జరిగినది. మరియు మహమ్మదీయులు తమ మతములోనికి హిందువులను బలవంతముగా కలుపుకొనుట ప్రారంభించిరి.

కాని హిందూ, ముస్లిము ఉభయ పక్షములందును జ్ఞానులు ఈ రెండు మతములయొక్క ప్రధాన ధర్మములందు సామ్యమును గుర్తించిరి. అట్టివారిలో ఉదార భావములుగల సూఫి, లేక షియా మహమ్మదీయ జ్ఞానులు గలరు. వారే షియా సూఫేమాల్వీలు, అక్బరు మొదలగు ఉదారభావములుగల చక్రవర్తులు. మహమ్మదీయులలో పూర్వాచారపరాయణులగు సున్నీ మహమ్మదీయులు, విశాలభావములు లేనివారు. వారు మతావేశపరులు. తమ మతమే సర్వోత్కృష్టము, తక్కినవి కావు అని నమ్మి ప్రవర్తించువారు. అట్టివారిలో ముస్లిమ్ మతావేశులగు ఘజ్నీ, అల్లాఉద్దీన్, ఫిరోజ్ షా, ఔరంగజేబులను లెక్కింపవచ్చును. అక్బరు హిందూమత గ్రంథములను గౌరవించెను. శివాజి ఛత్రపతి, కురాన్ బైబిలు గ్రంథములను ఆదరించెను. ముస్లిమ్ సంఘములో, పూర్వాచార పరాయణులు మతావేశపరులునగు సున్నీలు అనియు, ఉదారమత, సాంఘిక భావములు గల షియాలు అనియు రెండు తెగలవారు ఏర్పడిరి. సున్నీలు తమ

రాజకీయ సాంఘిక విధానములు వారి పవిత్రమత గ్రంథమగు కొరాను ఆదేశములపై ఏర్పాటుచేసి పూర్తిగా అవలంబించిరి. షీయాలు అట్లుగాక, ఉదారభావములు సహనభావము, నిర్మాణకార్య తత్పరత కలవారు.

హిందువులలో క్రింది వర్ణములవారు కొందఱు స్వార్థపరులై కొన్ని రాజకీయ, సాంఘిక, ఆర్థికలాభములు పొందుటకు మహమ్మదీయ మతమును అవలంబించిరి. అంతేకాని హిందూమతము కంటె ఇస్లామ్ నందు ఎక్కువ ఉత్కృష్టతకలదని వారామతమున ప్రవేశింప లేదు. ఉత్తర ఇండియాలో సున్నీ మహమ్మదీయుల సంఖ్యయెక్కువ దక్షిణభారతమున షీయాలు ఎక్కువగా నున్నారు.

క్రీ॥ శ॥ 1000 - 1400 సంవత్సరముల నడుమ, మతాంతః కలహములు సంఘలక్షణములలో ఒక ముఖ్యాంశము. మొత్తముపై దేశమంతటను హిందూ మహమ్మదీయ మతసంఘర్షణలు చెలరేగినవి. దక్షిణ ఇండియాయందు హిందూమతమునందేగల శైవ వైష్ణవ మతముల అంతః కలహములు పొడసూపినవి. దక్షిణ ఇండియాలో వైష్ణవమతమును శ్రీరామానుజాచార్యులు బోధించెను. శ్రీవైష్ణవ భక్తి ఆవేశముగల ఆళ్వారులు అను మతగురువులు దానిని వృద్ధిచేసి, ఈవైష్ణవభక్తి శ్రీరామభక్తి మతములుగా బలపడినది. ఉత్తర హిందూస్థానమున మతభక్తి శ్రీకృష్ణభక్తిగా అవతరించినది. దానిని చైతన్యుడు, భక్తజయదేవు, భక్తమీరాబాయిలు, క్రమముగా బెంగాలు, ఒరిస్సా, రాజస్థానములందు బలపరచిరి. భక్తులు రచించిన భక్తగీతములు, పాటలు, ఆయాభక్తులు అవతరించిన మాతృరాష్ట్ర భాషలలో రచింపబడి, ప్రజలవాడుకలో మంచి అభివృద్ధికి, ఆభాషలకు వాని సారస్వతములకు తోడ్పడినవి దక్షిణ ఇండియాలో వీరవైష్ణవ భక్తి మైసూరు, మద్రాస్ రాష్ట్రములందు బలపడినది.

బసవడు వీరశైవ మతమును స్థాపించెను. అతడు మైసూరు రాష్ట్రము పాలించిన బిజ్జలుడను రాజునకు మంత్రి. నాయనారులు అను శైవభక్తులు ఈవీరశైవమతమును మైసూరు మద్రాస్ రాష్ట్రము లందు వ్యాపింపచేసిరి. తెలంగాణములో జంగమాచార్యులు వీరశైవ మత మవలంబించి ప్రజలకు బోధించిరి. కాకతీయ చక్రవర్తులు వారిని ఆదరించి వీరశైవమతమును అవలంబించి దానిని రాజమతముగా ప్రకటించిరి. వీరవైష్ణవ వీరశైవమతములు ప్రజలవాడుక భాష లలో బోధింపబడి, ఆభాషల సారస్వతములను అభివృద్ధిచేసినవి.

ఈభక్తిరస మతములవలన నిర్మాణాత్మకములగు రెండులాభ ములు కలిగినవి. అవి జాతిమత వివక్షతలు పాటింపక అందరికిని బోధింపబడి వారి అందుబడిలోనికి వచ్చి ఆచరణయోగ్యములైనవి. ఆమతముల అభివృద్ధికి, భక్తిమార్గ మొక్కటే దారి. అందుచే మతాచరణ సులభమయ్యెను. మతవిధానము సులభముచేయుటయే గాక ఈమతములు అవి బోధింపబడిన భాషల అభివృద్ధికి తోడ్పడి నది. కాని వానివలన కలిగిన నష్టమొకటి కూడగలదు. అవి మతైక్య తను పోగొట్టినవి. అనవసరములగు మత సంఘర్షణలను కల్పించినవి. ఈ మతకక్షలు బయలుదేరుటకు శైవవైష్ణవమతముల ఎదురుకక్ష మతావేశములే కారణములు, వానికి ప్రజల అవిద్య మూఢ నమ్మక ములు తోడయినవి.

ఆస్తిక్యజ్ఞానము ఎక్కు తక్కువలను బట్టి ప్రజలలో నూరు తరగతుల ప్రజలకు అనుకూలములగునట్లుగా శ్రీశంకరునిచే బోధింప బడిన అద్వైతమత మార్గము, శ్రీరామానుజాచార్యులేర్పరచిన విశిష్టాద్వైతపథము, శ్రీమధ్వాచార్యు లేర్పరచిన ద్వైతమతదారి ఏర్పడి, ప్రజల వివిధమత విజ్ఞానరుచులను అనుసరించినవి. శంకరుని

అద్వైతము ఎక్కువ జ్ఞానులకు జ్ఞానమార్గమున మోక్షసిద్ధి కలుగ జేయునది. ''అహమస్మి'' లేక ''సోహం బ్రహ్మ'' అనునవి దాని హెచ్చరిక సూక్తులు. వీనిసత్యము జ్ఞానులకుమాత్రమే అనుభవ యోగ్యము. కాని సామాన్యజనులగు అజ్ఞానులకు భక్తిమార్గము నిర్ణయింపబడినది. అదియే రామానుజుడు బోధించిన శ్రీరామభక్తి మార్గము, మధ్వాచార్యుడు బోధించిన శ్రీకృష్ణభక్తిమార్గము. భక్తివలన నిష్ఠ. ఏకాగ్రత లభించును. వానివలన క్రమముగా జ్ఞానము దానివలన ముక్తి లభించును. ఈవిధముగా ఈత్రిమతా చార్యులు బోధించిన మూడు మార్గములు దైవారాధన కేర్పడిన మూడు మార్గములు. ముక్తి అను ఏకలక్ష్యము లేక గమ్యస్థానము చేరుటకు వేర్వేరు మార్గములు కాని వేర్వేరు ప్రత్యేకమతములు కానేరవు.

క్రైస్తవమతమును అవలంబించిన యూరోపియనులు తొలుత వర్తకులుగా భారత దేశమున ప్రవేశించిరి. వారెప్పుడును ఇండియాను తమ మాతృభూమిగా గాని, స్థిరనివాసస్థలముగాగాని భావింపలేదు. ఇదివరలో ప్రాచీనకాలమున భారత దేశములోనికి వచ్చిన విదేశస్థుల వంటివారు కారు. వారు భారతసంఘమున లీనమగుట కోరలేదు. తొలుత భారత దేశములోనికి వచ్చిన పోర్చుగీసువారు పూర్వాచార పరాయణులగు కాథలిక్ క్రైస్తవులు. సంకుచితభావములుకలవారు. భారతీయులను తమ మతములోనికి బలవంతముగా కలుపుకొన యత్నించిరి. తరువాత వచ్చినయూరోపియన్ క్రైస్తవులలో ఇంగ్లీషు వారు ముఖ్యులు, వారు మతవిషయమున ఉదారభావములు, సహన భావముకలవారు. వారు వారి వర్తకవిషయములు మాత్రమే చూచు కొనుచు తక్కినవాని జోలికిపోలేదు. భక్తిమార్గముమీద స్థిరపడిన క్రైస్తవమతము భక్తిమార్గ మొకమత నిధానముగాగల హిందూ

మతముతో సంఘర్షణలు లేక యుండెను. హిందూమతమున జ్ఞాన, కర్మ, భక్తి మార్గములు మూడు మోక్షసాధకములు కావున ఇతర మతములలో ఆమార్గములున్నప్పుడు వానితో ఘర్షణకు అవకాశము కల్పింపలేదు. అందుచే అన్యమతములు ఆమూడు మార్గములలో ఏదో ఒక మార్గము కలిగి దానితో సహనము కలిగియుండుటో వానితో లీనమగుటయో తటస్థించినది. ఘర్షణకు చోటులేదు. ఉపనిషత్తులు భగవద్గీతలపై ఆధారపడిన హిందూమతమున ఈ ప్రత్యేక లక్షణము కలిగి అది నిర్విఘ్నముగా కొనసాగుటకు తోడ్పడినది.

పూర్వపు మహమ్మదీయ ప్రభువులవలెనే, క్రైస్తవ ప్రభువులుకూడ తమ మతమగు క్రైస్తవ మతములోనికి ప్రజలను ఆకర్షించుటకు కొన్ని రాజకీయ ఆర్థిక లాభములు సౌకర్యములు ఎరచూపిరి. కాని కొలదిమంది క్రింది జాతులవారు మాత్రమే హిందూమతమును విడిచి వారి మతమున చేరిరి. సుమారు రెండు వందల సంవత్సరములకు పైగా క్రైస్తవ మతము భారతదేశమున తిష్టవేసినను ఎక్కువ మందిని ఆకర్షింపలేదు. ఏడెనిమిదివంద లేండ్లనుండి దేశమునగల ఇస్లామ్ మతము వలెనే ఇదియు పెక్కు హిందువులను ఆకర్షింపజాలకుండెను. వేదములు, గీత, ఉపనిషత్తులమీద నిలచిన హిందూమతమున గల సత్యము, జ్ఞానము, శాంతి, అహింస ధర్మములు సర్వజన సమ్మతము లగుటచే హిందూమతము ప్రాచీనమునుండి నేటివఱకు చెక్కుచెదరక నిలిచినది. పరమేశ్వరునికి అందరు మానవులు సమానము ను ధర్మము వేదాంత సమ్మతము. మహర్షులు దానిని కనిపెట్టిరి. శ్రీ శంకరుడు, స్వామి వివేకానందుడు దానిని ప్రపంచమున అజేయము గావించిరి. వివేకానందుడు చికాగో సర్వమత సభలో గావించిన ఉపన్యాసము, అతని మతసేవ హిందూమత గొప్పదనమును ప్రపంచమున స్థిరముగ స్థాపించినవి.

క్రీ॥ శ॥ 19వ శతాబ్దములో భారతదేశమున లేచిన బ్రహ్మ సమాజము, ఆర్యసమాజము, ప్రార్థన సమాజము, రామకృష్ణమత ప్రచార సంఘము, దివ్యజ్ఞాన సమాజము అను సాంఘిక మత సంస్థలు, జ్ఞాన, కర్మమార్గములందు వేదాంత మతమును పునరుద్ధరించినవి. ఈ ఇరువదవ శతాబ్దమున రాధాస్వామి, సాయిబాబా, మెహర్బాబా హరనాదా బాబాలు క్రొత్తమత సాంఘిక ఉద్యమములు స్థాపించిరి. ఇవి కర్మ, భక్తి మార్గములను అనుసరించిన ఉద్యమములు. జ్ఞాన మార్గము వేదాంతములగు ఉపనిషత్తులమీదను, కర్మమార్గము భగవద్గీతయందును భక్తిమార్గము మాద్యమిక శైవ వైష్ణవ మతము లందును, ప్రస్తుతకాల హరనాధ, సాయిబాబా మతములందును వ్యక్తబడుచున్నవి. ఈ రీతిగా వివిధమతముల ఉత్పత్తి పెరుగుదలలకు ఆధారమైన భారతదేశమున వివిధమత సాంఘిక వ్యవస్థల నడుమ, హిందూమతము సహకార సఖ్యతలు సంపాదించి ఏండ్లతరబడి బలము గొని నిలిచినది.

ఆధునిక హిందూమతముయొక్క ప్రాతిపదికయగు మతైక్యతా భావమును, ఆధునికభారతదేశ నాయకులు బోధించిరి. వారిలో శాంతి, అహింసా సత్యమార్గములను బోధించిన కర్మజ్ఞాని మహాత్మా గాంధి, కర్మయోగి జవహర్‌లాల్ నెహ్రూ, విశ్వమానవజ్ఞాని సాహిత్యవేత్తయగు రవీంద్రనాథుడు, నేటి ఆధునిక తత్వవేత్త సర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు, ముఖ్యులు.

# 4. సాంఘిక ప్రతిష్ఠంభన-సాంఘిక దుస్థితి

క్రీ॥ శ॥ 1000-1500 నడుమ హిందూచరిత్రలో మధ్యమ యుగము. ఆ కాలమున హిందూమతమున, సంఘ స్థితులందు ప్రతిష్ఠంబన కాలము కూర్మము తనపై వెన్నుచిప్పక్రింద ఇమిడినట్లు బిర్ర బిగిసి కాఠిన్యము వహించినది. ఆ పరిస్థితులు తమ ఆత్మ రక్షణకే అట్లు కదలక, మార్పులేక పోయినవి. ఆ కాలముననే దేశమున మహమ్మదీయ దాడులు, రాజకీయ, సాంఘిక, మత కల్లోలములు ప్రారంభము లయినవి. ఇస్లామ్ హిందూ మతస్థులకు సంఘర్షణలు మొదలిడినవి. హిందూమతము, ఇస్లామ్‌కూడ బలముగల స్వాతంత్ర మతములు, పట్టుదలలు గలవి. ప్రాచీనము నుండియుబలపడి, కాలము ననుసరించి మారుచు ముఖ్యాంశములందు మార్పులేక నిలిచినది. దానికి మతావేశము కలిగి, విజయగర్వముచే తొందరపాటు గల మహమ్మదీయులతో కలహము ప్రారంభమయ్యెను. ఏకేశ్వరారాధన, సత్యము, జ్ఞానము, ధర్మమార్గము, కర్మమార్గము ననుసరించు ఆరాధన గల ఇస్లామునకు అట్టి ముఖ్యాంశములుగల వేదాంత మత శాస్త్రములతో సంఘర్షణ లేదు. కాని పౌరాణిక హిందూమతము, దానికి ముఖ్యాంశములగు వైదిక కర్మకాండ, దేవాలయములలో పెక్కు దేవుళ్ళ విగ్రహారాధన, వాని ఉత్సవములు, ఊరేగింపులు, మహమ్మదీయులకు కంటకములై వారిని రెచ్చగొట్టినవి. అందుచే వారు హిందువులతో కలహించిరి.

హిందువులు, మహమ్మదీయులుకూడ అన్యోన్యము లొంగని పూర్వాచార పరాయణులే. మత గ్రంథముల ననుసరించువారే. ఇస్లామ్ పౌరాణిక హిందూమతముల బాహ్యలక్షణములు అన్యోన్య

విరుద్ధములుగా నుండెను. రాజకీయ విజయగర్వముచే మహామ్మ దీయులు తమ మతమే గొప్పది, సరియైనదను నమ్మకముతో హిందూ మత నాశనమునకు పూనుకొనిరి. హిందువుల దేవాలయములను నాశనముచేసి వానిలోని దేవతావిగ్రహములు నాశనము చేసిరి. బలవంతముగా హిందువులను ఇస్లాము అవలంభింప నిర్బంధించిరి. హిందువులు తమ మతవిధానము అందరికి నచ్చునట్లు దేవుళ్ళ విగ్ర హములు దేవాలయములందు నిల్పిరి. వర్ణాశ్రమ ధర్మములు మరింత బిగించి మార్పులకు వీలులేకుండ చేసిరి. అందుచే హిందూమత విధా నము, సంఘ నియమములు, కులభేద నియమములు స్థంభించినవి. మూఢభక్తిగల సామాన్యులు అజ్ఞానులునగు ప్రజలు కిక్కురుమనకుండ బ్రాహ్మణుల నిర్ణయములను పాటింప పట్టుదల వహించిరి.

స్వీయరక్షణ మార్గములు కోరిన హిందూమతస్థుల వర్ణవ్యవ స్థలోగల బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులందు, శాఖా భేదములు, అంతఃశాఖాభేదములు పెరిగినవి. దక్షిణ ఇండియాలో ఆంధ్రప్రదేశమందు బ్రాహ్మణులలో నియోగి, వైదికభేదములు కలిగినవి. వైదికులలో ద్రావిడ, వెల్నాటి, వేగినాటి, కాసలనాటి, ములికినాటి భేదములు ప్రబలినవి. వివిధప్రదేశముల నడుమ సులభ ముగా, వేగముగా ప్రయాణములు చేయుటకు, అన్యోన్య పరిస్థితులు తెలిసికొనుటకు రాకపోక సాధనములు లేకుండుట, రాజకీయ మత కల్లోలములవలన సాంఘిక శాంతిభద్రతలు తక్కువగుట, ఈ శాఖా భేదములు పెరిగి బిరబిగియుటకు కారణము అయినవి. రాజులలో సూర్యకులమువారు, చంద్రకులమువారు భేదములు. భట్రాజకులము లేచినవి. శూద్రులందు కాపు, తెలగ, వెలమ, కమ్మ, రెడ్డి మొద లగు భేదములు కలిగినవి. భారతదేశమున ఒక్క రాష్ట్రములో నాలుగు వర్ణములందు శాఖోపశాఖలు ఎట్లు కలిగినవో తెల్పుటకిది

యొక నిదర్శనము. వర్ణములలో ఇట్టి శాఖోపశాఖల విభజన సాంఘిక ఐక్యత పోగొట్టినవి.

మధ్యయుగమున, విశాలమై ఉపఖండ మనదొప్పు భారత దేశమునందు వివిధభాగములు నడుమ సులభములగు రాకపోక దారులు లేవు. అందుచే ఏనాడులు లేక ప్రదేశములందుండు వర్ణశాఖల వారు ఆయాశాఖలవారితోనే అన్యోన్య వివాహసంబంధములు, భోజన ప్రతి భోజములు చేయుచు ఇతర నాడుల వారితో అట్టి సంబంధములు నిషేదించిరి. ఈ కారణములు మతసాంఘిక పరిస్థితుల ప్రతిష్ఠంబనకు తోడ్పడినవి.

ఇస్లామ్ దాడులనుండి తమ మతమును వర్ణభేదపద్ధతులు సాంఘికాచారములు రక్షించుకొనుటకు హిందువులు హిందూమతా చార్యులు శాస్త్రవేత్తలు మరికొన్ని కఠిన నిబంధనలు ఏర్పరచి, మతసాంఘిక వ్యవస్థలు బిగియునట్లు చేసిరి. వేదయుగమున హిందూ స్త్రీలు ఉన్నతవిద్యావతులై పురుషులతో సమానముగా మత, సాంఘిక, సాంస్కృతిక హక్కులు కలిగియుండిరి. మహమ్మదీయులు దేశములో ప్రవేశించి తిష్టవేయువఱకు అనగా క్రీ॥ శ॥ 600 వఱకు వారట్టి ఉన్నతస్థానము పొందియుండిరి. వైదిక యుగమున లేని బాల్య వివాహములు, విధవా పునర్వివాహ నిషేధము, నిర్బంధసహగమనము, పౌరాణికి హిందూయుగకాలమున పొడచూపి మధ్యయుగమున బల పడినవి. ఉన్నతకులములందు భర్తలు మరణింప వారి భార్యలు నిర్బంధ ముగా సహగమనము చేయ ప్రోత్సహింపబడిరి. వైదిక ఐతిహాసిక కాలములందే సహగమనవ్రతము పతిహీనలకు నిర్బంధము కాదు. పాండురాజు చనిపోగా అతని రెండవ భార్య మాద్రిపతితో సహ గమనము చేసెనుగాని, కుంతి అట్లు చేయలేదు.

వైదికయుగమున యుక్తవయస్కులగు యువతులకే వివాహములు జరుగవలెనను నియమము ఉండెను. వైదిక వివాహమంత్రములను చూడగా వధూవరులు ఆమంత్రములను స్వయముగా తామే ఉచ్ఛరింపవలసియుండెను. వానిని అర్థముచేసికొను యుక్తవయస్సు వచ్చిన తరువాతనే యువతీయువకుల వివాహములు జరుగుచుండెననుటకిది యొక ప్రబల నిదర్శనము. క్రీ. శ॥ 1000 వఱకు బాల్యవివాహములు జరిగినట్లు కనపడదు. కాని పౌరాణిక కాలమునాటికే అంతర్వర్ణ వివాహము లంతరించెను. వర్ణములలోని అంతః శాఖలనడుమ వివాహములుకూడ క్రమముగా నిషేధింపబడెను. ఇస్లామ్ మతము భారతదేశమున స్థిరపడగానే, అదివఱకు హిందూసంఘమున లేని కొన్ని మార్పులు ప్రవేశించి సాంఘిక దురాచారములుగా మారినవి. హిందూ బాలికలను అపహరించి, వారిని ఇస్లామ్ మతమున చేర్చి బలవంతముగా మహమ్మదీయులు ప్రవర్తింపకుండా హిందూమతాచార్యులు సనాతన ధర్మములు కొన్ని మార్చిరి. మహమ్మదీయులు వివాహమాడిన హిందూ బాలికలను ముట్టకొనరను నియమము చూచి, హిందూ బాలికలకు ఎనిమిదవ యేడు వయస్సురాగానే వివాహము చేయవలెనను నియమముశాసించిరి. దానిని ఉల్లఘించిన వారు రవరవ నరకముల పాలగుదురను శిక్షకూడ సూచించిరి. దైవభీతి మూఢనమ్మకములుగల హిందువులు వారిమాటలుపాటించిరి. ఆరీతిగా బాల్యవివాహ సాంఘిక దురాచారము అమలులోనికి వచ్చెను.

వైదిక పౌరాణిక యుగములందు పురుషులతో సమాన హక్కులను స్త్రీలు అనుభవించుచుండిరి. వైదికకాల సంఘములో దివ్యజ్ఞానముగల బ్రహ్మవాదినులగు విదుషీమణులు వేదములలోని సూక్తులుకూడ కొన్ని రచించిరి. మతవేదాంత చర్చలందు పండితు

లతో చర్చలందు పాల్గొనుచుండిరి. మతవిధానములందు కర్మలందు స్త్రీలు వారి భర్తలతో సమానభాగస్వామ్యము కలిగియుండిరి. భార్యా భర్తలలో ఎవరు లేకుండ చేసిన మతసాంఘిక కర్మలు నిరర్థకములని శాశింపబడెను. శాస్త్రజ్ఞానమునందుకూడ స్త్రీలు మంచి ఉన్నతవిద్య జ్ఞానము కలవారైరి. సాహిత్యమునందు లలితకళలగు చిత్రలేఖన, సంగీత, నృత్యకళలందుకూడ స్త్రీలు మంచి ప్రావీణ్యము కలిగి కీర్తి గాంచుచుండిరి. కొందఱు స్త్రీలు ప్రసిద్ధకవయిత్రులు. ఆకాలములందు స్త్రీలు పురుషులతో స్వేచ్ఛగా కలిసి తిరుగుచుండిరి. ఘోషాపద్ధతి ఎచ్చటను లేకుండెను.

కాని మహమ్మదీయ యుగమున హిందూ సంఘములో కొన్ని మార్పులు వచ్చినవి. స్త్రీల పరిస్థితులందు ఈమార్పులు ప్రస్ఫుటములయ్యెను. ఉన్నత కులములందు స్త్రీలు రాణివాసములందుండి, పురుషులకు ఎప్పుడును అగపడక, కఠిన ఘోషా పద్ధతులను అవలంబింపసాగిరి. మహమ్మదీయ విజృంభణ, తరచు, వారి దండయాత్రలు జరుగుటవలన, వారి పరిపాలన, వారి సంస్కృతి ఫలితముగా, ఉన్నత కులముల స్త్రీలు ముఖములపై బురఖాలు, వేసికొని మేలిముసుగులు వేసికొని, తెరల వెనుక రాణి వాసములందు కాలముగడుపసాగిరి. ఈ పద్ధతి నేటికిని ఉత్తర హిందూస్థానమున హిందీ, బెంగాలీ, ఒరియారాష్ట్రములందు ఎక్కువగా గలదు. తక్కువవర్ణముల లేక కులములలోని స్త్రీలు శిరస్సులపై సగము మేలిముసుగులు వేయు ఆచారమును అవలంబించిరి.

కాని దక్షిణ ఇండియాయందు మాత్రము ముస్లిమ్ ప్రభావము రొక్కటము తక్కువ. చాలకాలము లేదు. ఉత్తర ఇండియాలోవలె ఎక్కువ కాలము బలముగా నాటుకోలేదు. ఇప్పుడు

ఆంధ్రరాష్ట్రములో తెలంగాణాయందు మహారాష్ట్ర, మధ్యప్రదేశ, మైసూరు భాగములలోని పూర్వపు హైద్రాబాదు భాగములందును, కేరళ రాష్ట్రమునందును మహమ్మదీయులు గలరు. తక్కిన భాగములలో లేరు. దక్కను దక్షిణ ఇండియాలందు మధ్యయుగమున విజయనగర సామ్రాజ్యము, ఆధునిక యుగమున మహారాష్ట్ర సామ్రాజ్యము హిందూమత సాంఘిక సాంప్రదాయములు ఇస్లామ్ మతముచే ఆణగద్రొక్క బడకుండ వానిని కాదిరక్షించి హైందవ నాగరకత సంస్కృతులను కాపాడి నిలిపినవి. ఆ కారణములచే దక్షిణ భారత దేశమున స్త్రీల ఘోషాపద్ధతి ప్రవేశింపలేదు. ఒక మహమ్మదీయులందు కొంత నిలిచినది.

మధ్యయుగ హైందవ సంఘమున ప్రాచీన యుగములందు వలె స్త్రీలు ఉన్నతస్థాన గౌరవములు నిలుపుకొనలేదు. వారు వారి సమకాలికులగు ముస్లిమ్ స్త్రీలవలె స్వతంత్రులు గాకయుండి పురుషులపై ఆధారపడియుండిరి. హిందూ స్త్రీలు మహమ్మదీయ స్త్రీ ఆచారవ్యవహారములు కొన్ని అనుకరించిరి. ఆకాలపు హిందూ ధర్మశాస్త్రజ్ఞులుకూడ స్త్రీలకు తగు క్రొత్త స్థానము కాశించిరి. హైందవ స్త్రీకి ఎన్నటికి స్వాతంత్ర్యము తగదని "నస్త్రీ స్వాతంత్ర్యమర్హసి" అను క్రొత్త శాసనము కావించిరి.

ఆరీతిగా మధ్యయుగము నాటికి హైందవ సంఘమున కాలగతి ననుసరించి, పరిస్థితులను బట్టి కొన్ని మార్పులు కలిగినవి. మూఢ నమ్మకములుగల సామాన్యప్రజలు ఆ శాస్త్రకారుల బోధనలు నమ్మి వారు చేసిన మార్పులు పట్టుదలతో అవలంబించిరి. అందుచే పూర్వాచార పరాయణత్వము మరింత కఠినమైనది. ప్రాచీనకాలమునందు స్త్రీలు ఉన్నతవిద్య విచక్షణ జ్ఞానము కలవారై ఆచార వ్యవహారములను అనుకూలించునట్లు వాడుచుండిరి. కాని మధ్య

యుగములోని హైందవ స్త్రీలు విద్యలేనివారై, స్వతంత్రాలోచనలు లేనివారై మూఢ నమ్మకములతో క్రొత్తగావచ్చిన ఆచారములను పట్టుదలతో ఆచరింపసాగిరి.

ఈరీతిగా మధ్యయుగమున ఇస్లామ్ మత సంస్కృతుల ప్రభావముచేతను హిందూ సంఘములో కొన్ని దురాచారములు ప్రవేశింప వీలు:కలిగెను. ఆలోపములను ఈక్రింది విధముగా వివరింపవచ్చును. హిందూ సంఘమునగల వర్ణవ్యవస్థ అనబడు నాలుగు కులములు, వానిలోని శాఖలు అంతః శాఖలు బలపడి మార్పులకు వీలు కల్పింపక స్థంబించినవి. దానివలన హైందవ సంఘ ఐక్యత చెడినది. ప్రాచీనకాలపు స్త్రీలవిద్య, విజ్ఞానము, స్వాతంత్ర్యము గౌరవము అంతరించినవి. బాల్యవివాహములు విధింపబడినవి విధవా పునర్వివాహములు నిషేధింపబడినవి. సతి లేక సహగమనము అనగా భర్తలు చనిపోయినప్పుడు వారి భార్యలు వారి భర్తల శవములతో కూడ బలవంతముగా కాల్చివేయబడు భయంకర దురాచారము ఎక్కువ కులములలోని స్త్రీల పయినవిధిగా బలవంతముపై అమలులోనికివచ్చినది. ఇదిప్రాచీనకాలమున ఐచ్ఛికమయినను మధ్యయుగమున చాల వఱకు నిర్బంధమైనది.

ప్రాచీనకాలములో లేని స్త్రీల ఘోషాపద్ధతి మధ్యయుగమున మహమ్మదీయాచార అనుకరణముపై హిందూ సంఘములో అగ్రకులముల స్త్రీలలో అచారమయ్యెను. ఇవి యన్నియు ప్రాచీన భారత విజ్ఞానవిరుద్ధములని హిందూ శాస్త్రవేత్తలకు తెలియును. కాని కాల పరిస్థితులను అనుసరించి వారు ఈయనర్థములను ప్రవేశపెట్టుటకు వెనుదీయలేదు. స్వమత, ధర్మరక్షణకొఱకే వారట్లుచేసిరట. క్రీ॥ శ॥ పదహారవ శతాబ్దములో ఆధునికయుగముప్రారంభమైనప్పటికి ఈరీతిగా హిందూ సంఘమున ప్రతిష్ఠంభన పూర్తియైనది.

ఆధునికయుగము ప్రారంభముకాగా ఉత్తర హిందూస్థానమున మొఘల్ సామ్రాజ్యస్థాపన ఆరంభమయినది. దక్షిణ ఇండియాలో హిందూమతము, విజ్ఞానవేత్తలు, సంస్కర్తలు అగు శాయనాచార్యులు, విద్యారణ్యస్వామి అను జ్ఞానులగు సోదరులు కావించిన బలవత్తర యత్నముల ఫలితముగా, ఇస్లామ్ మతము దారిపడకుండ నిలిచి భారత సంస్కృతిని బలపరచినది. ఇస్లామ్ మతప్రభావమను మహాసముద్రపు కెరటములు, భారత హైందవ సంస్కృతిని ముంచెత్తకుండ హంపీ విజయనగర హిందూసామ్రాజ్యము చెలియలి కట్టగా పనిచేసినది. హిందూమత సాంఘిక, సంస్కృతులకు స్వర్ణయుగము కల్పించినది.

ఉత్తర హిందూస్థానమున విశాలహృదయుడగు మొఘల్ చక్రవర్తి అక్బరు, హిందూమత ఉత్కృష్టత గ్రహించి, దానియెడ సహనభావముచూపి, హిందూ - ముస్లిమ్ మతముల సామరస్యసహకారములనుకోరి కొన్ని సాంఘికమార్పులు కల్పించి హిందువుల ఆదరము సంపాదించెను. తన సామ్రాజ్య సుస్థిరత హిందూ ముస్లిమ్ సహనసహకారముల మీదనే అధారపడినదని గ్రహించి, విజ్ఞత, రాజనీతిజ్ఞత కనపరచిన మహాశయుడు అక్బరుచక్రవర్తి. అందుచే అతనికాలము, మొఘల్ పరిపాలనకు స్వర్ణయుగమువంటిది. ఉదార మనస్సుగల మొఘల్ చక్రవర్తుల కాలమునందే హిందూ విజ్ఞానవేత్తలు కొందఱు, ముస్లిమ్ జ్ఞానులగు మౌల్వీలు కొందఱు ఉభయ మతముల మతసాంఘిక సామరస్య సహకారావశ్యతలుగుర్తించి, సంభించినమతపట్టుదలలుగల ఆ యుభయమతముల నడుమ స్నేహభావము కుదుర్చుటకు పాటుపడిరి.

ఉదారభావములుకల ముస్లిమ్ జ్ఞానులు, హిందూపండితులు కూడ భారతదేశము హిందువులకు మహమ్మదీయులకు కన్నతల్లియైన

మాతృభూమి అని బోధించిరి. అప్పటివఱకు, విడివిడిగా భారత, మహమ్మదీయ సాంస్కృతిక ప్రవాహములు ప్రవహించినవి కాని ఉభయమతముల జ్ఞానులు, ఆ రెండు ప్రవాహములు కలిపి ఒక సంయుక్త మహాప్రవాహముగా ఏర్పడి భారతీయ గౌరవప్రతిష్ఠలు కాపాడుకాలము వచ్చినదని గ్రహించిరి. అందుచే దానిని సాధించుటకు శక్తివంచనలేక పాటుపడిరి. కాని వారు కార్యసిద్ధి గాంచలేకపోయిరి. వారి ప్రయత్నములు విఫలములగుటకు కారణములు లేకపోలేదు. ప్రాచీనకాలమున భారతదేశముపై దండెత్తి, దేశములో ప్రవేశించిన విదేశీయులగు పారశీకులు, యవనులు, పార్థియనులు, శకులు, హూణులు ఐతిహాసిక, పౌరాణిక కాలములనాటి వారు, వారి వారి జాతీయ ప్రత్యేకతలను మరచి హిందూసంఘమున లీనమైరి.

కాని హిందూ మహమ్మదీయుల సమ్మేళనము అట్టిది కాదు. వారి ప్రత్యేక బలవత్తర, మత, సంస్కృతులు పూర్తిగా కలిసి ఐక్యమొంద తగినవి కావు. అదివఱకు విదేశీయులు హిందూమతమున కలయిక క్షీరోదక న్యాయమువంటిది. ఐక్యమొందిన పిమ్మట వేర్వేరు ప్రత్యేకతలు పూర్తిగా అంతరించిన కలయిక అది. కాని హిందూ, ముస్లిమ్, సాంఘిక మతసాంస్కృతిక సమ్మేళనము తైలోదక న్యాయమును అనుసరించినది. అనగా అన్యోన్యము ఐక్యముకాక ప్రత్యేక లక్షణములు నిలుపుకొనిన కలయిక మాత్రమే ఇది. హిందూమత కులభేదములు, విగ్రహారాధన ఇస్లామునకు సరిపడవు. నీరు, తైలము కలిపి ఎంత మిళాయించినను తుదకు తైలము నీటిమీద ప్రత్యేకముగా తేలిపోవును కదా! ఆ రీతినే ఇస్లామ్ పౌరాణికమతము ఎంతకాలము సన్నిహితముగా నున్నను కలియవు. అజ్ఞానము, మూఢనమ్మకము,

ప్రాతపద్ధతుల పట్టుదల. ఈ రెండుమతముల ఆంతరంగిక అభిప్రాయ ముల అర్థము, ఐక్యతాభావము అణచివేసినవి.

వేర్వేరు మతముల నడుమ, వర్ణభేదములనడుమ, వాని అంత శ్శాఖల నడుమగల భేదములను పోగొట్టి ఐక్యత కలిగించు ప్రయత్న ములను కొందఱు ఉదారమనస్కులగు రెండు మతములవారు తలపెట్టిరి. అట్టివారిలో మతజ్ఞానము కలవారు, పరిపాలకులుకూడ గలరు. వీరి ప్రయత్నములు క్రీ॥ శ॥ పదిహేడు, పదునెనిమిది పందొ మ్మిదవ శతాబ్దములందు జరిగినవి. వారి ప్రయత్నములు క్రమక్రమ ముగా ఆశించు ఫలితములు అందచేయగలవు. మధ్యయుగ ఉత్తరా ర్ధమున ఉత్తర, దక్షిణ ఇండియాలలో క్రమముగా అక్బరు, కృష్ణ రాయలును ఆధునిక యుగమున ఉత్తరమున రంజత్ సింగ్ దక్షిణ మున శివాజీయును మత సహనమును కలిగి హిందూ ఇస్లామ్ మత ములు రెండింటిని గౌరవించిరి. సాధారణ మహనీయులలో జ్ఞానులలో రామానందు తుకారామ్, కబీర్, తులసీదాసులు హిందు–ముస్లిమ్ మతముల సామరస్య, సహకార స్నేహములను సంపాదింప మత బోధలు గావించి సాంఘిక మార్పులు కల్పించిరి.

---

## 5. నూతన భావోదయము– సంఘ సంస్కరణ ప్రారంభము

నాగరికతాభివృద్ధి చరిత్రలో ప్రపంచమునగల యితర దేశము నందువలెనే, హిందూసంఘము, మతము సంస్కృతి ఆచార వ్యవ హారములందు దేశకాలపాత్ర సంఘటనలను అనుసరించి మార్పులు కలిగినవి. కాని ఇతర దేశములందు వలెగాక, భారత దేశమున మార్పులు

వేగముగా వచ్చి వేగముగా అంతరింపలేదు. ఇతరదేశములందువలె గాక ఈ దేశమున భారతనాగరికత సంస్కృతి అంతరాయములు లేక, వర్ధిల్లినవి. అప్పుడప్పుడు కాలభేద, అవసరముల ననుసరించి కొలది మార్పులు మాత్రమే అందు చేయబడినవి. మత సాంఘిక సంస్కృతులకు గట్టి పునాదులు ప్రాచీన కాలమున వేయబడినవి. వానిబలము మీద భారత సాంఘిక నాగరకత అనుభవము నిలిచియున్నది. హిందూమతమునకు గట్టి పునాదులు వేదములు, ఇతిహాసములు పురాణములయందు కలవు.

ప్రాచీన వైదిక సంస్కృతి సంఘ మర్యాదలు, తరువాత క్రమముగా వచ్చిన ఇతిహాస, పురాణయుగములందు కొన్ని మార్పులు పొందినవి. ఏకేశ్వరారాధన అంతరింప దాని స్థానమున పెక్కు దైవముల ఆరాధన వచ్చినది. అట్టి ఆరాధన ప్రత్యక్ష దైవారాధనగా ప్రజలను ఆకర్షించినది. సామాన్యుల కొఱకే అది ఉద్దేశింపబడెను గాని జ్ఞానులకు కాదు. మధ్యయుగమున శంకరుడు జ్ఞానమార్గమున, రామానుజుడు భక్తిమార్గమున మతబోధ గావించిరి. ఆధునికయుగమున జ్ఞానవేదాంత మార్గమున వివేకానందుడు భక్తిమార్గమున సాయిబాబా అందరిని ఆకర్షింప మతబోధలు గావించిరి.

సాధారణ ప్రజలకు హిందూమతము, ఇస్లామ్ పరస్పర విరుద్ధములుగా కనిపించును. రెండు మతములందు తత్వబోధకులు, ఈ రెండు మతముల మూలసూత్రములందు ఐక్యత గలదని గ్రహింపగలరు. అందుచే వారు ఎప్పటికైన పరస్పర విరుద్ధములుగా కనిపించు ఈ పౌరాణిక, హిందూమత, ఇస్లామ్ మతముల ఐక్యత వేదాంత తత్వమూలముగా సాధ్యము కాగలదని యెంచిరి. దానివలన ఈ రెండు మతముల సహకార, సామరస్య, సఖ్యతలను సాధించి, జాతీయఐక్యత నేర్పరచి, మతకాహిత్య సర్వస్వతంత్ర భారత ప్రభుత్వమును స్థాపింప వీలుకలదని భావింపబడుచున్నది.

మహమ్మదీయ మతావేశము, పౌరాణిక హిందూమత ప్రాత పద్ధతులు పట్టి ప్రాకులాడుట, అనునవి ఈ మతముల సంఘర్షణలు కలిగించినవి. కాని ఆ సంఘర్షణలు రక్తపాతముతో కూడిన మత యుద్ధములకు దారి తీయలేదు. అప్పటి సమకాలిక యూరపు రాష్ట్రములలో మాత్రము క్రైస్తవ మతశాఖలగు రోమన్ కాథలిక్, ప్రొటెస్టెంటు శాఖలకు ఘోర మతయుద్ధములు జరిగి రక్తపాతము కలుగజేసినవి. హిందూ ఇస్లామ్ మత సంఘర్షణలు శాంతిమార్గమున, అన్యోన్య వాదోపవాదన, మంచి పటుత్వ ధర్మబోధలద్వారా సమన్వయము సాధింపదలచినవి. అంతకు మించిన యెడల, మతభేదములు కల్గించువారికి, కులభ్రష్టత. దేశభ్రష్టతలు శిక్షలుగా తలపబడెను. హిందూమతమునకు ప్రత్యేకలక్షణమగు ఈ యంశము ప్రశంసనీయమైనది. అన్ని మతముల ప్రధానధర్మములు దానియందుఇమిడియుండుట చేతనే, వానితో సంఘర్షణ కలిగినను అది నిలువకలిగినది. ఆ కారణముచేతనే కొలదిమంది హిందువులే ఇతర మతములలో కలియుట కూడా సంభవించినది. అందును ముఖ్యముగా ఇస్లామ్ మతమున ఇట్లు జరుగుట గమనింపతగినది. ఇస్లాము మతమున కలిసిన ఆ కొలదిమంది కూడ స్వార్థపరులై అందుచేరిరే కాని ఇస్లామ్, హిందూమతముకంటె ఉత్కృష్టమైనదను కారణమున వారు దానిలో కలియలేదు.

బౌద్ధమత ప్రధాన సూత్రములగు సత్యము, అహింస పెద్దల యెడ గౌరవము ధర్మమార్గ మవలంభించుట అనునవి. ఇస్లామ్ సూత్రములగు సత్యము, జ్ఞానము, మద్యపాన నిషేధము, మత విద్యుక్తకర్మ విధానములు హిందూమతమునకు క్రొత్తలు కావు. హిందూమత పునాదియగు వేదాంత సూత్రములకు అవి సన్నిహితములు. భారత సంఘములో నూరుమందిలో ఎనుబది యైదుగురు హిందువులు, తక్కిన వారు తక్కిన మతములవారు. భారతదేశ మహమ్మదీయులలో

ఎక్కువమంది కాశ్మీరము, పంజాబులందును దక్షిణమునఆంధ్రప్రదేశ్ కేరళ రాష్ట్రములందును గలరు. జైను లెక్కువగా రాజస్థానము, గుజరాత్ రాష్ట్రములందు మాత్రమేగలరు. బ్రిటిష్ ఇండియాలోని పెక్కుమంది మహమ్మదీయులు క్రొత్తగా ఏర్పడిన స్వతంత్ర పాకిస్తాన్ రాష్ట్రమున నిలిచిపోయిరి. 1947 లో అట్లు జరిగినది. అప్పుడే పాకిస్థాన్, స్వతంత్రభారత దేశము విడిపోయినవి.

స్వతంత్ర రాష్ట్రములైన భారత రిపబ్లిక్, పాకిస్థానములందు అల్పసంఖ్యాకుల హక్కుల సంరక్షణ, వాని ప్రభుత్వముల ప్రధాన ధర్మముగా గుర్తింపబడినది. స్వతంత్ర భారతదేశమున భారతపిత మహాత్మాగాంధి తన జీవితమంతయు హిందూ మహమ్మదీయ సఖ్య సాధనకు ధారపోసి, ఉభయులకు శాంతి సంపాదించుదానికై 1948 సంవత్సరము జనవరి ముప్పదవ తేదీని తన ప్రాణములనుకూడ అర్పించెను.

ప్రస్తుత స్వతంత్ర రిపబ్లిక్ ప్రభుత్వలక్ష్యము జాతి మత కుల భేదములు పాటింపని సంపూర్ణ స్వాతంత్ర్య సామాజిక రాష్ట్ర స్థాపనయే. రాజకీయార్థిక మత సాంఘికములగు సమాన హక్కులు అన్ని మతముల భారతీయులకు అందజేయుట దాని బాధ్యతగా నిర్ణయించినది. వివిధ సాంఘిక, మత మతాల సమ్మేళనమునకు సామాజిక సౌభాగ్యమునకు సామాజిక ప్రభుత్వస్థాపన ముఖ్య మని గ్రహింపబడినది. ఇదియే ప్రస్తుత భారతదేశ కాంగ్రెసు ప్రభుత్వ లక్ష్యములు.

క్రీ.శ. పందొమ్మిదవ శతాబ్దమునుండి, భారతీయ సాంఘిక సంస్కరణ అన్నిరంగములందలి ప్రజల పనిపాటులకు లక్ష్యమైనది. సంఘపరిస్థితులు మారుచున్నవి. మతసాంఘికఐక్యసాధన, భారత పౌరుల వ్యక్తిగత హక్కులరక్షణ అట్టిఐక్యతసాధించుటకు ముఖ్యము

లయినవి. అట్టిసాధనకు బ్రహ్మసమాజమతము, ప్రార్థనసమాజకృషి, రామకృష్ణ మతసంస్థ పనిపాటలు, ఆర్య సమాజమువారి ఆదర్శము, దివ్యజ్ఞాన సమాజమువారి ప్రోద్బలము తోడయినవి.

ఉత్తరహిందూస్థానమున బెంగాలునందు రాజారాంమోహన రాయలు బ్రహ్మసమాజమును, పంజాబులో స్వామీ దయానంద సరస్వతి ఆర్య సమాజమును, మహారాష్ట్రమున బ్రహ్మసమాజ మతప్రభావమున మహాదేవ్ గోవిందరనెడి, ప్రార్థనసమాజమును, బెంగాలునందు శ్రీరామకృష్ణ పరమహంస ప్రధాన శిష్యుడు స్వామి వివేకానందుడు రామకృష్ణ సంఘసమాజమును ఏర్పరచి వేదాంతమత ధర్మములు, సంఘసేవ, జాతీయవిద్య, అనాధసేవ ఉద్యమములను లేవతీసిరి. ఉపనిషత్తులు భారతీయ సనాతనధర్మములను ఆధారము చేసికొని దక్షిణఇండియాలో మద్రాసుచేరువగా అడయారునందు బ్లావిస్కీదొరసాని, రష్యావిజ్ఞాన వనితారత్నము దివ్యజ్ఞాన సమాజము సాంఘికసేవ ఉత్కృష్ట విద్యా సేవ లక్ష్యములుగా స్థాపించెను. దానిని బలపరచి, యాజమాన్యము వహించి అనిబెసెంటు అను ఐరిష్ దొరసాని పాటుపడెను.

ఆంధ్రదేశమున బ్రహ్మసమాజ మతమును సర్ రఘుపతి వెంకట రత్నమునాయుడు ప్రారంభించెను. కవిపుంగవుడు ఆధునిక ఆంధ్రసారస్వతనిర్మాతయగు రావుబహద్దూర్ కందుకూరివీరేశలింగం పంతులు దానిని బలపరచి విధవాపునర్వివాహోద్యమమును స్థాపించెను. ప్రస్తుత ఇరువదవ శతాబ్దమున, బాల్య వివాహములను నిషేధించు శారదాచట్టము, విధవాపునర్వివాహములను అంగీకరించు న్యాయచట్టము అమలులోనికి వచ్చినవి. ఈ రెండవ చట్టము యువతులగు వితంతువుల బాధలు మాన్పింప బయలుదేరినది. మరియు హరిజనులకు దేవాలయములలో ప్రార్థనకు అనుమతించు

చట్టముకూడ శాసింపబడినది. ఇంకనువారి ఇబ్బందులు తొలగింప హరిజనోద్ధరణ శాసనములు జరిగినవి. క్రొత్తగా వరకట్న నిషేధము కూడ శాసన రూపమున అమలులోనికి వచ్చినది. మరికొన్ని సాంఘిక దురాచారములు మాన్పించుటకు హిందూ న్యాయచట్ట సవరణ బిల్లులు చట్టములైనవి. కొన్ని చట్టములు కానున్నవి కొన్ని కలవు. ఈ రీతిగా పందొమ్మిదవ ఇరువదవ శతాబ్దములందు, అంతకు ముందు ఏర్పడిన హిందూ మత ప్రతిష్ఠంబన కాలమున ఏర్పడిన కొన్ని సాంఘిక దురాచారములు తొలగించు యత్నములు జరుగగా సంఘాభివృద్ధికి అవకాశము లేర్పడినవి. హిందూ సంఘమున భారత మహిళల అవిద్య, మూఢనమ్మకములు తొలగించుటకు నూతన చైతన్యము కలిగించుటకు వారి విద్యాసంస్కృతుల నెక్కువచేసి ప్రాచీన భారతమునగల వారి వైభవము పునరుద్ధరించు యత్నములు జరుగుచున్నవి.

---

# 6. సంఘ సంస్కర్తలకు సాంఘికాది పరిస్థితుల తోడ్పాటు

భారత దేశ చరిత్రలో ఆదినుండి క్రీ. శ. 1000 వఱకుగల కాలము ప్రాచీనయుగము. క్రీ. శ. 1000—1500 నడుమకాలము మధ్యయుగము. క్రీ. శ. 1500—1850 నడుమకాలము ఆధునిక యుగము. క్రీ. శ. 1850 నుండి ప్రారంభమయినది నేటి సాంఘిక సంస్కరణ యుగము. ఈ వివిధ కాలములందు సాంఘిక రాజకీయాది పరిస్థితులు సంఘ సంస్కరణ కెట్లు కారణములైనవో, ఎట్టిలాభములు కలుగ జేసినవో పరిశీలింపవలెను.

బహు ప్రాచీన కాలమున శిలాయుగముల అనాగరికుల వెనుక సింధులోయ నాగరకత వెలసినది. ఆదినివాసులు అనాగరికులు కాని సింధులోయ నాగరకత ప్రజల ప్రశస్తమయిన పట్టణ నాగరకత కలవారు అప్పటికి ఉత్తర, దక్షిణ భారత దేశమున స్థిరనివాసులగు ద్రావిడులుకూడ మంచి నాగరకత కలవారే. కాని వారి నాగరకత గ్రామీణ నాగరకత, పల్లెలకు మాత్రము సంబంధించినది. తరువాత దేశమంతట ప్రాముఖ్యము వహించిన ఆర్య నాగరకతకూడ గ్రామముల నాగరకతయే. కాని సింధులోయ పట్టణ నాగరకతా లక్షణములు కొన్ని ఆకళించుకొన్నది. ద్రావిడ నాగరకత లక్షణములను కూడ కొన్ని తనలో కలుపుకొని నిలుపుకొన్నది.

ప్రాచీన ద్రావిడ నాగరకత అంతకుముందుగల అనాగరికుల ప్రకృతి శక్తుల ఆరాధన గ్రహించినది. ఉత్కృష్టమయిన గ్రామీణ నాగరకతగా పేరుపొందినది. అది స్వాతంత్ర్యముగల గ్రామపంచాయితీ ప్రభుత్వ లాభము లన్నింటిని పొంది దేశాభివృద్ధి సాధించినది. ప్రజల ఆదరము అభిమానము సంపాదించినది. ప్రాచీన ద్రావిడ సంఘమున కుల భేదములు లేకుండెను. అంతకు ముందుగల ఆదినివాసులు తెగల భేదములు కలవారైనను ఏక కులమునకే చెందిరి. ద్రావిడుల వ్యవసాయ వ్యాపారములను పరిశ్రమలను అభివృద్ధి చేసిరి. పట్టనాగరకత లక్షణములు సింధులోయ నాగరకత ప్రజలనుండి నేర్చుకొనిరి. ఉత్తర ఇండియాలో ఇరుగు పొరుగువారుగా వారు సమకాలికు లగుట దానికి కారణము. వారినుండి ద్రావిడులు ఆదిశక్తియగు విశ్వజననీపూజ, ఆమె పతియగు శివునిపూజ గ్రహించిరి. ఈ పూజలు అప్పటి మతాచారములలో ముఖ్యముగా నుండెను.

తరువాత ఆర్యులు ఇండియాలో ప్రవేశించి స్థిరనివాసులయిరి. వారికి రాజుల పరిపాలన లుండెను. వైదిక ఇతిహాసయుగము

లందు పెక్కు ఆర్యరాష్ట్రములు ఉత్తర భారతమున స్థాపింపబడెను. వానిలో కొన్ని హిమాలయ పర్వత మండలము దగ్గర స్థాపితములై ప్రజా ప్రభుత్వములు గల రిపబ్లిక్కులు. ఈ ప్రజా ప్రభుత్వములు ప్రాచీన ద్రావిడ గ్రామపంచాయితీ ప్రభుత్వముల పద్ధతులమీాద నిర్మింప బడెను. రాజ ప్రభుత్వములందు పాలించు రాజులైనను, ప్రజాదరణ నిలుపుకొన్నంత కాలమే పరిపాలింపగలుగుచుండిరి. నియంతలు నిరంకుశులు నగు రాజులు, ప్రజల ఆందోళన ఫలితముగా తొలగింప బడుచుండిరి. ఈ రీతిగా ఆర్యరాజుల ముఖ్యలక్ష్యము ప్రజాను కూలములగు ప్రభుత్వములు సాగించుటయే యని తెలియుచున్నది. ఆర్య రాజకీయ వ్యవస్థయందు అరాజక రాజ పరిపాలనకు అవకాశమే లేకుండెను.

మత విషయమున తొలి ఆర్యుల ఋగ్వేదమతము ఏకేశ్వ రారాధనయే లక్ష్యముగాకలది. ఆర్య ద్రావిడ సంఘముల అన్యోన్య కలయికతో ఋగ్వేదమతము, సంఘము సంస్కృతి కొన్ని ద్రావిడ నాగరకత లక్షణములనుకూడ చేర్చుకొనెను. పౌరాణిక కాలమున హిందువులు విగ్రహారాధనసేర్చిరి. ఈపౌరాణిక యుగము, ఐతిహాసిక సూత్ర యుగముల తరువాత వచ్చినది. వానియుగమే అనంతర వేద యుగము. పురాణకాలమున హిందువులు బ్రహ్మావిష్ణు మహేశ్వరు లను త్రిమూర్తుల ఆరాధన అవలంబించిరి. ప్రాచీనకాలమునుండి కొలది కాలము క్రిందటి వఱకు హిందూసంఘమునకు గట్టి పునాదు. ప్రాచీనమునుండి దాని ననుసరించియే సాంఘిక మార్పులు జరిగినవి. ప్రాచీనమునుండియు హిందూ సాంఘిక వస్త్రముయొక్క నేతలో మతము, సంఘసంస్కరణ పడుగు పేకవంటివి. అవియే సంఘబలము సాధించి దాని ఐక్యత నిలిపినది. అందుచేతనే హిందూసంస్కర

ణోద్యమభవన నిర్మాణమునకు మతవిషయిక మార్పులే గట్టి పునాదు లైనవి.

ఆధునిక యుగమున మతములబలము సడలినది. సాంఘిక ఐక్యత జాతీయైక్యత, సర్వస్వతంత్ర భారత ప్రజాప్రభుత్వము (రిపబ్లికు) నకు ముఖ్యములయినవి. దాని అభివృద్ధి కవి ప్రాణములవంటివి. ప్రాచీన, మధ్యకాలములందు రాజులపాలన ప్రభువులపాలన సాధారణముగా ప్రజాదరణ గమనించుచునే నడిచినవి. అందుచేత హిందూసాంఘిక సంస్కర్తలు మతసాంఘిక సహన, సహకారములను సాధించుటకు కృషిచేసి ఐక్యతసాధింపదలచిరి. నేటి స్వతంత్రభారతమున. జాతికుల మతభేదములు లేని సంఘస్థాపన ప్రభుత్వ లక్ష్యమయినది. క్రమముగా గొప్ప బీద భేదములులేని సర్వస్వాతంత్ర్య సామాజిక పరిపాలన స్థాపన దాని కోరిక ఆకోరికను అది సర్వోదయోద్యమతోడనే సాధింప నగునని యెంచినది.

ప్రాచీన ఋగ్వేదకాల సంఘము మంచిపద్ధతులు కట్టిదిట్టములు కలదని తెల్పుటకు ఋగ్వేదమునందే నిదర్శనములు గలవు. అప్పుడు కులభేదములు వర్ణభేదములు లేకుండెను. పురుషులు స్త్రీలుకూడ విద్యావంతులు. కుటుంబ సాంఘిక జీవనములందు సమానములగు హక్కులను అనుభవించుచుండిరి. విదుషీమణులగు కొందఱు ఋగ్వేద స్త్రీలు, మహర్షులవలెనే దివ్యజ్ఞానము బ్రహ్మజ్ఞానము సాధించినవారు. వారు 'బ్రహ్మవాదినులు' అనబడిరి. అందులో కొందఱు వేదములోని కొన్ని 'ఋక్కులు' లేక సూత్రములనుకూడ రచించినవారు. చాల వఱకు ఋక్కులు మహర్షుల రచనలు. ఋక్కులకు సూక్తులు అను పేరుకూడ ఉండెను. మహర్షులు, బ్రహ్మవాదినులు సమానముగానే దైవసాక్షాత్కారము సత్యవ్రత మహాత్మ్యము తెలిసినవారు ప్రత్యక్షముగా దైవసాక్షాత్కారము దర్శించినవారు. ఋక్కులు, సూత్ర

ములు ఆకారణముచే శ్రుతులు, అపౌరుషేయములు అనబడినవి. అవి దైవ ప్రేరితములుకాని మానుష నిర్మాణములుకావని విజ్ఞుల యూహ.

బ్రహ్మవాదినులు 'ఋషికలు' అనికూడ పిలువబడుచుండిరి. రోమసా, లోపాముద్రా, అపాలా, కద్రూ, విశ్వావరా, ఘోషా, జుహూ, పౌలోమీ, ఊర్వశీ, ఇంద్రాణీ అనువారు బ్రహ్మవాదినులు ఋషికలలో ముఖ్యులు. బ్రహ్మవాదినులు బ్రహ్మచర్యవ్రతమును ఆచరించుచుండిరి. కొందఱు ఋగ్వేదకాల యువతులు, అత్యున్నత పారమార్థిక విద్యసాధించి బ్రహ్మచారిణులై యుండిరని ఋగ్వేద సాక్ష్యముకలదు. వారిలో కొందఱు తుదకు తమకు తగిన ఉన్నత విద్యావంతులగు భర్తలను వరించి, పురుషార్థసాధకములగు సాంసారిక జీవనములు సౌఖ్యముతో జరిపిరని ఋగ్వేద సూక్తులు వచింపుచున్నవి. అనంతర వేదములగు, యుజుర్వేదా అథర్వణములందు కూడ నిదర్శనలు పేర్కొనినవి. అనగా అనంతర వేదకాలమునకూడ అట్టి విదుషీమణులుండిరనుట సత్యము.

ఒక పర్యాయము మిథిలారాజ్యము పాలించు రాజర్షి జనకుడు తన రాజదానీనగర రాజభవనమందు అప్పటికి ప్రఖ్యాతి గడించిన మహర్షులను బ్రహ్మవాదినులను పరమార్థజ్ఞానులగు వేదాంతులను వివిధవేద సూక్తులను చర్చించి క్రోడీకరించుటకు ఒక వేదవైజ్ఞానిక సదస్సును సమావేశము కావించెను. పెక్కుమంది ఋషులు, ఋషికలు (బ్రహ్మవాదినులు), ఆ సభయందు పాల్గొనిరి. వారు వివిధవేదాంత మత సంస్థలకు చెందినవారు. అట్టి మహనీయులగు వారిలో అగ్రగణ్యులకు మహర్షుల నాయకుడు 'ఉద్దాలక అరుణి' బ్రహ్మవాదినుల సుప్రసిద్ధ నాయకురాలు 'గార్గి'.

గార్గి, ఉద్దాలిక మహర్షితో, వేదాంత వాదమునకు దిగి, క్లిష్టములగు ప్రశ్నలకు జవాబులను అతనినుండి కోరెను. ఆమహా

నీయు డా ప్రశ్నలన్నిటికిని తగు ప్రత్యుత్తరములను సునాయాసముగ ప్రసాదించెను. అంతట గార్గి ఆతని విజ్ఞాన ఉత్కృష్టతను అభినందించి ఆతనని ఆరాధించి సమావేశములయిన సదస్యులను ఆయనను గౌరవింప గోరెను జనకమహర్షియు ఉద్దాలకుని వైదుష్యను మెచ్చి అమూల్యములగు కానుకలను అతనికి అర్పించి తన్ను, తన రాజ్యమును కూడ తుదకు అతనికి దారపోసెను. మహనీయుడగు ఉద్దాలక అరుణి తన మాహాత్మ్యమును ప్రదర్శించునట్లు జనకునికి అతని రాజ్యము సంపదలనే గాక తన సొత్తునంతనుకూడ అర్పించి, ప్రజానురంజకముగా రాజ్యపాలన గావింపుమని దీవించి, తాను వానప్రస్థాశ్రమము స్వీకరించెను. అతనిభార్య, అతనివలెనే ప్రఖ్యాతి వహించిన భారత రమణి పతిసాన్నిధ్యములేని ఐశ్వర్య వైభవమును విడిచి, పతితో వానప్రస్తమున ప్రవేశించినది. ఆమెయె సుప్రసిద్ధరాలగు విదుషీమణి మైత్రేయి.

వైదిక, ఇతిహాస, సూత్రయుగములందు భారత మహిళలు విజ్ఞానవేత్తలు, కుటుంబజీవనమున గృహములందును, వెలుపల సంఘ సంస్థలందు సాంఘిక జీవనమునను, పురుషులతో సమానముగ మత, సాంఘిక హక్కులను అనుభవించుచు సౌఖ్యజీవితములు సాగించుచుండిరి. స్త్రీల విద్యావిషయమున నేర్చుకొనదగిన అంశములందు ఒక విధమగు విభజనపద్ధతి అమలులో నుండెను. పురుషోచితములు స్త్రీలకు ఉచితములు అను రెండు భేదములు అందు గలవు. అవి వారివారి ప్రత్యేక నిర్దిష్టవిద్యలు, స్త్రీ పురుష స్వభావసిద్ధములకు అనుకూలములుగా, వారివారి ప్రత్యేక అభిలాషలను సాధించునవిగా నిర్ణయింపబడినవి. స్త్రీలకు గృహ కార్యనిర్వాహణ శాస్త్రము, (డొమెస్టిక్ సైన్సు) సౌఖ్యకరమగు సాంసారిక జీవనమార్గము. దానికి తరువాత మహిళలకు మతజ్ఞానము, దివ్యజ్ఞానము, నీతిశాస్త్రము,

ధర్మశాస్త్రములుకూడ పఠనీయములయ్యెను. లలితకళలగు సంగీతము (గాంధర్వము) నృత్యము, చిత్రలేఖనము, చెక్కడపు పనులు, మొదలగునవి స్త్రీలకు ప్రత్యేకముగా విధింపబడినవి.

వైదిక ఇతిహాసయుగముల స్త్రీలలో రెండు తెగలవారుండిరి. వారే 'బ్రహ్మవాదినులు' 'సద్యోవధువులు' అనువారు. ఉపనయన మంత్రి విధానముతోకూడిన బ్రహ్మచర్య వ్రతాచరణ వారిద్దరికిని నిర్ణయింపబడినదే కాని బ్రహ్మవాదినులు సాధారణముగా శాశ్వత బ్రహ్మచర్యము నవలంభింపగా, సద్యోవధువులు, పూర్తిగా విద్యాభ్యాసము గావించి, యుక్తవయస్కలై, సమాన వైదుష్యముతో కీర్తిపొందిన భర్తలనువరించి వివాహమాడి సౌఖ్యమునిచ్చుసాంసారిక జీవనములు కోరుచుండిరి. కుటుంబజీవన విధానములు శాసించు శ్రౌత సూత్రములు, గృహ్యాసూత్రములు, శృతి (వేద) స్మృతి (ధర్మశాస్త్ర) ములపై ఆధారపడి, ఆ కాలపు విదుషీమణులగు స్త్రీలు, కన్యకలై, వేదమంత్రములను గార్హస్థ్య జీవనమునకు చెందిన వైదికశుభ కార్యములందు దివ్యముగా పఠించువారలై యుండిరని తెల్పుచున్నవి.

వివాహమున ఏకపత్ని వివాహధర్మము సర్వసాధారణముగా హిందూకుటుంబములందు సాంఘిక లక్షణముగా నుండెను. ప్రాచీన సుప్రసిద్ధసంస్కృత వ్యాకరణకర్తలగు పాణిని, కాత్యాయనులు వారి కాలమునాటి స్త్రీలు వైదికవిజ్ఞానమును నేర్చిరని వ్రాయుచున్నారు. అట్టివిదుషీమణులలో కొందఱు ఉపాధ్యాయినులు, అధ్యాపకులు ఉండిరని తెలియుచున్నది. పతంజలి తన ''మహాభాష్యము''అను సుప్రసిద్ధ గ్రంథమున ''బల్లెములు'' ధరించిన ''శక్తు''లు అనువీరవనితలుకూడ ఉండిరని తెలియచేయుచున్నాడు. కౌటిల్యుడు తన అర్థశాస్త్రమందు, కాలినడక గల సైనిక బృందములలో స్త్రీలు కలరనియు అశ్వికులగు కొందఱు వీరవనితలు జాతీయపతాకధారిణులుగా కూడ ఉండిరనియు

తెల్పినాడు. అట్టి వీరవనితలు ఉత్తర భారత దేశమునను మౌర్యచంద్ర గుప్తుని అంగరక్షకులుగాను, దక్షిణభారతమున చోళసామ్రాట్టుల ఆస్థానములందు రాజసేవికలుగా ఉండిరనియు తెలియుచున్నది.

క్రీ॥ పూ॥ 300 నుండి క్రీ॥ శ॥ 300 వఱకుగల బౌద్ధయుగమున ఉన్నత కులములందు పురుషులు, స్త్రీలుకూడ సమానముగ విద్య నభ్యసించిరని తెలియుచున్నది. విజ్ఞానవంతులు, విజ్ఞానవతులు అగు ఉన్నత కులములవారు మతజ్ఞానము కలిగి భిక్షుకులుగాను భిక్షుణులు గాను పనిచేయుచు కఠిన నియమములతో బ్రహ్మచర్యవ్రతము నాచరించుచు బౌద్ధమత బోధలు చేయుచుండిరి. అహింస, దీనజన రక్షణ విధానములను ప్రజలలో వ్యాప్తి గావించిరి. వారు భిక్షుక, భిక్షుణ సంఘములుగా ఏర్పడి, బౌద్ధమత ధర్మములను భారత దేశమున పలుతావులందేగాక సింహళము, బర్మా, మలయా, ఇండోచీనా, చీనా, జపాను దేశములకు పశ్చిమమున ఈజిప్టు దేశమునకుకూడ వెడలి బౌద్ధమతబోధ గావించిరి. భిక్షుకులు, భిక్షుణులు కూడ ఉన్నత కులములకు చెంది, ఉన్నత గుణములు ఆదర్శములు కలిగి పవిత్ర జీవితములు సాగించుచు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిరి. ఈ సందర్భమున అశోకుని సోదర సోదరీలు మహేంద్ర రాకుమారుని, సంఘమిత్ర రాజకుమార్తెను పేర్కొనవచ్చును.

క్రీ॥శ॥ 300-1000 నడుమ కాలము పౌరాణిక హిందూయుగము. ఆ కాలమున ఉత్తర భారతమున గుప్తచక్రవర్తుల కాలమున తరువాత దేశమంతట రాజపుత్రరాజుల కాలమున హిందూమత, సాంఘిక, సంస్కృతులు స్వర్ణయుగ సంపద, సత్కీర్తులను, సంపాదించినవి. శైవవైష్ణవ మతభక్తులు ఉన్నతస్థానము లందినవి. అవి శంకర రామానుజులను శైవ, వైష్ణవ మతగురువులచే ప్రతిపాదితము లయినవి. అవి వేర్వేరు భక్తిమార్గములందు పరమేశ్వరారాధన

భక్తులగు వారికి బోధించినవి. జ్ఞానయోగముపై ఆధారపడిన అద్వైతమతమును శ్రీఆదిశంకరుడును విష్ణుభక్తిపై ఆధార పడిన విశిష్టాద్వైతమతమును శ్రీరామానుజుడును బోధించిరి. హిందూకుటుంబము కులాచారములను అనుసరించి వైదికమగు కర్మ మార్గమును అనుసరించెను. ఈరీతిగా పౌరాణిక హిందూ మతము జ్ఞాన, భక్తి, కర్మయోగముల ద్వారా భక్తిమార్గము ప్రధానముగా మధ్యయుగమున నడిచినది. పౌరాణిక యుగమున సాధారణ అజ్ఞానప్రజల కోరికల ననుసరించి ప్రత్యక్ష సగుణోపాసన మార్గముగల దేవతా విగ్రహారాధన బ్రాహ్మణులచే కల్పింప బడినది. సంఘమున జ్ఞానులగు హిందువులు మాత్రము విగ్రహారాధన భక్తి ప్రబోధమగు కార్యముకాని ఆరాధన మార్గముగానే దానిని నమ్మిరి.

క్రీ॥ 1000 - 1500 సంవత్సరముల నడుమగల కాలమున మహమ్మదీయ దండయాత్రలు, వారి అధికార రాజ్యస్థాపనలు జరిగి నవి. రాజకీయ సంఘర్షణలతో హిందూమత, సాంఘిక పరిస్థితులు ఎక్కువగా సంచలించినవి. అరాజక పరిస్థితులలో చిక్కుకొనినవి. అందుచే స్వమతరక్షణకు, స్వీయసాంఘిక, సాంస్కృతిక సంరక్షణకు సమకట్టి, హిందూమతాచార్యులు, ధర్మశాస్త్రవేత్తలు, మతసాం ఘిక, నియమములు, కట్టుబాట్లు మరింతబిగించి, అవి మహమ్మదీయుల బారిపడి చెడకుండ చేసిరి. ఉత్తర ఇండియాలో ఈకట్టుబాట్లు నియమ ములు మరింత ఎక్కువగా నుండెను. ఎందుచేతననగా, అచ్చటనే ముస్లిమ్ దండయాత్రల ఫలితములు ముస్లిమ్ రాజకీయాధికార స్థాపన చాలకాలముండెను.

కాని దక్షిణ ఇండియా సాంఘిక మతపరిస్థితులు కొంచెము వేరుగానుండెను. అచ్చట హిందూసంఘము ఇస్లామ్ మతతాకిడిని

దాని ఫలితములగు మత, సాంఘిక, రాజకీయసంక్షోభములు ఎక్కువగా లేకుండెను. ఉత్తర హిందూస్థానము, హైందవ, బౌద్ధ, మతాలయ విద్యాసంస్థలు దెబ్బతిని నశించినవి కాని దక్షిణ భారతదేశమున హిందూ విద్యాలయ విద్యలు సంస్కృతి నిలిచి అభివృద్ధిగాంచినవి. సంస్కృతభాషలో కవులు రాష్ట్రీయములగు ప్రజల వాడు భాషలందు కవులు ఉండిరి.

కంపదేవుని భార్య గంగాదేవి మధుర విజయమను ఇతిహాసము రచించెను. తిరుమలదేవి వరదాంబికా పరిణయము వ్రాసెను, కామందికా విలాసరచయిత వజ్రియొక విదుషీమణియగు కవయిత్రి. తెలంగాణమున కాకతీయచక్రవర్తులు సంస్కృత సారస్వతపోషకులు. కొండవీడు, రాజమహేంద్రవరములు రాజధానులుగా రెడ్డిరాజ్యముల పాలించినవారు ఆంధ్రసారస్వతమును అభివృద్ధిచేసిరి. దానినే కాకసంస్కృతవాఙ్మయ సారస్వతములకూడ అభిమానించిరి. వారిలో కొందఱు రచయితలు పిమ్మట తమిళ సారస్వతమును చోళరాజులు, ఆంధ్రసారస్వతమును కర్ణాటాంధ్ర చక్రవర్తులగు విజయనగర ప్రభువులు, అభిమానించిరి. ఆంధ్రసారస్వతమున ఈ రాయలయుగము స్వర్ణయుగము. విజయనగర చక్రవర్తులు కన్నడ సాహిత్యమును కూడ అభివృద్ధిచేసిరి.

ఇస్లామ్ తాకుడువలన ఉత్తర ఇండియాలోని మతము సారస్వతములు ఎక్కువ నష్టముపొందినవి. అందుచే అచ్చట అవి మఱియు ఎక్కువగా స్థంభించినవి. మధ్యమయుగమున ఇండియాలో, యుద్ధప్రావీణ్యముగల వీరులు వీరవనితలు కూడ ప్రాముఖ్యమువహించిరి. వారిలో కొందఱు రాజ్యములనుకూడ పాలించిరి. వారు అప్పటి కల్లోలములలో ఎన్ని బాధలు సంభవించినను ధైర్యముతో వానిని ఎదుర్కొనిరి. అట్టి వీరనారీ మణులలో దక్షిణ ఇండియాలో కాకతీయ

తెలుగు సామ్రాజ్యము పాలించిన రుద్రాంబ చక్రవర్తినిని, ఉత్తర మున ఢిల్లీ రాజ్యమును ఏలిన రజియాబేగమును పేర్కొనవచ్చును. రాజపుత్రస్థానములో రాణీసంయుక్త, పద్మిని, మధ్య ఇండియాలో రాజ్యముచేసిన రాణీ దుర్గావతికూడ సుప్రసిద్ధులు.

ఉత్తర హిందూస్థానమున ఉన్నత కులముల స్త్రీలు ఘోషా పద్ధతి అనబడు రాణివాసపద్ధతిని అవలంభించిరి. ఈపద్ధతిలో హిందూ స్త్రీలు మహమ్మదీయ స్త్రీలను అనుకరించిరి. దక్షిణ ఇండియాలో మహమ్మదీయ పాలకుల స్త్రీలు తప్ప హిందూ స్త్రీలు ఎవ్వరును ఈపద్ధతిని అవలంభింపలేదు. మహమ్మదీయులలో అందును ముఖ్య ముగా పాలకవర్గముల వారిలో తరచుగా అవలంభింపబడిన బహు భార్యా వివాహపద్ధతిని కొందఱు హిందువులు అవలంభించిరి. హిందూ శాస్త్రములందును ఇట్టి పద్ధతి అనుమతింపబడుటయే యొక ముఖ్య కారణము. బెంగాలు రాష్ట్రమున కులీనబ్రాహ్మణులందు ఈబహు భార్యపద్ధతి సర్వసాధారణమైనది. పద్ధతులుగాక భారతదేశమున ఉత్తర దక్షిణభాగములందు ముఖ్యముగా అగ్రకులముల వారిలో సతీత్వము లేక సహగమనము అను భయంకర సాంఘిక దురాచారము మధ్యమయుగములో హిందూసంఘమున ప్రబలినది. ప్రాచీనవైదిక, ఐతిహాసిక యుగములలో ఈపద్ధతి నిర్బంధముగాకుండెను. భర్తలు చనిపోగా వారిభార్యలు భర్తలశవముతోబాటు బలవంతముగా కాల్చి వేయబడుటఅను ఈదురాచారము సంఘమునకు కళంకము దెచ్చినది.

మధ్యయుగ సాంఘిక దురాచారములలో బాల్యవివాహ ములు, ముఖ్యముగా బ్రాహ్మణ, వైశ్య కుటుంబములలో ప్రబలెను. ఒక్క కాశ్మీరములో దక్షిణమున కేరళరాష్ట్రమునందును తప్ప తక్కిన భారతదేశ భాగము లన్నిటియందును రజస్వలాపూర్వ వివాహ ములే ఆచారములయ్యెను. మరియు తల్లి తండ్రుల ఆస్తులందు ఆడ

పిల్లలకుగల హక్కులు లేకుండుట యొకదురాచారమయ్యెను స్త్రీలకు ప్రత్యేకముగా నియమితమగు ఆస్తి స్త్రీధన మనబడును. అట్టి స్త్రీధన పద్ధతులు ఈ మధ్యయుగమున అధ్వానముగా నుండెను. ప్రాచీన భారతదేశమున స్త్రీలకు వారసత్వపు హక్కు కొంతగలదు. కాని మధ్యయుగమునందు అట్టి హక్కు పూర్తిగా లేకుండెను. ఆకాలపు శాస్త్రకారులు స్త్రీలకు స్వాతంత్ర్యము ఎప్పుడు ఉండరాదని "నస్త్రీ స్వాతంత్ర్యమర్హసి" అను శాసనముచేసిరి. విద్యకూడ స్త్రీలకు లేకుండుట స్త్రీల దుస్థితిని ఎక్కువచేసినది. ఇన్ని బాధలు స్త్రీలకున్నను మధ్యయుగమునకూడ "సమిష్టి కుటుంబ విధానము" అమలులో నుండుటచే స్త్రీలు కేవలము అనాథలై, బాధలుపడుటలేదు. సమిష్టి కుటుంబ పద్ధతివారి బాధలు చాలవఱకు మాన్పెను.

ఉత్తర ఇండియాలో ఎక్కువ మహమ్మదీయ మతసంఘర్షణ ఫలితముగా పురుషుల.స్త్రీలగతి క్షీణించినది. క్రీ॥శ॥1800 తరువాతనే అది బాగుపడుటకు కొంత అవకాశము లభించెను. అట్లు లభించుటకు పంతొమ్మిదవ శతాబ్దమున దేశమున ప్రాముఖ్యముపొందిన ఆంగ్ల విద్యాభివృద్ధి, పాశ్చాత్యదేశముల సంస్కృతి కారణములయినవి. క్రీ॥ శ॥ 1500 - 1800 నడుమ ఉదారస్వభావులగు అక్బరు, గురు నానక్ వంటి మహనీయులు, దక్షిణ ఇండియాలో కృష్ణ దేవరాయలు, ఛత్రపతి శివాజి అనువారు సామాన్య ప్రజల సాంఘికబాధలు తొలగించి హిందూ, ఇస్లామ్ మతములకు చెందిన అందరియొక్క సాంఘిక క్షేమ సాధనకు కృషిచేసిరి. హిందూ - ముస్లిమ్, సామరస్య సహకారములు సంపాదింప యత్నించిరి. సహనభావమే మతావేశములను తగ్గించి ఈరెండు మతముల సఖ్యత సాధింపగలదని నమ్మిరి.

క్రీ॥ శ॥ 175 తరువాత ఆధునిక భారత దేశమున, మత, సాంఘిక ప్రతిష్టంభన తొలగించుటకు నూతన భావోదయము

తోడ్పడినది. క్రొత్త సంఘ సంస్కర్తలగు రాజారాం మోహన రాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగరుడును, క్రొత్త మత మార్గములు నిర్మించిన స్వామివివేకానంద, స్వామిదయానంద సరస్వతి దివ్యజ్ఞాన మత ప్రోక్తలు తోడ్పడిరి. పాశ్చాత్య విద్య, ముఖ్యముగా ఇంగ్లీషు విద్య పాశ్చాత్య సంస్కృతిప్రభావముల వలన భారత రాజకీయ నాయకులయందు స్వాతంత్ర్య ప్రభుత్వ సంస్థాపన కోరిక రేకెత్తి ప్రబలినది అట్టి నాయకులలో మహాత్మాగాంధి జవహర్లాల్ నెహ్రూ మొదలగువారు విజ్ఞాన వేత్తలలో మదన మోహనమాలవ్యా, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలగువారు ముఖ్యులు. వీరు దేశమున సాంఘిక, ఆధ్యాత్మిక జ్ఞానమును యువకులలోను యువతులలోను రగుల్కొల్పి సహకార పద్ధతితో భారతదేశ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక నూతన భావోద యము కల్పించి, వారు దేశము మరల తన ప్రాచీన వైభవము కంటె ఎక్కువగువైభవముతో నవీననాగరిక లక్షణముల నవలంబించి ప్రకాశింపచేయ పాటుపడుచున్నారు.

# 7. కొందరుముఖ్యులగు సాంఘిక సంస్కర్తల జీవితాంశములు వారి బోధనల వలన కలిగిన సాంఘిక ఫలితములు

భారతదేశమున ఆదిని నాగరికత గల ద్రావిడసంఘ కుటుంబ మునకు తల్లి యజమానురాలు. తల్లినిపట్టి వారసత్వహక్కు నిర్ణ యింపబడెను. తరువాతగల ఆర్యుల సంఘములో ఆర్యకుటుంబమునకు పెద్ద. తండ్రినిపట్టి వారసత్వహక్కు నిర్ణీత మయ్యెను. అందుచే

ఆ రెండు కుటుంబముల విధానముల నడుమ సంఘర్షణలకు అవకాశము లుండెను. ఈ ద్రావిడ, ఆర్యజాతుల సంఘముల కలయిక పూర్తిగా జరిగి మొత్తముపై హిందూభారతజాతి యేర్పడుటకు సుమారు వేయి సంవత్సరముల కాలము పట్టినది. వేదములు, వానినిపట్టి రచించిన బ్రాహ్మణములు, ఉపనిషత్తులు వేదవాఙ్మయ మయ్యెను. అవి ఋషులచే పరమేశ్వరునివలనపొందబడినవి కావున అపౌరుషేయములు. వానిని ఋషులు దేవుని ప్రసాదమున రచింపగలిగిరి. బైబిలు, కొరాను మత గ్రంథములు సాక్షాత్ క్రీస్తు, మహమ్మదు ప్రవక్తలచే మూనవులు పొందినవి (రెవలేషన్సు) వేదములు, బైబిలు, కొరాను ముఖ్య మత గ్రంథములు. వైదిక గ్రంథములు హిందూజీవితము పుట్టుకనుండి మృతివఱకు ఎట్లుండవలెనో నిర్ణయించినవి.

హిందూమత విజ్ఞానము, వైదికకర్మ, వైదికధర్మము కేంద్రములుగా గలది. భారతజాతీయ చిహ్నమగు అశోక చక్రము జీవిత చక్రలక్షణమునకు సూచ్యము. హిందూసంఘమున కుటుంబము ప్రధానమైనది. దానివెనుక దానికి చెందిన వ్యక్తి లెక్కలోనికి వచ్చును. హిందూ మత, హిందూ ధర్మశాస్త్రముల రెండింటికికూడ కుటుంబమే ప్రధానము. ప్రాచీనకాలమునుండి కొలది కాలముక్రిందటి వఱకు భారత దేశమున సమిష్టి కుటుంబ సంస్థయే ప్రధానమైయుండెను. కఠినములగు కట్టుబాట్లమీద ఏర్పడిన సంఘములో కుటుంబములోని వ్యక్తులు, ఆ సమిష్టి కుటుంబముయొక్క అభివృద్ధి బాగోగులకొఱకు తమయొక్క ప్రత్యేక వ్యక్తిగత హక్కులుకూడ ధారపోయవలసి యున్నది. ఈ కారణములచేతనే సమిష్టి కుటుంబమున స్త్రీలు శాంత స్వభావులై సహనభావము కలిగియుండుట తటస్థించినది.

ప్రాచీన మధ్యయుగములందు హిందూసంఘ సమిష్టి కుటుంబములు స్వయంపోషకములై యుండెను. అందుచే అవి దేశమున సంభ

వించిన రాజకీయ కల్లోలములకు లోనై చెడిపోలేదు. ఈ సమిష్టి కుటుంబముల స్వయంపోషక స్వయంసహాయ శక్తులు జాతీయఐక్యతకు హిందూ సంఘబలమునకు చాలవఱకు తోడ్పడినవి. భారతప్రజలలో పెక్కుమంది హిందువులు. వారి సమిష్టికుటుంబ విధానములు, అల్పసంఖ్యాకులగు ఇతర భారత దేశవాసులగు ఇతర తెగలవారికి కొంత అలవడినవి. అట్టి అల్పసంఖ్యాకులలో సంఖ్యాధిక్యమునుబట్టి మహమ్మదీయులను వారివెనుక క్రమముగా క్రైస్తవులు, పార్సీలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, యూదులను పేర్కొనవచ్చును. హిందూ సంఘము, కులభేదవ్యవస్థ, సమిష్టి కుటుంబవిధానము అను బలమగు పునాదులపై నిర్మితమైన భవనమువంటిది తక్కిన జాతులవారి సాంఘిక వ్యవస్థలతో సంబంధములేక తన ప్రత్యేక లక్షణములను నిలుపుకొనగలిగినది. భారత దేశములో అల్ప సంఖ్యాకులగు ఇతర జాతి మతములవారు వారివారి సంబంధీకుల బలముమీదనే ఆధారపడినవి. ఈ కారణములచే భారతదేశము ప్రత్యేక జాతి, సంఘ, మత వ్యవస్థలు కలిగి, అన్యోన్య సహకార సామరస్యములతో ఏక భారత జాతిగా మారినది.

భారతీయులలో హిందువులే మిక్కిలి యెక్కువమంది కావున భారత సంఘము హిందూ మతముయొక్క కట్టుబాట్లమీదనే ఆధారపడి నిలిచినది. 1951 జనాభా లెక్కల ప్రకారము భారత దేశమున ముప్పదికోట్లు హిందువులు, మూడుకోట్ల నాలుగు లక్షలు మహమ్మదీయులు, ఎనుబది లక్షలకుపైగా పార్సీలు, అరువది లక్షలకు పైగా క్రైస్తవులు, సుమారు రెండుకోట్లు తదితరులు కలరు. 1961 జనాభా లెక్కల ప్రకారము నూటికి పదిపాళ్ళు ఈ సంఖ్యలు ఎక్కువైయుండును. హిందువులు మిక్కిలి యెక్కువమంది కావున దేశీయ, అంతర్జాతీయ విషయములందు హిందూ ప్రాబల్యమే యెక్కువ

ముఖ్యమయినది. తక్కిన మతములవలెగాక హిందూమతమునకు ప్రత్యేక ప్రబోధసంఘములవారు (మిషనరులుగాని) ప్రత్యేకమతలక్షణ బోధగాని లేదు. హిందువులు హైందవేతరుల మతసాంఘిక సంస్కృతు లందు జోక్యము కల్పించుకొనువారు కారు. అందుచే భారతదేశమున జాతి మత వివక్షత లేని సార్వజనిక సాంఘిక ప్రజాప్రభుత్వ స్థాపన (సెక్యులర్ రిపబ్లిక్ స్థాపన)కు అవకాశము కలదు.

హిందూదేశమున పెక్కుజాతుల, మతముల, సంస్కృతుల వారి జీవితవిధానముల సామరస్య, సహకార, సహజీవనము కొన్ని శతాబ్దముల అభివృద్ధి ప్రధానముగా గలది. అది క్రొత్త సంస్కృతిని, విజ్ఞాన పవిత్రకళలందు కల్పించినది. క్రీ॥ శ॥ 1000తో ప్రారంభ మయిన రాజకీయ కల్లోలములు ఇస్లామ్ మత విజృంభణ, క్రీ॥ శ॥ పదిహేనవ శతాబ్దాంతమునకు అంతరించినది. మొగల్ చక్రవర్తుల కాలమున శాంతిభద్రతలు నెలకొనినవి. దక్షిణ భారతమున మధ్యయుగమున శ్రీకృష్ణదేవరాయలు ఆధునిక యుగమున శివాజి ఛత్రపతి హిందూ మత సంస్కృతులకు నూతన వికాసము బలము కల్పించి హిందూ నాగరకత పోషించిరి. అందుచే క్రీ॥ శ॥ 1000 - 1500 సంవత్సరముల నడుమ సంభవించిన సాంఘిక ప్రతిష్టంభన సడలి నూతన చైతన్యము పొందుటకు అవకాశము కలిగెను. భూమిశిస్తు నిర్ణయ విధానములందు, న్యాయ విచారణ పరిపాలనా విధానములందు సాంఘిక ఆర్థిక సాంస్కృతిక విషయములందు వలె మార్పులు జరిగి హిందూ సాంఘిక సంస్కరణలుగా పరిగణింప బడినవి.

క్రీ॥ శ॥ 1850 నుండి బ్రిటిష్ పరిపాలనా ఫలితముల ఒత్తిడి, హిందువుల జీవిత విధానములందు కనబడినది. పారిశ్రామికాభివృద్ధి శాస్త్రీయ పరిశోధనా జ్ఞానము చాకచక్యములతో పాశ్చాత్య జీవన

విధాన వ్యవస్థ పొడచూపినది. ఇది కూడ క్రమముగా క్రొత్త భారత విధానముగా పరిణమించినది. దానితో రాజకీయ, ఆర్థిక, సాంఘిక సంస్కృతులందు హిందూ సంఘమున కొన్ని మార్పులు కలిగినవి. ప్రాచీన కాలమునుండి నేటివరకు మారుచున్న కాలమాన పరిస్థితులనుబట్టి సాంఘిక వ్యవస్థ మారినది. మార్పుచెందిన సాంఘికాంశములలో మతము ప్రధానము దాని మీదనే సాంఘికాచారములు ధర్మములు నిలిచినవి. హిందూ సంఘములను కాలపరిస్థితుల ననుసరించినది మత విధానము. ఇదియొక మత - సాంఘికోద్యమము ఆధునిక సాంఘిక సంస్కర్తలు నూతన మత ప్రచారకులుగాకూడ పనిచేసిరి.

హిందూ జీవితము పూర్తిగా వైదిక కర్మలమీద ఆధారపడినది. హిందూ సంఘమున వ్యక్తి కేవలము సౌఖ్యములను అనుభవించుటకే జన్మించుటలేదు. జీవితమున అతడు విధిగా నిర్వర్తింపవలసిన కర్మలు నియమితములైనవి. అవియే ఆ వ్యక్తికి ఐహిక పరిమార్థిక సాధకములు. హిందువులయొక్క జీవితము పుట్టుకనుండి మృతివఱకు ఏ రీతిగా నడవ వలయునో మత విషయికముగా వైదిక కర్మలు నిర్ణయించినవి. వాని ప్రకారముగా ప్రతి హిందువు జీవితము నడిచి తీరవలసినదే. వానిని ఉల్లంఘించి నడువరాదు. హిందూ మానవ జీవితమున కొన్ని ప్రధాన ఘట్టములు గలవు. వానిని నిర్వర్తించుటకు ప్రత్యేక వైదిక విధు లేర్పడినవి. వానిలో తొలిది వివాహము, తరువాత గర్భాధానము నియమితములు. ఈ ప్రథమ సంస్కారము తరువాత, గర్భధారణ కాలమున మూడవ నెలలో పుత్రోత్పత్తికొఱకు నడిపింపవలసినది 'పుంసవనము' పుత్రుడే హిందువుని పున్నామ నరకమునుండి తప్పింప గలవాడు. తరువాత జరుగ వలసిన మూడవ సంస్కారము జాతకకర్మ. అటుపైని పిల్లవాని

పదకొండు రోజుల వయసున్న నామకర్ణ సంస్కారము జరుగవలెను. తరువాత సంవత్సరములోగా అన్నప్రాశన మహోత్సవము జరుగవలెను. తరువాత జరుగవలసిన పుట్టిన పిల్లయొక్క చేలము అనగా చెవులు కుట్టించుట. కుర్రవానికి ఏడు సంవత్సరముల వయసున్న ఉపనయనము జరుగవలెను. ఉపనయన మనగా జ్ఞాన నేత్రమును తెరచుటఅనగా అప్పుడు పిల్లవానికితండ్రి గురువు బ్రహ్మ మంత్రమును ఉపదేశింతురు. అప్పటినుండి బ్రహ్మచర్యాశ్రమము ప్రారంభమగును. తరువాత బ్రహ్మచర్యాశ్రమము తరువాత ఇరువదియైదు సంవత్సరముల ప్రాయమున జరుగవలసినదివివాహము. ఈ వైదిక కర్మలు వాని విధానములు స్మృతులయందు వివరింపబడినవి. ఈ స్మృతులు వేదముల ననుసరించి వ్రాయబడినవి; శాస్త్ర సమ్మతమును పొందినవి.

ప్రాచీన సుప్రసిద్ధ స్మృతి రచయితలలో మనువుప్రధానుడు అనంతమగు కాలచక్రమున ప్రస్తుత కాలము కలియుగము. ఈ యుగము సుమారు ఐదువేల సంవత్సరములకు పూర్వము ఆరంభమయ్యెనని హిందూ శాస్త్రజ్ఞుల అభిప్రాయము. ద్వాపర యుగాంతము కలియుగ ప్రారంభముల నడుమ జరిగినది కురుక్షేత్రయుద్ధము. అది హిందూ ఇతిహాసమగు మహా భారతమున వర్ణింపబడినది. ద్వాపర యుగమునకు పూర్వము త్రేతాయుగము, దానికిముందు కృతయుగము జరిగిపోయినది. ప్రస్తుత కాలము, కలియుగమున ప్రథమ పాదము. ఇట్టివిమరి మూడు పాదములు భవిష్యమున గలవు. ఇట్టి యుగముల ఎడతెగని పారంపర్యమే అనంతమగు కాలచక్రపరిధి, ఇట్టి కాలచక్ర అధిపతి మనువు.

ప్రస్తుతకాలపు మనువు వైవస్వతుడు, మనువులలో నాల్గవవాడు. ఆదిని మనవు మనుధర్మశాస్త్రము అను ప్రమాణగ్రంథమును

హైందవుల జీవిత విధానమును మతప్రోక్తముగా నిర్ణయించెను. ''మానవ ధర్మశాస్త్రము'' అను మఱియొక పేరుగల ''మనుస్మృతి'' తొలుత లక్ష సూత్రముల పరిమితి కలది. అవి తరువాత వేయి శీర్షికలుగా కుదింపబడినవి. నారదమహర్షి మానవుల ఉపయోగము నకై వానిని యింకను కుదించి పన్నెండువేల సూత్రముల గ్రంథ ముగా తయారుచేసెను. తరువాత సుమతి యను పండితుడు ఆ గ్రంథ మును మరింత క్లుప్తపరచి, ప్రస్తుత మనుస్మృతియగు రెండువేల ఆరువందల సూక్తముల గ్రంథముగా తయారుచేసెను. ఈ మనుధర్మ శాస్త్రముపై మహర్షులు కొందఱు వ్యాఖ్యానములు వ్రాసిరి. అట్టి వ్యాఖ్యానములలో కుల్లూకభట్టు రచించిన మనుస్మృతి వ్యాఖ్యానము సుప్రసిద్ధము, శ్రేష్ఠము.

మనుస్మృతి హిందువుని దైనందినచర్యకు సంబంధించిన నియ మములను పూర్తిగా వివరించినది. అందలిగల పన్నెండు అధ్యాయ ములు క్రమముగా 1. విశ్వసృష్టి, 2. విద్య 3. వివాహము, 4. ఆర్థిక సూత్రములు, 5. ఆహారము-ప్రాయశ్చిత్తము, 6. స్త్రీలు 7. నాలుగు వర్ణములవారి భక్తి విధానములు, 8. క్షత్రములు సివిలు క్రిమినల్ న్యాయపద్ధతులు, 9. వైశ్య, శూద్రవర్ణములు, 10. కష్టకాలవిధులు 11. ప్రాయశ్చిత్త విధానములు, 12. మోక్షసాధనము అను విషయ ములను విశదీకరించును.

మనువు తన ధర్మశాస్త్రమున నాలుగు ప్రధానకులముల గూర్చియేగాక, వాని శాఖలు శాఖోపశాఖలు వాని నియమముల గూర్చి కూడా తెలియజేసినాడు. బ్రాహ్మణ స్త్రీలయందు శూద్ర పురుషులకు కలిగిన సంతానములు ఛండాలురనబడిరి. వారికులము నీచకులము, అంటరానికులము అని పరిగణింపబడెను. వీరిప్పుడు హరి

జనులు అనబడుచున్నారు. ప్రాచీనయుగమున మధ్యయుగమున వీరు గ్రామములందు గాని పట్నములలోగాని వసింప వీలులేదని శాసింపబడెను. వారుసంఘబాహ్యులై గ్రామములు, పట్టణముల వెలుప ప్రత్యేకముగా వారికొఱకు నిర్ణయింపబడిన భాగములందు నివసించు నిర్బంధముండెను. ఋగ్వేదకాల ఆర్యసంఘమున ఈవర్ణములు, వర్ణవిభజన, జాతిమతములబట్టి యేర్పాటుకాలేదు. ఈసంఘములు, వాని శాఖోపశాఖలు అనంతర వేదయుగ, ఇతిహాసక పౌరాణయుగములందుఏర్పడి పౌరాణికయుగమున బలపడి కఠినపద్ధతులను అనుసరించినవి.

ఈ కారణములచే మనువు తన ధర్మశాస్త్రమున, ఈహిందూసంఘ పవిత్రత నిలుపుటకు అది భ్రష్టము కాకుండుటకు, అంతర్వర్ణ వివాహములు, అంతశ్శాఖా వివాహములు చాలవఱకు నిషేధించెను, ఏయేవర్ణములందు ఏయే శాఖలు ఉపశాఖలవారు మత,సాంఘిక, ఆర్థిక న్యాయవిషయములందు ఎట్టి విధానముల నవలంభించుచు పూర్తిగా ఎట్లు మెలగవలెనో వివరింపబడెను. కొలదికాలము క్రిందటివఱకు హిందూ ధర్మశాస్త్రము పూర్తిగా మనుస్మృతిపై ఆధారపడినడచినది.

క్రీ। పూ॥ 300 నుండి క్రీ। శ॥ 300 వఱకు, బౌద్ధమతము. హిందూమతమును బంధించి కులభేదములను సంకెళ్లను తెగగొట్టి, బ్రాహ్మణ మతాధిక్యత గల హిందూమతమున వర్ణాశ్రమపద్ధతి తొలగించి, కర్మకాండలు తీసివైచి అందఱకు అవలంభించుటకు అనుకూలములగు, సత్యము, అహింస, పెద్దలయెడ భక్తి, ధర్మమార్గానుసరణ అను ప్రధాన సూత్రములను బోధించి వానివలన ముక్తిలేక నిర్వాణములభించుననని ప్రబోధముగావించిరి. కాని క్రీ।శ॥ 300 తరువాత బ్రాహ్మణులచే పునరుద్ధరింపబడిన నూతన హిందూమతము పురాణ హిందూ మతముగా మారి, హిందూ బౌద్ధమతముల రెండింటికి సత్యము, అహింస, పెద్దలయెడ భక్తి, ధర్మమార్గములు

సమానములే అను బోధలవలన, బౌద్ధవులు కొందఱు తిరిగి హిందూమతమును అవలంభించిరి.

ఈ నూతన హిందూమతమును శ్రీశంకరాచార్యులు, శ్రీరామానుజాచార్యులు, శ్రీమధ్వాచార్యులు బోధించిరి. వారు క్రమముగా క్రీ॥ శ॥ తొమ్మిది, పదకొండు, పదమూడవ శతాబ్దములందు జీవించి తమ మతవిధానములు బోధించి, హిందూసనాతన ధర్మమును పునరుద్ధరించిరి.

కాని 1000—1500 సంవత్సరముల నడుమ క్రొత్తగా దేశమున ప్రవేశించిన ఇస్లాము మతమునకు చిరకాలమునుండి బలపడిన హిందూమతమునకు సంఘర్షణలు ప్రారంభములయినవి. వీనికి తోడు హిందూమతమునందే భక్తిమార్గముల ననుసరించి లేచిన వీరశైవ, వీరవైష్ణవ మతశాఖల నడుమ సంఘర్షణలు సంప్రాప్తించినవి. ఈకాలమున హిందూ ఇస్లామ్‌మత కలహములు, అన్యోన్యవ్యతిరిక్త మత ప్రబోధనలు గావించుచు హిందూ సంఘమును మరింత కలతపెట్టినవి. తరువాత తొలిప్రధాన సంఘసంస్కర్తలు, మతసంస్కర్తలు నగు ఈత్రిమతాచార్యుల జీవితముల ముఖ్యాంశములు, వారు కావించిన ప్రచారములు వాని ఫలితములు, హిందూమత సాంఘిక పరిస్థితులపై వాని ప్రభావము గుర్తింపవలసియున్నది.

---

# 8. మధ్యయుగము, ఆధునిక యుగ తొలి భాగము


క్రీ॥ శ॥ 1000 - 1500; - 1500 - 1850

ఇస్లామ్ హిందూ భక్తిమార్గము - శైవ వైష్ణవ మతములు కొందఱు మతసాంఘిక సంస్కర్తలు - మహమ్మద్ - త్రిమతాచార్యులు శైవ, వైష్ణవ మతభక్తులు.

హిందూదేశ చరిత్రలో క్రీ॥ శ॥ 320 నుండి 1000 వఱకుగల కాలము పౌరాణికయుగ మనబడును. ఆకాలమున ఉత్తరఇండియాలో పాలించిన గుప్త చక్రవర్తులు దక్షిణ ఇండియాలో రాజ్యముచేసిన చాళుక్య, చోళ, పల్లవ, చోళరాజులు పౌరాణిక హిందూమతము నవలంభించి, దానిని అభివృద్ధిచేసి, దానికి స్వర్ణయుగము కల్పించిరి. ప్రాచీన హైందవ మహర్షులు వేదములను, బ్రాహ్మణములను, ఉపనిషత్తులను, అపౌరుషేయములుగా రచించిరి. తరువాత వారు శ్రౌత, గృహ్యాధర్మ, వేదాంత శ్మృతులను నిర్మించిరి. ఈమైదుశ్మృతులలో తొలి నాలుగును గార్హస్యజీవనమునకు తుది స్మృతి వేదాంతమునకు సంబంధించినవి.


ఋగ్వేద మతమున ఏకేశ్వర ఆరాధన గలదు. బ్రాహ్మణ హిందూమతమున అది కర్మకాండలతో నిండి అనేక దేవతలను ఆరాధించు మతముగా మారినది. ఆ దేవతలలో త్రిమూర్తులనబడు బ్రహ్మ, విష్ణు, శివులు ముఖ్యులు. ఈ బ్రాహ్మణమతము ప్రజాదరణను కోల్పోగా, జైన, బౌద్ధ మతములు వ్యాపించినవి. అవి విగ్రహారాధన, కులభేదములు ఖండించినవి. అన్ని మతములకు చెందు ప్రధాన సూత్రములగు అహింస, సత్యవ్రతము, స్వార్థరాహిత్యము నిర్ణీత ధర్మాచరణము విధించినవి. వానివలన మోక్షము లేక నిర్వాణము లభించునని ప్రకటించినవి. ఈ క్రొత్త మతములు రెండును ప్రాచీన వైదిక మతమును ఉల్లంఘించు నాస్తికమతములని బ్రాహ్మణులు వానిని ఖండించిరి.

అప్పుడు నాస్తికతత్వముగల జైన బౌద్ధమతములను అణగద్రొక్కి తిరిగి ఆస్తిక్యమగు వేదాంత హిందూమతమును పునరుద్ధరింపవలసిన అవసరము కలిగెను. క్రొత్తమతములలో చేరినవారిని తిరిగి వైదిక సనాతన ధర్మము బోధించు హిందూమతమున చేర్చవలసి



**Sri Sankaracharya**

శ్రీ శంకరాచార్యులు



Puri Temple

పూరి దేవాలయం

వచ్చెను. లోపములను తొలగించి మనుస్మృతిపై నిలిచిన హిందూ మత పునరుద్ధరణ ఆవశ్యకమయ్యెను. ఈ పనిచేయుటకు శ్రీ ఆది శంకరాచార్యులు అవతరించిరి. అతడు క్రీ॥ శ॥ రెండవ శతాబ్దమున జన్మించెనని కొందరు చరిత్రకారుల మతము. అతడు క్రీ॥ శ॥ ఎనిమిదవ శతాబ్దమునకు చెందినవాడని పెక్కు చరిత్రకారుల అభిప్రాయము.

మలబారీ ప్రదేశమున కాలాగి గ్రామమున నంబూద్రి బ్రాహ్మణ కుటుంబమున శ్రీ శంకరాచార్యులు జన్మించెను. అతడు ఇరువదియైదు వత్సరముల ప్రాయముననే వేదవేదాంగములు, శృతి స్మృతి పురాణాతిహాసములు సాంతముగా తెలిసికొనెను జైన, బౌద్ధ మతములను దేశముయొక్క నాలుగు దిక్కులందు వాదోపవాదములు సల్పి ఖండించి వేదాంత ప్రబోధముగల అద్వైతమతమే సర్వోత్కృష్ట మని జయప్రధముగా స్థిరపరచెను. తన అద్వైతమతము చిరస్థాయి యగుటకు భారత దేశము నాలుగు మూలల నాలుగు ప్రధాన హిందూ అద్వైత మఠములు స్థాపించెను. అవియే దక్షిణమున శృంగేరివద్దగల ప్రధానమఠము, తూర్పున పూరీ జగన్నాథమునగల మఠము. ఉత్తర మున కాశ్మీరమునందుగల బదరీనారాయణ మఠము, పశ్చిమమున సౌరాష్ట్రతీరమునగల ద్వారక మఠము అనునవి.

శ్రీ శంకరుని అద్వైతవేదాంత హిందూమతమును అవలంబించు వారు స్మార్తులు లేక వైదీకులు. శ్రీ శంకరుడు వేదములకు భగవద్గీతకు, ఉపనిషత్తులకు ప్రఖ్యాత వ్యాఖ్యానములు రచించెను. ఈ మూడు గ్రంథముల వ్యాఖ్యానములనే ప్రస్తానత్రయ మందురు. ఇవియే వేదాంతహిందూమతపునాదులు. అద్వైతమతము. "జీవాత్మ పరమాత్మలు ఒక్కటే. ఎన్నటికి వేరుకావు" అని బోధించును. శ్రీ శంకరుడు సాక్షాత్ త్రిమూర్తులలోని శివుని అవతారమే యని హిందువుల అభిప్రాయము.

శ్రీ రామానుజాచార్యులు 'విశిష్టాద్వైత మతము' అనబడు శ్రీ వైష్ణవ మతమును బోధించి భారతదేశమున స్థాపించెను. ఇతడు క్రీ॥ శ॥ పదకొండవ శతాబ్దమున జీవించెను. విశిష్టాద్వైతమతము జీవాత్మ పరమాత్మలు వేరనియు, జీవాత్మ అనగా శరీరమున జీవిత కాలమున పరమాత్మ యుండుననియు, జీవితాంతమున జీవాత్మ పరమాత్మలో కలిసి లీనమగుననియు బోధించును. ఇట్టైక్యము పొందుటకు జీవుడు భక్తిమార్గమున దైవారాధన గావింపవలెనని అది బోధించుచున్నది. ఇది ఈభారత దేశమున అవతార పురుషుడగు శ్రీరాముని యెడ భక్తిమార్గ ఆరాధన కల్పించినది. దీనిమూలమున జీవుడు దేహము చాలించిన పిమ్మట వైకుంఠ మోక్షప్రాప్తిని పొందగలదని శ్రీ వైష్ణవుల మతము.

త్రిమతాచార్యులలో మూడవవాడు శ్రీ మధ్వాచార్యుడు. ఇతడు ద్వైతమతమును స్థాపించెను. ద్వైతమతము, జీవాత్మ పరమాత్మలు వేరనియు. ఎప్పుడును కలియవనియు బోధించును. శ్రీ వైష్ణవమతము వలెనే ద్వైతమతముకూడ, శ్రీ కృష్ణపరమాత్మను గూర్చిన భక్తిమార్గమును అవలంభించినది. శంకర మతమువలె జ్ఞాన మార్గమును అనుసరించునదికాదు. మాధ్వులు శ్రీకృష్ణుని శ్రీవిష్ణావతారునిగా పూజింతురు. వారి ముఖ్య మతక్షేత్రము మలబారు తీరమున ఉడిపియను పట్నమున గలదు. అచ్చటనే సుప్రసిద్ధమగు శ్రీకృష్ణ దేవాలయ మున్నది.

మధ్వాచార్యుని తండ్రి శ్రీశంకరుని అద్వైతమతమును అవలంబించిన శైవబ్రాహ్మణుడు. అతడుకూడ శ్రీశంకరునివలెనే ఇరువది యైదు సంవత్సరముల ప్రాయమునకు శృతులను, స్మృతులను సొంతముగా నేర్చి సన్యసించెను. తొలుత ఆనందతీర్థులు అను పేర ఆనందేశ్వర దేవాలయమున ప్రధాన అర్చకుడుగా నుండెను. శ్రీ శంకరా



శ్రీ రామానుజాచార్యులు

**Sri Ramanujacharya**



శ్రీ మధ్వాచార్యులు
Sri Madhwacharya

చార్యుల అద్వైత సిద్ధాంతమును అంగీకరింపక, జైన, బౌద్ధ మతములను ఎంత తీవ్రముగా ఖండించెనో అంత తీవ్రముగా అద్వైత మతమునుకూడ అధిక్షేపించెను. తరువాత దేశాటనము ప్రారంభించి పలుతావుల మతవేదాంత వాదోపవాదములందు పాల్గొని తన ద్వైత మత ప్రాముఖ్యము చాటెను. అద్వైతమత ప్రధాన పుణ్యక్షేత్రమగు శృంగేరిపీఠమునకు వెడలి అద్వైత పండితులతో అఖండవాదోపవాదములు సాగించి వారి మెప్పు పడసెను. తరువాత అతడు ఉత్తర హిందూస్థానమునకు వెళ్ళి హిందూమత, సాంస్కృతిక కేంద్రమగు కాశీ పుణ్యక్షేత్రమున నివసించెను. అతడు గంభీరవిగ్రహుడు, భీమ బల పరాక్రమములు గలవాడు. శారీరకముగ ఎంత బలవంతుడో, మానసిక, ఆధ్యాత్మికముగా, అంత ప్రతిభాశాలి; సుప్రసిద్ధవక్త. సంస్కృతమున గంభీర వాక్యములతో అడ్డులేక ఉపన్యసించు శక్తిగలవాడు. అట్లగుటవలన కాశీక్షేత్రమునగల హిందూ విజ్ఞానులు పండితులు ఇతని ప్రతిభలను గాంచి ముగ్ధులగుచుండిరి.

ప్రపంచము మిథ్య అనగా శూన్యము, మాయకాదని మధ్వాచార్యుడు బోధించెను. అది మాయలేక మిథ్య అను అద్వైత సిద్ధాంతము నతడు ప్రమాణ సహితముగా తీవ్రముగా ఖండించెను. ప్రపంచము నిజము చిరస్థాయి అని అతని వాదము. అఖిలాంతర్యామియగు సర్వేశ్వరుడు, విష్ణు నారాయణరూపులు ధరించు పరమేశ్వరుడు. ప్రజలకు కైవల్యము నిచ్చుటకై శ్రీకృష్ణావతారుడుగ జన్మించి లీలా మానుష దేవుడై సంసారజీవనమున పాల్గొనెనని భావించెను. అతడు భక్తి ప్రతిపాదకుడే గాక కర్మవాది. నరులు పవిత్రజీవనములు సాగించి మోక్షము పొందగా పాపాత్ములు తమ పాపఫలితములను అనుభవించుటకు నరకమును చేరుదురని అతడు బోధించెను. ఇతడుకూడ అద్వైతులవలెగాక, వైష్ణవులను అనుకరించి జాతి కులభేదములు ఖండించి

శ్రీకృష్ణభక్తిమార్గమున ముక్తి సంపాదించుటకు అందరికి సమాన హక్కులు గలవని బోధించెను. మాధ్వులకు పురాణపఠనమన్న ముఖ్యము. మధ్వాచార్యులు ముఖ్యముగా తన ద్వైతమతమును బ్రాహ్మణులకు బోధించెను. అందుచే ద్వైతమతస్థులగు బ్రాహ్మణులే ఎక్కువగా గలరు.

త్రిమతాచార్యులు బోధించిన అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మతములు. మతములనే గాక, సాంఘిక సంస్కరణలకు మార్గదర్శకములయ్యెను. ప్రజల వర్ణాశ్రమవ్యవస్థలందు, ఆచార్య వ్యవహారములందు మార్పులు వచ్చినవి. భిన్నత్వ దైవారాధన మార్గములలో ఏకత్వము బోధించు హిందూ పౌరాణికమతము, ప్రజాసామాన్యమున భిన్న రుచులు, భిన్నములగు తెలివి తేటలుగల వ్యక్తులను ఆకర్షించుటకే ఏర్పడినది. ఈభిన్నత్వము నిజము కాకుండినను ప్రత్యక్షముగా మతైక్యతకు భంగము కలిగించినది. ఆకారణముచేతనే త్రిమతాచార్యులు ఈభిన్నత్వ మార్గములందుగల, వేదాంత మతైక్యత నిరూపింప యత్నించిరి. శంకరుడు శివభక్తిని, రామానుజ, మధ్వాచార్యులు విష్ణుభక్తిని ప్రధానముగా తమ మతబోధలు గావించిరి.

కాని క్రమముగా శ్రీశంకరుని శైవము, శ్రీరామానుజాచార్యుని శ్రీవైష్ణవము, వీరశైవ, వీరవైష్ణవ విజృంభణలకు దారితీసి వానిని అవలంభించు అజ్ఞానులగు సాధారణ ప్రజల మతాచార వ్యవహారములందు, ఆవేశపూరితములగు అక్రమ కార్యములకు అవకాశములిచ్చినవి. వీరశైవమును బసవడు బోధింపగా, దానిని వీరశైవాచార్యులగు నాయనారులు ద్రవిడదేశమునను, ఆంధ్రదేశభాగమగు తెలంగాణమందు జంగమ ఆచార్యులును సాధారణ ప్రజలకు బోధించి మతావేశములను రగుల్కొల్పిరి. వీరవైష్ణవ, వీరశైవ మతములు రెండును మతవిషయక కర్మకాండలు కులభేదములు ఖండించుటచే

సాధారణులగు పెక్కుసందిని ఆకర్షించి వారికి శరణ్యములయినవి. ఈమతముల సూక్తులు సులభముగా అనుసరింపతగినవని ప్రజలా మతములందుచేరిరి. ఈవీరశైవ, వీరవైష్ణవ సంఘర్షణలతో మరల హిందుపౌరాణిక మతఐక్యత చెడినది.

ఆదిని అనాగరికులందుగాని నాగరకతగల ప్రాచీన ద్రావిడులందుగాని, ఋగ్వేద ఆర్యులందుగాని కులభేదములు (వర్ణవ్యవస్థ) లేకుండెను. ఆసంఘములందు ప్రజల వృత్తిపూర్వకములగు తరగతి భేదములే తప్ప మతము, పుట్టుకల ననుసరించు, కులభేదములు లేవు. ప్రాచీన ద్రవిడ సంఘమున మీాదినుండి క్రిందికి, భక్తులు, వ్యవసాయదారులు, పాలకులు, పశుపాలకులు, లోహకార్మికులు, వడ్రంగులు, కుమ్మరులు, కాలినడక సైనికులు, జాలరులు, తుడుపు పనులు చేయువారు, ఉండిరి. కాని ద్రవిడ సంఘమున బానిసలు మాత్రము లేకుండిరి.

తరువాత ఉత్తర హిందూస్థానమున ఆర్యులసంఘము వెలసినది. ద్రవిడ సంఘములోని కుటుంబములు తల్లి వారసత్వప్రధానములు (మెట్రియార్కలీ) కాని ఆర్యసంఘ కుటుంబములు తండ్రి వారసత్వ ప్రధానములు (పెట్రియార్కలీ) కుటుంబములు తల్లిసిపట్టి వారసత్వపు హక్కులుగల తల్లి వారసత్వప్రధాన కుటుంబము-నుగురించిన యంశములు ప్రాచీన తమిళ రాజ్యములోని "సంఘం రచయితల" రచనలందు గలవు. క్రమముగా ఆర్యులు తొలుత ఉత్తర భారత ద్రావిడులకు, తరువాత దక్షిణ ఇండియాకు వచ్చి అచ్చటగల ద్రావిడులకు తమమత, సాంఘికాచారములు బోధించి ఆర్యసంఘమున క్రమముగా చేర్చగలిగిరి. దక్షిణ భారత దేశమున జొచ్చి ద్రావిడులందు ఆర్యమత సాంఘికాచారములు స్థాపించిన ఆర్యమహర్షులలో, అగస్త్యుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, భరద్వాజుడు మొదలగువారు

కలరు. క్రీస్తుశకారంభమునకు దక్షిణ ఇండియాలో ఆర్యమత సాంఘిక సాంస్కృతిక ధర్మములు బలముగా నాటుకొని దేశమంతట ఆర్య సాంప్రదాయములను పాటించు వేదాంత, శృతి స్మృతుల బోధించు వైదికమతము వ్యాపింపసాగెను. ద్రావిడులు ఆర్యులమతము, కుల భేదములు, సంఘసంస్కృతి మర్యాదలు పూర్తిగా అవలంభింపసాగిరి.

---

# 9. మధ్యయుగ, ఆధునిక ప్రథమ భాగములు

వీరశైవ, వీరవైష్ణవ విజృంభణ – వీరశైవులగు బసవ, నాయనారులు – వీరవైష్ణవ ఆళ్వారులు - దక్షిణ భారతమున – ఉత్తర భారతమున చైతన్య, జయదేవ, భక్తమీరాభాయి – తుకారామ్, కబీరు – తులసీదాసులు.

క్రీ॥ శ॥ 1000 – 1500 నడుమ మధ్యయుగమున ఇస్లామ్ మతము భారతదేశమున ప్రవేశించి స్థిరపడినది. దీని ఫలితముగా దేశమున పౌరాణిక హిందూమతము, కులభేదములతో నిండిన హైందవ సంఘము కొన్ని మార్పులు చెంది క్రొత్తజీవిత పద్ధతులు అవలంభించినవి. మతరంగమున, భక్తివిధానముగల ఉదార దైవారాధనపద్ధతులు వెలిసినవి. అవి పౌరాణిక హిందూ సంఘమునగల మత కులభేదములు మాన్పి ఐక్యత సాధింపదలచినవి. దాని కొఱకు హిందూ సంఘమున గల కులభేదములు, కష్టమగు కర్మకాండగల దైవారాధనఖండించినవి. ఇస్లామ్ మతము సంస్కృతిదేశమున ప్రవేశించి నిలబడి, మతసాంఘిక విధానములందు స్వతంత్ర, ఐక్యతలను ప్రతిపాదించుచు, భక్తిపరుల మతైక్యత సాధనకుతోడ్పడినవి. అందుచే హిందూమత బోధకులందు, సంఘ సంస్కర్తలందు నూతన భావోదయమయ్యెను.

మతమునందు, సాంఘిక విధానములందు, నూతన భావములను బోధించి ప్రజల ఉత్సాహమును రేకెత్తించి, హిందూ ఇస్లామ్ మతముల సామరస్య, సహకార, స్నేహములు కల్పించుటకు కొందఱు మత-సాంఘిక సంస్కర్తలు బయలుదేరిరి. అట్టివారిలో ఉత్తర హిందూస్థానమున రామానంద్ ప్రథముడు, ముఖ్యుడు. తరువాత లెక్కింపతగినవాడు కబీరు. ఈ యిద్దఱును శ్రీ వైష్ణవ భక్తులు, శ్రీకృష్ణ భక్తులలో వల్లభాచార్యుడు ప్రథముడు. దాని స్థాపకుడు శ్రీరాధామాధవభక్తులలో భక్తచైతన్యుడు లేక గౌరాంగస్వామి వంగదేశమునను, ఒరిస్సాలో భక్తజయదేవుడును, రాజస్థానమునందు భక్తమీరాబాయి ముఖ్యులు. దక్షిణ ఇండియాలో మహారాష్ట్రమున శ్రీ నామదేవ్, మైసూరు రాష్ట్రమున బసవడు, ద్రవిడ రాష్ట్రములందు నాయనారులు ఆళ్వారులను శైవ, వైష్ణవ భక్తులును ముఖ్యులు.

విజయనగర సామ్రాజ్యమున వేదాంత, పౌరాణిక, సనాతన హిందూధర్మములను పునరుద్ధరించి వైదికమత స్థాపనకు, వేదాంత సోదరులు, మహాజ్ఞానులు ఉదారస్వభావులునగు శ్రీనాయనాచార్య, శ్రీ విద్యారణ్యస్వాములు సుప్రసిద్ధులు. భక్తిమతములు కొన్ని లాభములను సాధించినవి. అవి పౌరాణిక హైందవ మతకర్మకాండ, కుల భేద కాఠిన్యములను సడలించినవి. అభివృద్ధికి క్రొత్తభావములతో క్రొత్త సంచలనము కలుగజేసినవి. ఇట్టి నూతనాభిప్రాయములను ఈ భక్తిమతముల విధానములు, పూర్వాచార పరాయణత్వమున బిఱ్ఱబిగిసి మత పట్టుదలలుగల బలముగల హిందూమత ఇస్లాం మతములందు, సహన, సహకార భావములు కల్పింపగలిగినవి. జాతీయైక్యతకు తోడ్పడు, మతసాంఘికైక్యములకు పునాదులు వేయ కలిగినవి. ఈ నూతన భావముల ననుసరించియే పందొమ్మిదవ శతా

బ్ధమున, రామకృష్ణ పరమహంసచే స్థాపితమై, స్వామి వివేకానందుచే వ్యాప్తిగాంచిన వేదాంత మతబోధ సంఘసేవ లక్ష్యములుగాగల రామకృష్ణమిషను ఉద్యమము బయలుదేరినది.

రాజారాంమోహనరాయి, మతైక్యతకొఱకు, సాంఘిక సంస్కరణముల తోడ్పడుటకు, బ్రహ్మసమాజమతమును స్థాపించెను. ఇది వంగదేశమున స్థాపితము. తరువాత పంజాబునందు స్వామి దయానంద సరస్వతి, హిందూ సనాతనధర్మ పునరుద్ధరణకు, ఉదార భావములుగల ఆర్యసమాజమతమును నెలకొల్పెను. మహారాష్ట్రమున మహాదేవ గోవిందరనెడి కేశవచంద్రసేన్ ప్రార్థనసమాజము స్థాపించి వ్యాప్తి చేసిరి. వారు రామమోహనును బ్రహ్మసమాజ మతసూత్రము లను, సంఘసంస్కరణను అవలంభించిరి. బెంగాలుదేశమున రామమో హనరాయి స్థాపించిన బ్రహ్మసమాజమతమును బలపరచి ఈశ్వర చంద్రవిద్యాసాగరుడను సుప్రసిద్ధ పండితుడు. సాంఘిక సంస్కరణలు, ముఖ్యముగా ప్రజాసేవ ప్రారంభించెను. దక్షిణ భారతదేశమున మద్రాసునకు చేరువగాగల అడయారునందు రష్యావనితారత్నము, వేదాంతవిజ్ఞానవతి బ్లావట్స్కిదొరసాని అమెరికా సైన్యాధికారియగు డాక్టరు ఆల్కాటుతో హిందూదేశమునకువచ్చి దివ్యజ్ఞానసమాజము (థియోసఫీ ఉద్యమము) స్థాపించెను. తరువాత ఐరిష్ దేశ విజ్ఞానవతి యగు ఆనిబిసెంటు దొరసాని, వేదాంతమత ప్రబోధనమునకై భారత దేశమునకు వచ్చి అడయారునందు స్థాపించబడిన దివ్యజ్ఞాన సమాజ మున కధ్యక్షురాలై, దివ్యజ్ఞానమతము దేశమున. ఇతర దేశములం దును బోధించెను. అడయారు ఈమత కేంద్రము. ఈమె మతమునందే గాక, సాంఘిక, రాజకీయసేవలందుకూడ పాల్గొని భారత దేశాభి వృద్ధికి తోడ్పడెను.

ప్రసిద్ధ ఆధునిక భక్తిపరుల జీవితములలోని ముఖ్యాంశములను,

వారి మత సాంఘిక సంస్కరణములను, భారత సంఘ మర్యాదల మీద వాని ఫలితములను తెలిసికొనవలెను. భక్తిమార్గములను బోధించినవారు తమ ఇష్టదైవములను గూర్చిన భక్తి మతబోధలు చేసిరి. వారిలో శ్రీరామభక్తులు, శ్రీకృష్ణభక్తులు ముఖ్యులు. ఈ భక్తిమార్గము, సాంఘిక కులభేద బంధములను త్రెంపి స్వేచ్ఛను బోధించినది. హైందవమతమున అవలంభింప కష్టములగు, మతకర్మలను తీవ్రముగా విమర్శించి నిషేధించినది. గాఢమగు భక్తియొక్కటే దాని ప్రధాన ఏకైకసూత్రము. మతకర్మ ఆడంబరములు పనికిరావని భక్తిమార్గము బోధించెను.

ఉత్తరహిందూస్థానమున ఆధునిక యుగమున భక్తిమతబోధకులలో రామానంద్ అగ్రగణ్యులు. అతని జన్మకాలము, జన్మస్థలములను గూర్చిన యంశములు సరిగా తెలియరావు. కొందఱు అతడు ఉత్తర భారతదేశవాసియనియు, కొందఱు అతడు దక్షిణ భారతదేశ భాగమునుండి ఉత్తరమునకు వచ్చి స్థిరపడిన సన్యాసి అనియు అందురు. రామానంద్ గొప్ప శ్రీరామభక్తుడు. అతడు తన మతమున పురుషులను, స్త్రీలనుకూడ భక్తిమార్గమును అవలంభించు శిష్యులు శిష్యురాండ్రగా గ్రహించెను. అతని శిష్యులలో అగ్రగణ్యుడు, సుప్రసిద్ధుడు, భక్తకబీర్. అతడు హిందీభాషలో భక్తగీతములు రచించి, గానముచేసి ప్రజల నాకర్షించెను.

కబీరు ఒక అనాథయగు బ్రాహ్మణ వితంతువుయొక్క మగ శిశువు అనియు, తల్లిచే విడువబడి, నీటా అను మహామ్మదీయ సాలివానిచే కుమారునిగా పెంచుకొనబడెననియు తెలియుచున్నది. తరువాత కబీరు తన పెంపుడు తండ్రియొక్క సాలివృత్తిని అవలంబించి, వివాహమాడి, కుటుంబజీవనమును సాగించెను. సంసారము సుఖముగా

సాగించినను రామభక్తుడగు కబీరు సంసారమునందు విముఖుడై, ఆత్మజ్ఞానపరుడై భక్తిమార్గమున దేవుని ఆరాధించుచుండెను. గొప్ప ఆధ్యాత్మిక జ్ఞానము కలవాడు. మంచి ఆదర్శములు కలవాడు. నిరాడంబరమగు సుగుణసంపత్తికలవాడు. శ్రీరామభక్తుడైనను తన స్వమతాభిమానము ఖొరాను సూత్రములందలి భక్తి విడువలేదు. ఇస్లామ్ మతము, వేదాంతమతము సమాన ధర్మములు, సమాన బోధనలు కలవని అతడు తన ఆధ్యాత్మిక జ్ఞానముచే గ్రహింపకలిగెను. అతడు తన భక్తిగీతములను. నిరుపమమును సూత్మగ్రాహమును సామాన్య ప్రజలకుకూడ బోధపడి, వారిని ఆకర్షించు శక్తిగల హిందీభాష యందు రచించెను. అవి హిందీభాషాయోషకు శాశ్వతాభరణములగు రత్నహారములు.

కబీరు బోధలు, అతని రచనలు, గీతములు, గొప్ప హిందూ వేదాంత జ్ఞానమును బోధించునవి. హిందూవిజ్ఞానులను, పండితులను ఇస్లామ్ మత విజ్ఞానవేత్తలగు మౌల్వీలనుకూడ సమానముగా ఆకర్షించునది. అవి వేదాంత హిందూమత విజ్ఞానుల బోధనల ప్రధానాంశములు కలవి. హిందూ ఇస్లామ్ మతముల సూత్రములందు కన్పట్టు వైరుధ్యము తొలగించి ఆ మతముల ప్రధానసూత్రములందు గల మత ఐక్యతగల భావములు ప్రదర్శింపును. కబీరు హిందూ - ముస్లిమ్ మత, సాంఘిక సహకార ఐక్యతల ఆవశ్యకతను నిరూపించి బోధించెను.

కబీరు గొప్పమహర్షి భగవత్ సాక్షాత్కారమును పొందగలిగిన మహనీయుడు. అతడు గొప్పజ్ఞాని. సుగుణవంతుడై నిర్మలమగు పవిత్రజీవనమును సాగించిన కర్మయోగికూడా. అతడు సాంసారిక జీవనము కర్మవిధానము సాగించినను, తామరాకుమీద నీటిబొట్టువలె అంటీ అంటక దివ్యజ్ఞానియై అమూల్యముత్యమువలె ప్రకా


శించెను. ఏకేశ్వరారాధనగలిగి జ్ఞానము, కర్మమార్గములు బోధించు ఇస్లామ్ భక్తిమార్గముగలిగి ఇష్టదైవభక్తి, కర్మ మార్గానుసరణముల బోధించు భక్తిప్రధాన హిందూమతముతో సమమని కబీరు అభిప్రాయము. ముక్తి అను ఏకైక లక్షణమునకు ఇస్లామ్, హిందూమత భక్తిమార్గములని అతడు బోధించెను. దివ్యజ్ఞానము, మనోనైర్మల్యము సాధించుట కీరెండు మతములు సమానములే అని యతడు తలచెను.

ఉత్తర హిందూస్థానమున రామానంద్ కబీరుల వెనుక సిక్కు-మతస్థాపకుడగు గురునానకు గొప్ప భక్తుడు. నానక్ క్రీ॥ శ॥ 1469లో లాహోరీ పట్నము చేరువగాగల తలవాండి గ్రామమున ఖత్రీవర్ణమునకు చెందిన కుటుంబమున జన్మించెను. అతడు ఉత్తర ఇండియా యందు పర్యటించి వివిధ మతవర్ణములవారి మత సాంఘికాచారములను పరిశీలించెను. వారి వారి జీవితవిధానములు అభిప్రాయములు కనిపెట్టెను. పెక్కు హిందూమత పుణ్యక్షేత్రములను దర్శించెను. తుదకు అరేబియాదేశమున ఇస్లామ్‌మతముఖ్య పుణ్యక్షేత్రమగుమక్కా పట్నమునకుకూడ వెడలెను. అతడు కబీరు బోధించిన భక్తిమత సూత్రముల నవలంభించి సిక్కు మతమును స్థాపించెను. అతడు హిందువులు ముసల్మీనులునడుమ సాధారణముగా భేదములు లేవనియు, అన్ని మతములును, అన్నిటికిని ముఖ్యముగా కావలసిన ప్రధానసూత్రములగు అన్యోన్య సహానభావము, శాంతి, దయార్ద్రబుద్ధి ముఖ్యములని బోధించెను.

గురునానక్ బోధించిన సిక్కు-మతములో, అనుభవజ్ఞానము జీవితవిధానజిజ్ఞాస, గౌరవప్రదమగు నైతిక జీవితమార్గము ప్రధాన సూత్రములుగా గన్పట్టును. అతడు మతవిషయమునగల మూఢనమ్మములు వాని యుత్పత్తి పెరుగుదలలను తీవ్రముగా విమర్శించి ఖండించెను. ఏకేశ్వరారాధన, సంపూర్ణ సాంఘిక సమానత్వము, దివ్య


మైన నైతికజీవనము అను తనమత సూత్రములను ప్రజలకు ఎడతెగక బోధించెను. అతడు సంపూర్ణ భక్తితో సర్వేశ్వరుని, సద్గురు సాహాయ్యమున ఆరాధించినయెడల మోక్షసాధన సత్యమని చాటెను. ఇతడు హిందువుల నుండి మహమ్మదీయులనుండి కూడ పెక్కు శిష్యులను తనమతములోనికి ఆకర్షించెను. వారికి సర్వేశ్వరుని దృష్టిలో సర్వ మానవులు సమానులను భావములను స్థిరముగా నిలుపగలిగెను. గురునానక్ చే ప్రతిష్ఠింపబడిన సిక్కుమతము, అతని తరువాత వచ్చిన తొమ్మండుగురు గురుపుంగవులచే స్థిరస్థాపితమయ్యెను. నానక్ తరువాత వచ్చిన సిక్కుమత గురువులు, తొలుత సాత్విక భక్తిమార్గము నవలంభించిన సిక్కుమతమున ఇస్లామ్ తాకిడులకు జంకక స్వరక్షణకై బలిష్టమై పరాక్రమవంతమగు వీరభక్తి మతముగా పరిమాణమందెను.

ఉత్తర హిందూస్థానమున ఇతర భక్తిమత బోధకులలో చైతన్యుడు అను గౌరాంగస్వామి వంగదేశమునను ఉరియాదేశమునను ముఖ్యుడు. ఇతడు క్రీ॥ శ॥ 1485—1534 సంవత్సరముల నడుమ జీవించెను. వంగదేశమున నాడియా మండలమున నవద్వీపమందు ఒక బంగాళీ కుటుంబమున జన్మించెను. యౌవనమునందే గొప్ప సారస్వత ప్రజ్ఞను జ్ఞానమును సంపాదించెను. సంసార జీవితమునకు ఇష్టపడక సన్యసించెను. అప్పటి కతనికి ఇరువది నాలుగేండ్ల వయస్సు అతడు కన్యాకుమారి అగ్రమునుండి కైలాస శిఖరమువఱకు భారతదేశమంతటను పర్యటించెను. పూరిజగన్నాధక్షేత్రమున చాలకాలము స్థిరనివాసము చేసెను. ఇతడు గాఢమైన శ్రీకృష్ణభక్తి కలవాడు. గాఢమగు కృష్ణభక్తిగల ఆస్తికులు అనంతమగు సంసారసాగరమును శ్రీకృష్ణ భక్తి యను నౌకాసాహాయ్యమున తరించి, మోక్షమను గమ్యస్థానము చేరుకొనగలరని బోధించెను.



**Guru Nanak The Sikh Gurus**

గురునానక్ శిక్కు మతగురువులు



అమృత్ సర్ - బంగారు దేవాలయము

**The Golden Temple at Amritsar**

చైతన్యస్వామి స్ఫురద్రూపి; తనసుందరాకారహావభావ చేష్టలచే భక్తులహృదయములను అయస్కాంత మాకర్షించురీతి ఆకర్షించుచుండెను. అతని భక్తులలో స్త్రీలును పురుషులును ఉండిరి. శ్రీకృష్ణునిగూర్చి. పాడుచు, నృత్యముచేయుచు, భక్తిపారవశ్యమున మైమరచి తాత్కాలిక సమాధియందుండెడువాడు. ఇతడు ప్రజలకు శ్రీకృష్ణతత్వలక్షణములగు; ప్రేమ, భక్తులకు బోధించుచుండెను. భక్తి పారవశ్యమునగల అతనినిచూచి అతని శిష్యులుకూడ భక్తి పారవశ్యమున మైమరచెడువారు. అతని భక్తిగీత గాన నృత్యములను గమనించి వారును అతనివలె భక్తిగీతములు పాడుచు ఆడుచుండెడు వారు. అతడు పెక్కుమంది స్త్రీ పురుషులను సునాయాసముగా తన భక్తిమార్గములోనికి త్రిప్పుకొనగలిగిన మహాభక్తుడు; మహనీయుడు ఇతని శ్రీకృష్ణభక్తి నిరుపమానము.

చైతన్యస్వామి తక్కినభక్తి మత గురువులవలెనే కులభేదములను ఖండించి సర్వమానవసమత్వము ప్రబోధించెను. సర్వాంతర్యామియగు సర్వేశ్వరు డందఱియెడల సమత్వభావమునే చూపి అందఱు తన సంతానముగానే భావించునను సత్యమును తెలియ చెప్పెను. సామాన్యప్రజలు పెక్కుమంది హిందూ ముస్లిమ్ సంఘము నుండి అతని మతములోచేరిరి. అతడు తన మతభక్తులకు శారీరక, మానసిక, నైతిక నైర్మల్యములు ముఖ్యములనియు, ఓర్మి, అణకువ, నిష్కల్మషమగు దైవభక్తి ప్రధానములైన లక్షణములని ఉద్ఘాటించెను. చైతన్య స్వామినిగూర్చి తెలియని వారెవరును బెంగాలు, ఒరియారాష్ట్రము లందుండరని చెప్పుట సాహసము కానేరదు.

వంగ దేశమున చైతన్యస్వామి ఎట్లు పరమపావనుడగు భక్తుడో ఒరిస్సా రాష్ట్రమున అట్టి భక్తుడు భక్తజయదేవ్.

భక్త జయదేవ్ బిల్వా గ్రామనివాసియైన నారాయణభట్టు అను బ్రాహ్మణుని కుమారుడు. అతడు సుగుణశాలి, పండితుడు, కవి; సంగీత సాహిత్యములందు ఆరితేరినవాడు. పూరీ జగన్నాధ క్షేత్ర నివాసి యగు అగ్నిహోత్రుడు అను బ్రాహ్మణుని పుత్రిక పద్మావతి, జయదేవుని భార్య, వారు రాధాకృష్ణ భక్తులై సంసార జీవనమును సుఖముగా సాగించిరి. జీవితములోని సుఖదుఃఖములను పాటింపక, శ్రీ రాధాకృష్ణ ధ్యాన సంకీర్తనములందే కాలము గడుపుచుండిరి. భక్త జయదేవ్ తన సుప్రసిద్ధములగు 'అష్టపదులు' అను శ్రీ రాధాకృష్ణ భక్తి గీతములను, "గీతగోవిందము" అను గ్రంథముగా రచించెను. భక్త జయదేవు శ్రీ రాధాకృష్ణ భక్తిమత తత్వమును 'ఒరిస్సాలోను' ఉత్తర భారతదేశ మంతట స్థాపించిన మహనీయుడు.

మహారాష్ట్ర దేశమున క్రీ॥ శ॥ 1276 నుండి 1358 వఱకు జీవించిన, మహారాష్ట్ర మహర్షి, పరమభక్తుడు నామదేవ్ అనునతడు నామీదేవ్ హిందూ మహమ్మదీయ సఖ్యము సాధించుటకు పాటుపడెను. ఇతడు శూద్రులలో కుట్టుపని వారి కులమునకు చెందినవాడు. ఇతడు పండరీనాధుడను దేవునిగూర్చి పెక్కు భక్తి గీతములు రచించి గానముచేసి పెక్కుమంది పురుషులను, స్త్రీలను, తన భక్తి రస గానములచే ఆకర్షింప గలిగెను. వారందఱు అతని భక్తిని మెచ్చుకొనుచుండిరి. అతడు పవిత్రమగు పండరీ పుర క్షేత్రమున, విష్ణు అవతారము దాల్చిన పండరీనాధుడను విఠలీ దేవుని ఆలయమువద్ద నివసించెడివాడు. తక్కిన భక్తి మతాచార్యులవలెనే ఇతడును ఏకేశ్వరారాధన భక్తి మార్గమున జరుగవలెనని, కష్ట సాధ్యములై ఎవరికిని తెలియని విధానములతో నిండియున్న కర్మకాండల నిర్వహణము నిరుపయోగమనియు, అందరి మానవులకు కన్నతండ్రియగు పరమేశ్వ

రుని దృష్టిలో అందరు సమానులే అనియు కుల భేదములు పడరా దనియు నామ దేవుడు ప్రజలకు బోధించెను.

పెక్కు మతములందలి భక్తులు పరమేశ్వరుని భక్తి శ్రద్ధలతో వేరువేరు నామములతో పిలిచి రక్షింపుమని కోరిన, సర్వేశ్వరుడు అందరి కోరికలను దయతో విని అందరికిని తన దయను ప్రసాదించునని నామదేవు వచించెను. మత సంఘర్షణలు ఉండరాదనియు, హిందూ ముస్లిము మతముల యొక్కయు, వేయేల, అన్ని మతముల యొక్కయు ప్రధాన మత సూత్రములు, ప్రధాన ధర్మములు ఒక్కటే యనియు బోధించెను. ఏకేశ్వరారాధన, లోకేశ్వరుడొక్కడే అను విషయము తెలియనేరని మూఢుల, మూర్ఖుల అజ్ఞానము వలననే మతభేదములు, మత సంఘర్షణలు సంప్రాప్తించినవని అతడు తెలియ చెప్పెను. నామదేవుని మత సూక్తులను పెక్కింటిని, గురునానక్ అవలంభించి, వానిని సిక్కు మత ప్రమాణ గ్రంథమగు ఆదిగ్రంథ్ లేక గ్రంథ్ సాహెబ్ అను గ్రంథమున ఇమిడ్చెను. ఆ గ్రంథమును అతని తరువాత గురువులు బలపరచిరి. నామదేవ్ మత సూక్తులు క్రిష్టియనుల మత గ్రంథమగు బైబిలునందు కూడ ప్రధానధర్మములుగా గన్పట్టును.

ఈ రీతిగా మహారాష్ట్ర మహర్షి యగు నామదేవుడు శ్రీరామ భక్తులచేతను, కబీరు, నానకుల చేతను గౌరవింపబడెను.

దక్షిణ ఇండియా తూర్పు భాగమున ఆంధ్ర దేశమున వేమన యోగి తన సూక్తులందు వేదాంత జ్ఞాన మార్గములుగల ఏకేశ్వరారాధనను బోధించి కులవివక్షతలు గర్హించెను. మద్రాసు ఆంధ్ర రాష్ట్రములందు వైష్ణవ భక్తి తత్పరుడు, సుప్రసిద్ధ శ్రీ రామభక్తుడగు త్యాగయ్య భక్తి గీతములు రచించి గానము చేసెను. ఈ శైవ, వైష్ణవ భక్తి ప్రబోధకులగు భక్త వేమన త్యాగయ్యలను తెలియని

ఆంధ్రు లుండరని చెప్పవచ్చును. త్యాగయ్య తన భక్తి గానామృతమును ఆంధ్రులకు, అరవలకు అందఱికి సమానముగ పంచెను. ఆంధ్రుల వేమనయోగి, అరవల తిరుక్కురాళ్ గ్రంథకర్తయగు తిరువళ్లువర్ మహర్షిని జ్ఞాపకమునకు దెచ్చును.

వేమనయోగి, రెడ్డి రాజవంశమున జన్మించినవాడు. తన యౌవన జీవనమును శృంగార భోగములందు వ్యర్థపుచ్చి, తరువాత తనకు సంప్రాప్తించిన కష్టముల ఫలితముగా సన్యసించి, వేదాంతియై, జ్ఞాన భక్తి కర్మమార్గములను బోధించి జనులకు నీతివర్తనము, ఏకేశ్వరారాధన, ధర్మమార్గము అవశ్యకములని బోధించెను. నైతిక జీవనము ముక్తి సాధనమని చెప్పెను. అతని సూక్తులందఱికి తెలియు అందమైన సరళ తెలుగున కందములు ఆటవెలది తేటగీతి పద్యములందు సూటిగా తెలిపినాడు. త్యాగరాజు భక్తి పరవశమున శ్రీరామునిగూర్చి పాడిన శ్రీరామభక్తి కీర్తనలు వంగదేశపు చైతన్యస్వామి భక్తి గీతములను భక్త జయదేవు గీతములను తలపునకు తెచ్చును.

గాఢ భక్తిమీద స్థాపితములయిన మత బోధనలు, హిందూ ముస్లిమ్ మతముల ఐక్య సహకారములకు కొంత తోడ్పడినవి. కొంతమంది రాజనీతిజ్ఞులు నేటి కాలమున మతైక్యత సాధించుటకు సాంఘిక సంస్కరణ చట్టములను ఏర్పాటు చేయుటకు మార్గదర్శకములయినవి. మధ్యయుగమున కొందఱు హిందూరాజులు, ముస్లిమ్ పాలకులు, గొప్ప హిందూ విజ్ఞానవేత్తలు, ఉదార భావములుగల ముస్లిమ్ మత జ్ఞానులగు మౌల్వీలు, హిందూ ముస్లిమ్ సామరస్య సహకారములు స్నేహము సాధింప యత్నించిరి. అట్టివారిలో ఉత్తర భారత దేశమున అక్బరు చక్రవర్తి వంగరాష్ట్ర పాలకుడు హుస్సేన్ షా, దక్షిణ ఇండియాలో శ్రీకృష్ణదేవరాయ శివాజీ పాల



శ్రీకృష్ణదేవరాయలు

**Sri Krishnadevaraya**



శి వా జీ

**Sivaji**

కులు హిందూ ఇస్లామ్ మతములను, వాని పవిత్ర మత గ్రంథములను ఒక్కరీతిగా ఆదరించిరి. అక్బరు మంత్రి అబుల్ ఫజల్, శ్రీకృష్ణ దేవరాయల మంత్రి తిమ్మరుసు, విశాల భావములుగల రాజనీతిజ్ఞులు.

మతావేశము కలిగి తన మత విజృంభణ ప్రవాహమున హిందూ మతమును ముంచెత్తదలచిన ఇస్లామ్ మతము, వేదాంత భక్తి ప్రపత్తులుగల హిందూ మత సంపర్కమున మెత్త బడి పొంగు తగ్గి వెనుకంజ వేసినది.

ఇస్లామ్‌మత, సాంస్కృతుల సంపర్కమున హిందూమతము కూడ కొంతమార్పు పొందినది. ప్రాచీన భారత సంస్కృతిని ఇముడ్చి కొనిన పండితభాషయగు గీర్వాణము లేక సంస్కృతము క్రమముగా వాడుక నుండి అదృశ్యమయినది. భారతీయుల మతవిజ్ఞాన సాంస్కృ తములకు ఉనికి పట్టుగానిలిచి వాడుకలోగల దేశభాషల అభివృద్ధికి దారిచూపినది. క్రొత్తగా లేచిన హిందూమత భక్తిప్రజల వాడుక భాషలగు ప్రాంతీయ భాషలద్వారా ప్రబోధింపబడినవి. దానితో ఆయా ప్రాంతీయభాషలు వాని సారస్వతములు అభివృద్ధి గాంచ గలిగినవి.

ఇస్లామ్ యొక్క మతావేశ విజృంభణ హిందూమతము యొక్క పూర్వాచార సాంప్రదాయకాఠిన్యము మెత్తబడినది. క్రమ ముగా రెండు మతముల ఉదారభావములు దెలిసినవారి ప్రయత్న ములవలన హిందూ ముస్లిమ్ సహకార మిత్రత్వములకు మార్గ మేర్పడినది. రెండు మతములందు గల జ్ఞానులు అన్యోన్యము, జ్ఞాన సంపాదన అభివృద్ధి చేసికొనగలిగిరి. తుదకు రెండు మతములు సహ కారసహన భావములతో సహజీవితమును సాధించుకొనినవి. మహమ్మదీయులలో విజ్ఞానులు కవులు అగు ఆల్బెరూని చరిత్ర

కారుడు, అబుల్ ఫజిల్ జాని, అబుల్ ఫయిజీ కవి, అమీర్ ఖుస్రూ అను పండితకవి హిందూ ముస్లిమ్ సహకారసహానములకు తోడ్పడిరి.

హిందూ ముస్లిమ్ ఐక్యత, భారత జాతీయైక్యత సాధించు యత్నముల ఫలితముగా కొన్ని మార్పులు సంభవించుచున్నవి. హిందూమతమునగల కులభేదతత్వములు సడలినవి. మతవిషయక మగు కర్మకాండ తగ్గినది. విగ్రహారాధన గట్టిదెబ్బతినినది. సర్వాంతర్యామి సర్వదయాళుడగు సర్వేశ్వరుని ఏకేశ్వరారాధన సాధారణమయినది. ప్రజలు రాజకీయ, మతసాంఘిక సాంస్కృతికములందు సహకారముతో ప్రయత్నించి వాని యభివృద్ధికి, జాతీయైక్యతకు తోడ్పడ ఉద్బోధింపబడిరి. పాశ్చాత్యవిద్య, ముఖ్యముగా ఆంగ్లవిద్యా సంపర్కమున హిందూ సంఘమునగల మూఢాభిప్రాయములు మూఢ నమ్మకములను అను అజ్ఞానాంధకారము అంతరింప నూతన జ్ఞాన భానోదయమైనది.

---

# 10. పంతొమ్మిదవ, ఇరువదవ శతాబ్దముల భారతదేశము సాంఘిక సంస్కర్తలు - జ్ఞానులు

క్రీ॥ శ॥ పంతొమ్మిదవ శతాబ్దమున, బ్రిటిష్ ఇండియారాష్ట్ర స్థాపనఫలితముగా బ్రిటిష్ సంస్కృతి హిందూమత విజ్ఞానములందు కొంతమార్పు అభివృద్ధి తెచ్చినది. మతసాంఘిక ప్రచారక సంస్థలగు కొన్ని సంఘములు స్థాపితములయినవి. అట్టివానిలో బ్రహ్మసమాజము, ఆర్యసమాజము, ప్రార్థనసమాజము, రామకృష్ణమిషను, దివ్యజ్ఞానసమాజములు ముఖ్యములు. ఈసంస్థలు త్వరగావ్యాపించి కొన్ని



Sir R. Venkataratnam Naidu
సర్ ఆర్. వెంకటరత్నం నాయుడు

ముఖ్యములగు మార్పులు తెచ్చినవి, ఆమార్పులు. నవీనభారతసంఘ నిర్మాణమునకు పునాదులయినవి. బలముగల ఆపునాదులమీద మత సాంఘిక, సాంస్కృతిక ఐక్యత, సాహిత్య లలితకళాభివృద్ధి ప్రదర్శించు నవీనభారత సంఘసేధము నిర్మితమగుచున్నది.

బెంగాలునందు బ్రహ్మసమాజ మతస్థాపకుడగు రాజారాం మోహనరాయలు క్రీ॥ శ॥ 1772 - 1833 నడుమ జీవించియుండెను. అతని సంస్కృతి ప్రాచీన భారతీయ నాగరికాదర్శముల, నవీన పాశ్చాత్య సంస్కృతిక లక్షణముల సంపర్కములవలన లభించినది. రామమోహనుడు పాశ్చాత్యమగు ఆంగ్ల సంస్కృతిని అవలంభించెను. అతడు ఆదర్శప్రాయుడగు సంఘసంస్కర్త. మతైక్యతకొఱకు పాటుపడిన మహనీయుడు. మూఢాభిప్రాయములు మూఢ నమ్మకములచే గట్టుపడిన హిందూ సంఘమున అభివృద్ధిసాధకములగు మార్పులు కోరెను. ఇతడు గొప్ప దయాళుడగు సంఘసేవకుడు, అనాథజనబాంధవుడు. అతడు ఉదారభావములను బోధించుటయే గాక, వానిని ఆచరణలో పెట్టెను.

రాజారాంమోహనరాయ్ క్రీ॥ శ॥ 1828 సంవత్సరమున జన్మించెను. బ్రహ్మసమాజ మతమును, వేదాంత మతసూత్రముల పైస్థాపించెను. దానికి ఉపనిషత్తు లాధారములు. మహర్షి దేవేంద్ర నాథటాగూరు, బ్రహ్మసమాజమతమును అవలంభించి, దానిని అభివృద్ధిచేసి బలపరచెను. గొప్ప పండితుడు, నిరాఘాటముగ ఉపన్యసింపగల వక్తయగు కేశవచంద్రసేనుడు. ఈబ్రహ్మ సమాజమతమును దేశమున అన్ని భాగములందు పర్యటించి ప్రచారముచేసెను. ఆంధ్ర ప్రదేశమున సర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు, రావు బహదూర్ కందుకూరి వీరేశలింగం పంతులు, ఈ బ్రహ్మసమాజమతము అవలంభించినవారు. వారు హిందూ సంఘమునగల సాంఘిక మూఢాభి

ప్రాయములు మూఢాచారములు తొలగింప యత్నించిరి. కులభేద ములు ఖండించిరి. బ్రహ్మసమాజమువారు సహగమన దురాచార మును ఖండించి దానిని నిర్మూలించు శాసననిర్మాణమునకు పని చేసిరి. యువతులగు హైందవ విధవల పునర్వివాహమును ప్రోత్స హించి విధవా పునర్వివాహసమాజములు స్థాపించిరి.

బ్రహ్మసమాజమతము మహారాష్ట్రమున బలపడినది. దానిని అవలంభించిన కేశవచంద్రసేనుడు దాని ధర్మముల నిర్వహణకై ప్రార్థన సమాజమును స్థాపించెను. ఆసమాజమును మహారాష్ట్ర ఉన్నతన్యాయస్థాన న్యాయమూర్తి మహాదేవ గోవిందరనెడి బలపరచి దాని ప్రతిభకు కారకుడయ్యెను. అతడు గొప్పజ్ఞాని, ఉత్సాహపరు డగు హిందూమత సంఘసంస్కర్త, ఉదార మనస్కుడగు పరోపకార దురీణుడు. అతడు మహారాష్ట్రమున విధవా పునర్వివాహోద్యమమును ప్రారంభించెను. అతడు భారత జాతీయవిద్యాభివృద్ధికొఱకై, "దక్కను విద్యాసానయిటే" స్థాపించెను. సాంఘికవృద్ధి సాధించు ఉన్నతజాతీయవిద్య సాధనకై అది నిర్మింపబడెను. దాని విద్యా విధాము ప్రాచీన భారతీయ విద్యావిధానములను, ఆధునిక పాశ్చాత్య ఉన్నతవిద్యాదర్శములను ఆకలించుకొన్న నవీనవిద్యాసంస్థ గోవింద రెనడీ, భారతజాతీయ స్వరాజ్యోద్యమ ఆదర్శముగాగల అఖిల భారతదేశకాంగ్రెస్ యొక్క తొలి సమావేశము క్రీ॥ శ॥ 1885లో బొంబాయినగరమున జరుగుట కెంతయో తోడ్పడెను. భారత యువతీ యువకులకు ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతుల మిళితమగు జాతీయవిద్యావిధాన మార్గముల అభినవభారత సంస్కృతిని నేర్పు టయే దక్కను విద్యాసంస్థయొక్క ప్రధాన లక్ష్యము.

ఆధునికయుగ సాంఘిక - మతోద్యమములలో బ్రహ్మ సమాజ, ప్రార్థనసమాజముల తరువాత మూడవది ఆర్యసమాజము.



శ్రీ వీరేశలింగం

Sri Veeresalingam



గోపాలకృష్ణ గోఖలే

Gopala Krishna Gokhale



రాజా రాం మోహనరాయలు

Raja Ram Mohan Roy

దీనికి రెండు సాంస్కృతిక లక్ష్యములు కలవు. పాశ్చాత్య సంస్కృతిని, నవీన భారత సంస్కృతితో లీనము కావించి, అనుకరణ విధానమును అవలంభింపక, భారతలక్ష్య ప్రధానమగు క్రొత్త భారతసంఘ నిర్మాణము ఒకటి. రెండవది ఆక్రొత్త నిర్మాణము ననుసరించి నవీన అవసరములు, సాంఘికాభిప్రాయములు అనుసరించిన భారత ప్రాచీన ప్రతిభను పునరుద్ధరించి, భారత దేశము ప్రపంచమున మతవిజ్ఞాన విషయములందు ఇతర దేశములకు గురుత్వము వహింపజేయుట దాని రెండవ లక్ష్యము. క్రీ. శ॥ 1875 సంవత్సరమున స్వామిదయానంద సరస్వతి ఈఆర్య సమాజమతము స్థాపించెను.

ఆర్యసమాజమతము ఒక్క దేవుడగు సర్వేశ్వరుని ఆరాధన, విగ్రహారాధన విడుచుట, కులభేదములు పాటింపకుండుట, సర్వమత, సర్వసంఘ సమ్మతములగు ప్రధానసూక్తులగు సత్యము, అహింస శారీరక మానసికశుద్ధి, ధర్మమార్గ, న్యాయమార్గములను అవలంభించుట అను సూక్తులు ప్రబోధించుట అను ప్రధానలక్ష్యములతో బోధింపబడెను. వీనివలన ప్రపంచమున సర్వమానవ సమ్మతమగు మతము, సర్వమానవసౌభ్రాతృభావము పెంచు సంఘము ప్రపంచ శాంతి, ఒభివృద్ధి సాధింపవచ్చునని ఆసమాజమువారి అభిప్రాయము.

ఆర్యసమాజమతము పంజాబునందు జన్మించి, ఆరాష్ట్రమంతట వ్యాపించినది. దయానందుడు ఈఉద్యమమును గొప్ప మానసిక ధైర్యముతో ప్రబోధించెను. పెక్కుమందిని తన మతములోనికి ఆకర్షింపకలిగెను. దీనిని అవలంభించి హిందూమతము శాంతియుతముగా ఇతర మతస్థులను ఒప్పించి, ఇతర మతములతో సహజీవన సౌఖ్యము పొందినది. బ్రహ్మసమాజమువలెనే ఆర్యసమాజముకూడ వర్ణాశ్రమ కులభేదములను ఖండించినది, బాల్యవివాహములు నిర

సించినది. అట్లయినను వేదాంతమతమునకు హిందూసనాతన ధర్మము లను నిలబెట్టినది. విధవా పునర్వివాహములను అనుమతించినది. ఆర్య సమాజమతమువారు వేదాంత సనాతన హిందూమత, హిందూసంఘ సాంప్రదాయములను గౌరవింతురు.

ఆర్య సమాజమతము, అన్యమతసహనము, ఇతరమతములతో సహకార సహజీవనము కలది. అవసరములగు సాంఘిక సంస్కరణ లను అది ఆమోదించును. ఉదారభావములు కలదగుటచే పేరు ప్రతిష్ఠలు సంపాదించినది.

క్రీ॥ శ॥ 1834 - 1860 సంవత్సరముల నడుమ వంగదేశమున శ్రీరామకృష్ణ పరమహంస వేదాంతమతము స్థాపించెను. దానిని అతని ప్రధాన ప్రియశిష్యుడు స్వామి వివేకానంద భారతదేశమంత టను పర్యటించి, దాని ధర్మములను బోధపరచి, రామకృష్ణమిషన్ అను సంస్థను స్థాపించెను. వివేకానందుడు ఈవేదాంతమతమును భారతదేశముననే గాక ప్రపంచమునగల ఇతర దేశములందుకూడ వ్యాపింపజేసి దానికి ప్రపంచ మతములన్నిటిని సాధించిన మతవైజ్ఞా నిక విశ్వవిజయఖ్యాతిని చేకూర్చెను.

స్వామి రామకృష్ణ కలకత్తానగరము చేరువగాగల దక్షి ణేశ్వర కాళీదేవాలయమున ప్రధానఅర్చకుడుగా నుండెను. పర మేశ్వరునిగూర్చి దీర్ఘతపస్సుచేసి, 'ప్రార్థన' సమాధియవస్థలందు పరమేశ్వరుని సాక్షాత్కారమున పొందగలిగిన మహనీయుడతడు, క్రమముగా అతడుఆధ్యాత్మిక చింతయందు పరమహంసయయ్యెను. తొలుత అతడు విద్యలేని ఒకబీద అర్చకుడుగానే యుండెను. కాని క్రమముగా అతడు దివ్యజ్ఞానమును సంపాదించి మహర్షి కాగలిగెను. భక్తిప్రార్థన మతావేశములందు స్పృహతప్పి జ్ఞానయోగప్రభావమున పరమేశ్వర సాక్షాత్కారము పెక్కుసారులు పొందకలిగెను. అతడు



శ్రీ రామకృష్ణ పరమహంస
Sri Rama Krishna Paramahamsa



శ్రీ స్వామి వివేకానంద

**Sri Swami Vivekananda**

గొప్ప ఆధ్యాత్మికజ్ఞాని, వేదాంతి, అప్పటి పాశ్చాత్యవిజ్ఞాన వేదాంత వేత్తలకంటె ఎన్నిరెట్లు మెరెట్లు అధికుడు అని పాశ్చాత్యజర్మనీ విజ్ఞాన వేత్త పండితుడు అగు ప్రఫెసర్ మాక్సుముల్లర్ ద్వార వక్యాణించెను.

ప్రపంచమున అన్ని మతములు వాని వాని ప్రధానసూత్రము లందు ఐక్యభావములు కలవని రామకృష్ణపరమహంస అభిప్రాయము. అతడు "సత్యము"ను గ్రహించుటయే గాక దానిని బోధపరచెను. ధృవపరచెను. నిరూపించి ప్రపంచఖ్యాతి గాంచెను. అతని దివ్యజ్ఞాన జ్యోతి, అజ్ఞానాంధకారమును పటాపంచలు గావించినది; మూఢాభి ప్రాయ మూఢ నమ్మకములను నిర్మూలించినది; అంతరాత్మలను వెలిగించినది. ఆమహాత్ముడు బోధించి ఈవేదాంతమతమును అతని శిష్యుడు వివేకానందస్వామి అభినవభారత మతప్రబోధముగా ప్రపంచమున వ్యాప్తిగావించెను.

వివేకానందుడు రామకృష్ణ వేదాంతమతమును భారతదేశము నందేగాక ప్రపంచమునగల ముఖ్యదేశములందలి విజ్ఞానకేంద్రము లలో ప్రబోధించెను. బ్రిటను, ఫ్రాన్సు, అమెరికా సంయుక్తరాష్ట్ర ములు, ఆసియాలో చీనా జపాను దేశములందు రామకృష్ణమిషన్ ఉద్యమమున ఈనవీన భారత వేదాంతమతము వ్యాప్తియైనది. వివేకా నందస్వామి ఆంగ్లభాషలో పట్టభద్రుడు. మంచివక్త గొప్పవిజ్ఞాన, వేదాంత సూత్రముల ననుభవపూర్వకముగా తెలిసికొనినవాడు. క్రీ॥ శ॥ 1893లో అతడు అమెరికా సంయుక్త రాష్ట్రములలో చికాగోనగరమున సమావేశమైన అఖిల ప్రపంచ మతసమావేశ మున, హిందూ వేదాంతమతమునుగూర్చి యిచ్చిన గంభీరోప న్యాసము అతని ఆధ్యాత్మిక, సారస్వతవక్తృత్వ ప్రతిభలను తెలియ చేయకలదు. అతడు వేదాంతమత పునరుద్ధరణ ప్రచారమును దివ్యాస్త్రమున సర్వప్రపంచమును ఆధ్యాత్మికముగ జయించిన మహావీరుడు!

వివేకానందస్వామి హిందూమతము, హిందూ వేదాంతముల గురించి గ్రంథములు రచించెను. అందు అతడు రచించిన మత సూత్రముల గ్రంథము. భక్తి, జ్ఞాన, కర్మ యోగములను వివరించి రచించిన ఉద్గ్రంథములు శాశ్వతకీర్తిని గడించి మానవులందఱను దివ్య వేదాంత మార్గమున ఆముష్మిక సౌఖ్యములను అందజేయగల గ్రంథరాజములు. స్వామి వివేకానందునిచే ప్రపంచమంతట బోధింపబడిన వేదాంత మతము. ఈ నవీన యుగమునగల నాలుగు ముఖ్య మతములగు బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ, (ఇస్లామ్) హిందూ మతములలోని ప్రధాన మత సూత్రములను సమన్వయించు స్వభావము గలది.

వివేకానందుడు సర్వ మానవ సమత్వమును బోధించెను. జాతి కుల భేదములను ఖండించెను. అంటరానితనము అవమానకరమని బోధించెను. భారత దేశముననేగాక అఖిల ప్రపంచమునందును బయలుదేరిన జాతి, మత, కుల, సాంఘిక, రంగు భేదములను విస్మరించి, విశ్వ మానవ కళ్యాణమును, ప్రపంచ శాంతిని సాధించునది వేదాంత మతమే అని బోధించెను. అభినవ ప్రపంచమున మత - సాంఘిక సంస్కర్త లందరిలో వివేకానందస్వామియే అగ్రగణ్యుడనుట నిర్వివాదాంశము.

వివేకానందుని మతమును ఈ యిరువదవ శతాబ్దమున భారత పిత మహాత్మా గాంధి అవలంభించెను. వివేకానందునిచే స్థాపింపబడి అతని శిష్యులచే ప్రపంచమంతట వ్యాప్తి చేయబడిన రామకృష్ణ మిషనోద్యమము సర్వజనసమ్మత వేదాంతమతమును స్థాపించుటయే గాక దాని ప్రవర్ధనకు సంఘసేవకు తోడ్పడు పాఠశాలలు కళాశాలలు స్థాపించి మతసేవ, విద్యాసేవ, ప్రజాసేవ చేయుచున్నవి. పరోపకార కృషి వివేకానందుడు స్థాపించిన రామకృష్ణ మిషన్ యొక్క ముఖ్య




Pandit Madan Mohan Malavya
మదన్ మోహన్ మాలవ్యా



Ranjit Singh
రంజిత్ సింగ్

కార్యములలో నొకటి. ప్రాచీన భారత వేదాంత విజ్ఞాన జ్యోతులను వెలిగించి, నవీన భారతమున వానిని పునరుద్ధరించి ప్రపంచ శాంతికై ఈ జ్ఞానమున ప్రపంచమున వ్యాప్తి చేయుట ఈ మిషనువారి ముఖ్య కృషి.

క్రీ॥ శ॥ 1829 లో, ఆర్య సమాజమువారి ఆహ్వానముపై హెచ్. పి. బ్లావిస్కీ అను రష్యా ఆధ్యాత్మిక విజ్ఞాన విదుషీమణి హెచ్. ఎస్ ఆల్కాట్ అను అమెరికా సైన్యాధికారితో ఇండియాకు వచ్చి మద్రాసు వద్ద అడయారులో దివ్యజ్ఞాన కేంద్రమును స్థాపించెను. ఈ దివ్యజ్ఞాన మతము ప్రాచీన భారత వేదాంత జ్ఞానసారాప్యమే. ఉపనిషత్తులే ఈ దివ్యజ్ఞాన మతముయొక్క పునాదులు. భారత వేదాంత సనాతన పునరుద్ధరణమే. ఈ దివ్యజ్ఞాన సమాజ లక్ష్యము. ఈ దివ్యజ్ఞానోద్యమము వివేకానందస్వామి విదేశములందు వ్యాప్తిగావించిన ప్రాచీన భారత వేదాంత మతబోధయొక్క ఫలితమేకాని వేరుకాదు.

క్రీ॥ శ॥ 1893 లో, ఆనీబెసెంటు అను ఐరిష్ వేదాంత జ్ఞాన విదుషీమణి భారత దేశమునకు వచ్చి, మద్రాస్ వద్ద అడయారునందు స్థిరనివాస మేర్పరుచుకొని అచ్చట స్థాపింపబడిన దివ్య జ్ఞాన మత సంస్థకు అధ్యక్షురాలయ్యెను. అచ్చటనుండి భారతదేశ మంతటను పర్యటించి దివ్య జ్ఞాన జ్యోతి కాంతులను వివిధ స్థలములకు వ్యాప్తి గావించెను. ఆమె ప్రాచీన వేదాంతమతమునేగాక, ప్రాచీన భారత సంస్కృతినికూడ పునరుద్ధరింప ప్రయత్నించెను. ప్రాచీన భారత విజ్ఞానమును, దివ్యజ్ఞానమును బోధింప హిందూ సాంస్కృతిక విద్యా కేంద్రమగు కాశీయందు హైందవ విద్యాకేంద్రమును స్థాపించెను. ఇదియే క్రమముగా అభివృద్ధిగాంచి నేటి ప్రఖ్యాతమగు కాశీలోని హైందవ విశ్వ విద్యాలయముగా అవతరించినది.

దివ్యజ్ఞాన సమాజ కృషివలన నూతన వేదాంత మత పునరుద్ధరణముతో మత మీమాంస విజ్ఞానములు మతసంఘసాంస్కృతిక మార్పులుకూడ కలిగినవి. దీనితో ఈ యిరువదవ శతాబ్దమున కొన్ని నూతనమత సాంఘికోద్యమములు క్రొత్తవి తయారైనవి. అవి భక్తి మార్గ ప్రబోధములచే ప్రజలను ఆకర్షింపగలిగినవి. అవి మంచిభక్తి నైతికవర్తనలు కల ఋషులవంటి వ్యక్తులచే స్థాపింపబడినవి. అట్టి ఉద్యమములలో హారనాధబాబా స్థాపించిన హారినాధమతము, సాయ్ బాబా, మెహార్బాబాలు స్థాపించిన భక్తిసమాజములు, కర్మయోగి నవీన విజ్ఞాన సంపన్నుడు నగు రాధాస్వామి స్థాపించిన సత్సంగ సమాజములు ముఖ్యములు. హారనాద్ బాబా, సాయి బాబా, మెహార్బాబాలు భక్తిమార్గ పరులు. రాధాస్వామి కర్మ జ్ఞాని కర్మయోగి అని చెప్పవచ్చును. వీరు సామాన్యజనుల మత, సాంఘిక నైతిక జీవనముల మంచిమార్గము లేర్పరచి సంఘోద్ధరణకై పాటుపడువారు.

హారనాద్ బాబా, సాయిబాబా, మెహార్బాబాల మతము లందుకొన్ని అద్భుత మతాచరణ విధానములు, కూడ గలవు. అవి గాఢమగు భక్తి గలవారికేగాని సామాన్యులకు అర్థములుకావని ప్రజలనమ్మకము. రాధాస్వామి స్థాపించిన సత్సంగ సమాజ మతమున సామాజిక బృందారాధన, నైతిక వేదాంత మార్గములందు సామాజికాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడు విధానములు, ముఖ్యములు.భారత సంఘము నవీనపద్ధతులలో మత, నైతిక, సాంఘికము లందు, ఆర్థికాభివృద్ధి విధానములందు సహానసహకారములతో కృషి చేసి భారతజాతి అభివృద్ధి సర్వతోముఖముగా సాధించుటయే ఈ సత్సంఘమువారి అభిప్రాయములు, లక్ష్యములు. ఆగ్రానగర పరిసరములందుగల సత్సంగ సమాజమువారి దయాల్ బాగ్ కేంద్రము



మహాత్మా గాంధిజీ
Mahatma Gandhi



శ్రీ జవహార్ లాల్ నెహ్రూ

Sri Jawharlal Nehru

నగల వారి పనిపాటులందు సంఘ ప్రార్థనలందు ఈ సమాజాశయ ములు ప్రస్ఫుటము లగుచున్నవి.

నవీన భారత దేశమున పాశ్చాత్యమగు ఆంగ్ల విద్యా సంపర్కమునను, పాశ్చాత్య సాంస్కృతిక విధానముల సంపర్కముల వలనను, భారత రాజకీయ నాయకులందు స్వతంత్ర ప్రభుత్వ స్థాపనాభిలాశ రేకెత్తి ప్రబలినది. అట్టి నాయకులలో మహాత్మా గాంధి, జవహర్లాల్ నెహ్రూ మొదలగువారు. విజ్ఞాన వేత్తలలో మదనమోహనమాలవ్యా, సర్వేపల్లి రాధాకృష్ణ మొదలగువారు ముఖ్యులు. వీరు దేశమున సాంఘిక ఆధ్యాత్మిక, జ్ఞానబోధలు యువతీ యువకులందు రగుల్కొల్పి సహకార పద్ధతితో, నవీన భారత రాజకీయ, సాంఘిక సాంస్కృతిక నూతన భావోదయము కల్పించి, వారు దేశము మరల తన ప్రాచీన వైభవముతో నవీన నాగరికలక్షణములను అవలంభించి ప్రకాశింపచేయ పాటుపడు చున్నారు.